కిషన్‌చందర్ రచనలు-1
రూ.. 200/-
పేజీలు: 220




నవచేతన పబ్లిషింగ్ హౌస్

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



బిజెపికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆమోదం

బ్రిక్స్ చైర్మన్ హోదాలో అమెరికాను మోదీ ఎదిరించగలడా?

రాష్ట్రానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 222 | శనివారం | 12-07-2025 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## పార్లమెంటరీ పోరాటంతోనే దీటైన

# రాజకీయ శక్తిగా నిలుస్తాం

గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మరింత బలపడాలి

ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల ద్వారా దేశానికి గొప్ప సందేశం ఇవ్వాలి

- సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీ నుండి పార్లమెంట్ స్థాయి వరకు భారత కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. పార్లమెంటరీ పోరాటం ద్వారానే దీటైన రాజకీయ శక్తిగా నిలుస్తామన్నారు. వామపక్షాలు, కమ్యూనిస్టుల ఐక్యతకు సిపిఐ కట్టుబడి ఉందని, అదే సమయంలో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం పెంచుకోవాలని, క్షేత్రస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. డిసెంబర్‌లో ఖమ్మంలో జరగనున్న 'సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల'ను జయప్రదం చేయడం ద్వారా దేశం, ప్రపంచానికే ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం శుక్రవారం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డి.రాజా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను వివరించారు. రాజా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నినాదం 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కాంగ్రెస్ పార్టీపై ప్రభావాన్ని చూపిందని, ప్రస్తుతం 'మావోయిస్ట్ ముక్త్ భారత్ 'పేరుతో మోదీ ప్రభుత్వం నక్సలైట్లపై కాల్పులు జరుపుతోందని, ఆ తర్వాత 'కమ్యూనిస్టు ముక్త్ భారత్' అనే ప్రమాదం లేకపోలేదన్నారు. అందుకే కమ్యూనిస్టులంతా తరువాయి 2లో

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం విఫలం : అజీజ్‌పాషా

"ప్రధాని మోదీ 77 దేశాలను సందర్శించినప్పటికీ పాకిస్తాన్ చేసిన 'పెహల్గామ్ దాడి' తర్వాత ఒక్క దేశం కూడా భారతదేశానికి మద్దతుగా నిలువలేక పోయింది. విదేశీ వ్యవహారాల విధానం విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందింది. కేంద్రంలో మోదీ అధికారంలో లేనప్పుడు క్రూడ్ ఆయిల్ ధరలు వంద డాలర్లు ఉండేదనని, ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ధరలు 58 డాలర్‌లుగా ఉండగా, పెట్రోల్ ధర రూ.1.10లకు పెరిగింది."

# ఫీజుల పెంపునకు అనుమతివ్వం

- హైకోర్టులో ఇంజనీరింగ్ కాలేజీలకు చుక్కెదురు
- కాలేజీల అభ్యర్థనను తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం
- 6 వారాల్లోగా కమిటీ సిఫార్సులు, ఆపై ప్రభుత్వ తుది నిర్ణయం తీసుకోవాలి
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజుల పెంపునకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 'కాలేజీల వినతి మేరకు ఫీజుల పెంపునకు అనుమతిస్తే తెలంగాణ ప్రవేశాల నియంత్రణ కమిటీ (టిఎఎఫ్‌ఆర్‌సి) కోరలు పీకేసినట్లు అవుతంది. పళ్లు లేని పులి లాగా అవుతుంది. కాలేజీల అభ్యర్థన మేరకు టీఏఎఫ్‌ఆర్‌సీ సమావేశం నిర్వహించి రిజిస్టర్‌లో నమోదు చేసిన విషయాలను ఆధారంగా ఫీజుల పెంపు సాధ్యంకాదు. టీఏఎఫ్‌ఆర్‌సీ సమావేశౌ రిజిస్టర్ ఆధారంగా నిర్ణయం తీసుకోడానికి అదేమీ తుది నిర్ణయం కాదు. టీఏఎఫ్‌ఆర్‌సీ ప్రభుత్వానికి సిఫార్సు మాత్రమే చేస్తుంది. ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. కాలేజీలిచ్చిన ఫీజుల పెంపు ప్రతిపాదనలపై బుధవారం నుంచి టీఏఎఫ్‌ఆర్‌సీ నిర్ణయం తీసుకోవాలి. ఆ సిఫార్సులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఈప్రక్రియ మొత్తం 6 వారాల్లో పూర్తి చేయాలి. అంతిమంగా ఫీజుల పెంపుపై హైకోర్టు వెలువరించే తీర్పుకు లోబడి ఉంటాయి. ఈ మేరకు అడ్మిషన్లు పొందే విద్యార్థులకు కన్వీనర్ తెలియజేయాలి. వెబ్‌సైట్, ఇతర విధానాల ద్వారా కూడా కన్వీనర్ తెలియజేయాలి.' అని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఫీజుల పెంపు ప్రతిపాదనలపై టీఏఎఫ్‌ఆర్‌సీ జరిపిన మీటింగ్ రిజిస్టర్‌లో నమోదు చేసిందని కాలేజీలు చెప్పిన వాదనల మేరకు ఆ రిజిస్టర్‌ను పరిశీలిస్తే.. అందులో సభ్యుల సంతకాలు లేవు. కాలేజీల ఫీజుల పెంపు ప్రతిపాదనలను టీఏఎఫ్‌ఆర్‌సీ తగ్గించి రిజిస్టర్‌లో నమోదు చేసిందనే కాలేజీల వాదనల మేరకు ఉత్తర్వులు ఇవ్వబోం. రిజిస్టర్‌లో నమోదు తరువాయి 2లో

## 75 ఏళ్లు నిండితే


# దిగిపోవాలి

ప్రధాని మోదీకి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ పరోక్ష సంకేతాలు?

- సీనియర్‌లను తప్పించిన మోదీ తప్పుకుంటారా? : ప్రతిపక్షాలు
- 2029 వరకు మోదీనే : అమిత్ షా



**పూణె :** తాజాగా ఆర్‌ఎస్‌ఎఫ్ ఛీఫ్ వ్యాఖ్యలతో త్వరలో 75 ఏళ్ళు పూర్తి చేసుకోనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదవి నుంచి తప్పుకునే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ మోరోపంత్ పింగ్లే స్మృతులతో ప్రచురించిన పుస్తకావిష్కరణ సభలో "75 ఏళ్లు నిండితే ఆగిపోయి ఇతరులకు అవకాశం ఇవ్వాలని ప్రకృతి సంకేతమిస్తుంది'' అని ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి, ఊహాగానాలకు తెరలేపాయి. వచ్చే సెప్టెంబర్ మాసంలో మోదీకి 75 సంవత్సరాలు నిండనుండడంతో ఆయన వ్యాఖ్యలు ప్రాధానత్యను సంతరించుకున్నాయి. పింగ్లేతో హాస్యభరిత సన్నివేశాన్ని భాగవత్ గుర్తు చేసుకుంటూ 75 ఏళ్ళ తరువాత శాలువాతో సన్మానం చేయడమంటే, పదవీ విరమణకు సమయం ఆసన్నమైందని, తరువాత తరానికి అవకాశం ఇవ్వాలని సమాజం మర్యాద పూర్వకంగా గుర్తుచేయడమేనని ఆయన అన్నారని చెప్పారు. దేశ సేవ పట్ల పింగ్లే అత్యంత నిబద్ధడైనప్పటికీ, ఒకసారి వయసు మీదపడిన తరువాత గౌరవప్రదంగా పక్కకు తప్పుకోవాలని విశ్వసించే వారని తెలిపారు. భాగవత్ వ్యాఖ్యలు అంతర్లీనంగా ప్రధాని మోదీని ఉద్దేశించినవేనని విస్తృతంగా వ్యాఖ్యలు వినపడుతున్నాయి. వీటిపై ప్రతిపక్ష పార్టీలు వరుసగా స్పందిస్తున్నాయి. శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ ఎల్.కె.అద్వానీ, తరువాయి 2లో



## రాజ్యాంగానికి ఇక అచ్ఛేదిన్

కాంగ్రెస్ ఎద్దేవా

**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ 75 ఏళ్ల వయసులో తాను తన పదవినుంచి తప్పుకుంటున్నట్లు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలతో విరుచుకుపడింది. ప్రధానమమంత్రి విదేశాల నుంచి తిరిగి వస్తున్నప్పుడు మోదీకి సరసంఘ్ చాలక్ భాగవత్ తనకు 75ఏళ్లు నిండాయన్నవిషయాన్ని వెల్లడించారని కాంగ్రెస్ గుర్తుచేసింది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలను 'మంచివార్త' అని చెప్పింది. ఈ సంవత్సరం భాగవత్‌కు, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి 75ఏళ్లు నిండి పదవి నుంచి పక్కకు తప్పుకోనున్న కారణంగా దేశానికి, రాజ్యాంగానికి 'అచ్ఛేదిన్' అని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తరువాయి 2లో

# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- బిసి రిజర్వేషన్లతో కల్వకుంట్ల కవితకు ఏం సంబంధం?
- తమ ఘనతే అని చెప్పుకోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు
- స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేబినేట్ నిర్ణయంతో గాంధీభవన్‌లో సంబరాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల(బిసి) కు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ బిసి సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతో సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని ఉద్ఘాటించారు. బిసి రిజర్వేషన్లతో కవితకు ఏమి సంబంధం ఉందని ఆయన ప్రశ్నించారు. కవిత చోటా మోటా ధర్నాలు చేసి ఆమె వల్లే బిసి రిజర్వేషన్ సాధ్యమైందని ప్రకటించుకోవడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తరువాయి 2లో

# 14న కొత్త రేషన్ కార్డులు

- తుంగతుర్తి నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా లాంఛనంగా ప్రారంభం

## రాష్ట్రవ్యాప్తంగా 2.4 లక్షల కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 14వ తేదీన తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నారు. తద్వారా 11.30 లక్షల మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరనుందని ప్రభుత్వం తెలిపింది. గడిచిన ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులను పంపిణీ చేసిందని, కొత్తగా జారీ చేసిన రేషన్ కార్డులతో కలిపి రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 94,72,422 కు చేరుతుందని,తద్వారా మొత్తంగా 3 కోట్ల 14 లక్షల మంది లబ్ధి చేకూరనుందని ప్రభుత్వం వివరించింది.

## సామాజిక న్యాయానికి కట్టుబడ్డాం

- ఏ రాష్ట్రం చేయనివిధంగా 1.04 లక్షల ఎన్యూమరేటర్లతో బిసి కులగణన చేశాం
- స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేసుకున్నాం
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్
- తిరుమలగిరిలో ముఖ్యమంత్రి సభ ఏర్పాట్ల పరిశీలన



ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

ప్రజాప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరి నందు ఈనెల 14న ముఖ్యమంత్రి చేతుల మీదుగా నూతన రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభోత్సవం చేసే సభపై జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా తరువాయి 12లో

కాళేశ్వరంపై కేబినేట్‌లో ఆరు సార్లు నిర్ణయాలు..

## మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం

పిసి ఘోష్ విచారణ కమిషన్‌కు ప్రాజెక్టు పత్రాలు సమర్పించిన మాజీ మంత్రి హరీశ్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి అప్పటి రాష్ట్ర మంత్రివర్గంలో (బిఆర్‌ఎస్/టిఆర్‌ఎస్ ప్రభుత్వం) ఆరు సార్లు నిర్ణయాలు జరి గాయని, మూడు సార్లు శాసన సభ ఆమోదించిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తెలిపారు. హైదరాబాద్,బిఆర్‌కె భవన్‌లోని జస్టిస్ పి.సి ఘోష్ విచారణ కమిషన్‌ను హరీశ్‌రావు శుక్రవారం కలిసి తరువాయి 2లో

## రోహిత్ వేముల ఆత్మహత్య కారకులకు పదోన్నతులా?



డిల్లీలోని మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పిహెచ్‌డి విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన వారిపై బిజెపి నాయకత్వం చర్యలు తీసుకోకుండా, ప్రోత్సహిస్తూ ఉన్నత పదవులు ఇచ్చిందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు.పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు తరువాయి 12లో

## సిఎం రేవంత్ రెడ్డికి బిసి సంఘాల కృతజ్ఞతలు



స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బిసి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బిసి సంఘాల నాయకులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఉన్నారు.

# ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవండి

కర్రెగుట్టలో తిరిగి గాలింపు మొదలైంది

'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో డిజిపి డాక్టర్ జితేందర్



(బి.వాసుదేవరాజు)

ప్రజాస్వామ్యంలో హింసా మార్గానికి తావులేదని, మావోయిస్టులు ఆయుధాలు అప్పగించి జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టు నాయకులు, సభ్యులకు పునరావాసం కల్పించి, వారిపై ఉన్న రివార్డులను కూడా వారికే అందజేస్తామని తెలిపారు. అలాగే వారికి ఉపాధి అవకాశాలు కూడా ప్రభుత్వ సహకారంతో అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయుధాలతో రాజ్యాధికారం సాధించలేరని ఆయన అన్నారు. ఎన్‌కౌంటర్లలో అటు మావోయిస్టు నేతలు, సభ్యులు, ఇటు పోలీసులు మృతి చెందడం సమాజానికి అంత మంచిది కాదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మావోయిస్టులందరూ ఆయుధాలు వదిలి ప్రజలతో కలిసిపోవాలని తరువాయి 2లో



## బిహార్‌లో ఎన్నికలు హైజాక్ చేసేందుకు బిజెపి కుట్ర

- తన విధిని నిర్వర్తించకుండా బిజెపి కోసం పనిచేస్తున్న ఇసి
- 'సంవిధాన్ బచావో' సమావేశంలో రాహుల్‌గాంధీ

**భువనేశ్వర్ :** మహారాష్ట్రలో జరిగినట్లే బిహార్‌లో కూడా రానున్న ఎన్నికలను హైజాక్ చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ సంవిధాన్ బచావో సమావేశంలో రాహుల్‌గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ బిహార్ అసెంబ్లీ ఎన్నికలను బిజెపి 'హైజాక్' చేయకుండా నిరోధించాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయని అన్నారు. మహారాష్ట్ర మాదిరిగానే బిహార్‌లో ఎన్నికలను హైజాక్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా బిజెపి రాజ్యాంగంపై దాడి చేస్తోంది అని రాహుల్ ఆరోపించారు. గురువారం తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బలూచ్ మిలిటెంట్ల ఘాతుకం
## 9 మంది ప్రయాణికుల హత్య

**ఇస్లామాబాద్/ కరాచీ:** పాకిస్తాన్‌లో బలూచిస్థాన్ మిలిటెంట్లు మరోసారి చెలరేగిపోయారు. పంజాబ్ ప్రావీన్స్‌కు చెందిన 9 మందిని కిడ్నాప్ చేసి, హత్య చేశారు. బలూచిస్థాన్ అసిస్టెంట్ కమిషనర్ నవీద్ ఆలమ్ తెలిపిన వివరాల ప్రకారం, పంజాబ్‌కు వెళుతున్న రెండు బస్సులను జోబ్ జిల్లా సుర్–డకాయ్ ప్రాంతంలో బలూచ్ మిలిటెంట్లు అడ్డగించారు. వాటి నుంచి తొమ్మిది మంది ప్రయాణికులను కిందకు దింపి, తమతో తీసుకెళ్లారు. ఈ కిడ్నాప్ జరిగిన కొన్ని గంటల్లోనే వారిని కాల్చి చంపేశారు. తిరుగుబాటుదారులు బస్సును అడ్డగించి, గన్నులతో బెదిరించి బస్సులోకి ఎక్కారని, బస్సులో ప్రయాణిస్తున్న వారిని ఐడీ కార్డులు చూపించమని అడిగారని తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, శవాలను స్వాధీనం చేసుకున్నారు. బలూచిస్థాన్‌లో వేర్పాటువాదులు ఇలాంటి దాడులకు దిగడం, హత్య చేయడం నిత్యకృత్యంగా మారింది. కాగా, ఈ దారుణానికి ఏ మిలిటెంట్ గ్రూప్ ఇంకా బాధ్యతను ప్రకటించలేదు. ఇలావుంటే, గతంలో బలోచ్ టెర్రరిస్ట్ గ్రూప్స్ ఇలాంటి హత్యలకు పాల్పడ్డాయి.

# ఆసక్తి రేపుతున్న భేటీ

### చైనా విదేశాంగ మంత్రితో యుఎస్ విదేశాంగ మంత్రి చర్చలు

**కౌలాలంపూర్:** అమెరికా, చైనా మధ్య వివిధ అంశాలపై తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ఇరు దేశాల విదేశాంగ మంత్రులు భేటీ కావడంట ఆసక్తి రేపుతున్నది. మలేసియాలో జరిగిన సౌత్‌ఈస్ట్ ఏషియన్ నేషన్స్ ఫోరమ్ సమావేశానికి హాజరైన అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోవడంతో, చర్చకు వచ్చిన అంశాలపై ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. అయితే, వివిధ దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై అమెరికా విధిస్తున్న అధిక టారిఫ్ రేట్లు, జపాన్, దక్షిణ కొరియా దేశాలతో కలిసి అమెరికా చేస్తున్న సైనిక విన్యాసాలు వంటి కీలకాంశాలను వీరు చర్చించి ఉండవచ్చని అంటున్నారు. అయితే, అంతకు ముందు ఆగ్నేయాసియా దేశాల విదేశాంగ మంత్రులను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన రూబియో టారిఫ్ అంశాన్ని దాటవేశారు. ఆసియాలో పెరుగుతున్న



చైనా ఆధిపత్యం, శాంతి భద్రతలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని తెలిపారు. అమెరికా ప్రతిపాదిస్తున్న అధిక టారిఫ్ రేట్లను మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, 'అది ఒక అంశం మాత్రమే. ప్రధాన చర్చ మాత్రం శాంతి భద్రతలపై కొనసాగింది' అన్నారు. అధిక టారిఫ్‌ను వివిధ దేశాలు వ్యతిరేకిస్తున్న విషయాన్ని ఆయన దాటవేశారు.

### అమెరికా కవ్వింపు చర్యలు

ఆసియాలో అమెరికా కవ్వింపు చర్యలు కొనసాగిస్తున్నది. జపాన్, దక్షిణ కొరియాతో కలిసి సైనిక విన్యాసాల్లో పాల్గొంది. అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర కొరియా క్షిపణుల తయారీ, ప్రయోగాలను నిర్వహిస్తున్నదని, ఈ చర్యలను వెంటనే మార్చుకోవాలని ఈ మూడు దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ఉత్తర కొరియా తన సైనిక పాటవాన్ని విపరీతంగా పెంచుకుంటున్నదని, ఇది ఆసియా ప్రాంతంలో భద్రతకు ప్రమాదకరమని వ్యాఖ్యానించాయి. ఒకవైపు అమెరికా విదేశాంగ మంత్రి ఆసియాలో పర్యటిస్తుండగా, మరోవైపు జపాన్, దక్షిణ కొరియాతో కలిసి అగ్రరాజ్యం సైనిక విన్యాసాలు చేయడాన్ని కవ్వింపు చర్యలుగానే భావించాల్సి వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## మయన్మార్‌లో బౌద్ధారామంపై
# వైమానిక దాడులు

### కనీసం 23 మంది మృతి... 30 మందికి తీవ్ర గాయాలు



**బ్యాంకాక్:** మయన్మార్‌లోని ఒక బౌద్ధారామంపై జరిగిన వైమానిక దాడిలో కనీసం 23 మంది మృతి చెందగా, 30 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. సగైంగ్ రీజన్‌లోని లిన్ టా లూ గ్రామంలోవున్న బౌద్ధారామంపై దాడి జరిగిన విషయాన్ని 'డెమోక్రాటిక్ వాయిస్ ఆఫ్ బర్మా' ప్రకటించింది. మృతుల సంఖ్య 30 వరకూ ఉండవచ్చని పేర్కొంది. ఈ సంస్థ ప్రకటన ప్రకారం, ఆ బౌద్ధారామంలో సుమారు 150 మంది బౌద్ధులు తలదాచుకుంటున్నారు. వీరంతా సైనిక జుంటా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2023 ఫిబ్రవరిలో, సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం, పాలనా పగ్గాలను చేజిక్కించుకుంది. అప్పటి నుంచి మయన్మార్‌లో అంతర్యుద్ధ వాతావరణం నెలకొంది. బౌద్ధులను సైనిక ప్రభుత్వం ఉగ్రవాదులుగా పేర్కొంటున్నది. మిలిటెంట్ల స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపినట్టు గతంలో ప్రకటించింది. అయితే, తాజా ఘటనపై మయన్మార్ సైనిక ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా దాడి చేయించిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## త్వరలో జిన్‌పింగ్‌తో అల్బనీస్ సమావేశం

**మెల్బోర్న్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ త్వరలోనే సమావేశం కానున్నారు. వ్యాపార బృందంతో కలిసి చైనా వెళ్లనున్న అల్బనీస్, అక్కడ బజింగ్, షాంఘై, చెంగ్డూ నగరాలను సందర్శిస్తారు. ఈ క్రమంలోనే జిన్‌పింగ్, చైనా ప్రధాని లీ క్వియాంగ్, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ చైర్మన్ జావో లెజీ తదితరులతో భేటీ అవుతారు. ఈ పర్యటన వివరాలను ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించలేదు. అయితే, వాణిజ్య సంబంధమైన పర్యటనగా విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా విధిస్తున్న అధిక టారిఫ్ రేట్లు కూడా చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది.



# వేటుకు సిద్ధంగా ఉండండి

### ఉద్యోగులకు అమెరికా విదేశాంగ శాఖ స్పష్టీకరణ

**వాషింగ్టన్:** అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖలో ఉద్యోగులపై వేటు ఖాయంగా కనిపిస్తున్నది. కొంత మంది ఉద్యోగులపై వేటు తప్పదని, అందుకు సిద్ధంగా ఉండాలని ఈ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఎంత మంది ఉద్యోగులను తీసివేస్తున్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగులాంతా అమెరికాకు ప్రశంసనీయమైన సేవలు అందించారని మాత్రం ఆ ప్రకటనలో తెలిపారు. ఇలావుంటే, ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో 15 శాతం మంది ఉద్యోగులను తొలగించడానికి అనుమతించాల్సిందిగా అమెరికా చట్టసభను విదేశాంగ మంత్రిత్వ శాఖ కోరింది. అయితే, ఆ తర్వాత కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో వేటును 18 శాతానికి పెంచింది. గతంలో ఎలాన్ మస్క్ నిర్వహించిన డిపార్ట్‌మెడ్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ తీసుకుంటున్న పలు నిర్ణయాలు, ఉద్యోగులపై వేటు విమర్శలకు కారణమవుతున్నది. ఈ నిర్ణయాలపై పలు వాజ్యాలు దాఖలుకాగా, అమెరికా సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి మార్గం సుగమమైంది. ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని పెంచడంతోపాటు, ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

**నాసాకు తప్పని సంక్షోభం!**

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'కు కూడా సంక్షోభం తప్పేలా లేదని అంటున్నారు. వివిధ మీడియా కథనాల ప్రకారం, 2,145 మంది ఉద్యోగులను తప్పించేందుకు నాసా సన్నాహాలు చేస్తోంది. సైన్స్, అంతరిక్ష ప్రయాణం వంటి కీలక మిషన్లపై పనిచేస్తున్న అనుభవజ్ఞులైన ఉద్యోగులపై అమెరికా ప్రభుత్వం చేపడుతున్న బడ్జెట్ కోతర ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. పొలిటికో మీడియా సంస్థ నివేదికను అనుసరించి, జిఎస్ 13, జిఎస్ 15 స్థాయిలో ఉన్న సీనియర్ అధికారులకు ఉద్వాసన తప్పకపోవచ్చు. వీరికి 'గోల్డెన్ షేక్‌హ్యాండ్' ఇచ్చి పదవీ విరమణ చేయించడం లేదా రాజీనామా చేయించడమే ట్రంప్ ప్రభుత్వ లక్ష్యం. నాసాకు చెందిన గోడ్డార్డ్ స్పేస్ సెంటర్ (మెరిల్యాండ్)లో 607, జాన్సన్ స్పేస్ సెంటర్ (టెక్సాస్)లో 366, కెన్నెడీ స్పేస్ సెంటర్ (ఫ్లోరిడా)లో 311, ప్రధాన కార్యాలయం (వాషింగ్టన్)లో 307, లాంగ్లీ రీసెర్చ్ సెంటర్ (వర్జీనియా)లో 281, మార్షల్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (అలబామా)లో 179, గ్లెన్ రీసెర్చ్ సెంటర్ (ఓహాయో)లో 191 మంది చొప్పున ఉద్యోగాలు కోల్పోనున్నారన్నది నివేదిక సారాంశం. ఒకేసారి ఇంతమందిపై వేటు పడితే నాసా ప్రయోగాలకు తీవ్ర విఘాతం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.

# కెనడాపై అమెరికా సుంకాల పోటు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. పొరుగు దేశమైన కెనడా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 35 శాతం టారిఫ్ విధిస్తున్నట్టు ప్రకటించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీని ఉద్దేశించి రాసిన ఉత్తరాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రుత్ సోషల్‌లో ఉంచారు. ఫెంటనిల్ మత్తు పదార్థాలు కెనడా నుంచే దేశంలోకి ఎక్కువగా రవాణా అవుతున్నదని అమెరికా ఆరోపణ. కెనడా తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ, టారిఫ్‌ని పెంచింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఈ కొత్త సుంకాలు అమల్లోకి వస్తాయని, కెనడా ఫెంటనిల్ అక్రమ రవాణాను అడ్డుకోకపోతే, మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. తమ దేశానికి చెందిన పాల ఉత్పత్తులపై కెనడా 400 శాతం పన్ను వసూలు చేస్తున్నదని ఆరోపించారు. కెనడా తీరు అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమేగాక, జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తున్నదని ట్రంప్ తన పోస్టులో విమర్శించారు.




ఇలావుంటే, ట్రంప్ నిర్ణయాలు, భారీ సుంకాలు కేవలం కెనడాకు మాత్రమే పరిమితం కాలేదు. చైనాతో వాణిజ్య యుద్ధం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతునే ఉంది. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, తీవ్రస్థాయికి చేరింది. బ్రెజిల్‌పై 50 శాతం టారిఫ్‌ను విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. విచిత్రంగా, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోలోనారోపై నడుస్తున్న కేసుకు, టారిఫ్ పెంపుదలకు లింకు పెట్టారు. జపాన్, దక్షిణ కొరియా, ట్యునీషియా, మలేషియా, కజాకిస్థాన్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, మయన్మార్, లావోస్, బోస్నియా, థాయిలాండ్, బంగ్లాదేశ్, ఇరాక్, లిబియా, మోల్డోవా, బ్రునై, ఇండోనేషియా, ట్యునీషియా, శ్రీలంక, సెర్బియా, కంబోడియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలపైన కూడా సుంకాలు పెంచనున్నట్టు ట్రంప్ ఇది వరకే స్పష్టం చేశారు. స్థూలంగా చెప్పాలంటే, అతి కొద్ది దేశాలను మినహాయించి, అన్ని ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల పోటు తప్పేలా కనిపించడం లేదు.

## గ్రామీణప్రాంతాల్లో
# మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వైద్యసేవల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా ఉండేలా వసతులను కల్పించి, పేదప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్రవైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమం, సైన్స్‌అండ్ టెక్నాలజిశాఖల మంత్రి దామోదర రాజనర్సింహ్మ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డినారాయణరెడ్డిల తోకలిసి మంత్రులు జూపల్లి కృష్ణారావు, రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్‌టెక్నాలజిశాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా మంత్రి రాజనర్సింహ్మ మాట్లాడుతూ తెలంగాణప్రజల అవసరాలు, వైద్యసేవల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ,అత్యాధునిక టెక్నాలజితోకూడిన వైద్యవిద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యులను ప్రజలు దేవుడితో పోలుస్తారని, ఆవిధమైన నమ్మకాన్ని ప్రజలకుకల్పిస్తూ గ్రామీణప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆస్పత్రులు, మెడికల్ కళాశాలకు అవసరమైన అన్నిమౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అందుకు అనుగుణంగానే అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించడంతోపాటు మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలలో నిమ్స్, ఉస్మానియా స్థాయి వసతులు ఉండాలని కార్పొరేట్‌స్థాయిలో ఆస్పత్రులను తీర్చిదిద్దే ప్రయత్నమన్నారు. ప్రతి 35కిలోమీటర్లకు ట్రామాకేంద్రం, జిల్లాకు ఓనర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అన్నారు. రాష్ట్రంలో నాలుగు ప్రధాన నగరాల్లో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి, గ్రంథాలయచైర్మన్ గంగాపురం రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పాల్గొన్నారు.

## శక్తిగా నిలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తమై పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యమాల్లో బిజెపి అనుబంధ సంస్థ బిఎంఎస్ చొరబడుతున్నదని, ఇటువంటి పరిణామాల నేపథ్యంలో ఎఐటియుసి, కిసాన్ విభాగాలను రాజకీయంగా మరింత చైతన్యవంతం చేయాలన్నారు.తెలంగాణ రాష్ట్రానికి ఎంతో పోరాట చరిత్ర ఉన్నదని, నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేశామని, అలాంటి గడ్డపై సిపిఐని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. హిట్లర్ తరహాలో మోదీ కూడా ఎన్నికల్లో గెలిచిన తర్వాత అనేక మార్పులు చేస్తున్నారని, రాజ్యాంగ వ్యవస్థలను, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని రాజా విమర్శించారు. స్వతంత్రంగా ఉండాల్సిన న్యాయ వ్యవస్థ కూడా ప్రమాదంలో పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు శక్తులు రాజ్యాంగ, ప్రజాస్వామ్య శక్తులపై దాడి చేస్తున్నాయని, ఈ చర్యల పట్ల ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం భారతదేశాన్ని కార్పొరేట్ నియంత్రణ, ఫాసిస్టు రాజ్యం వైపు నెడుతోందని, లౌకిక, ప్రజాస్వామిక, సంక్షేమ భారత దేశంలో రాజ్యాంగం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వాన్ని దెబ్బతిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర రాజకీయాలపై ప్రవేశపెట్టిన నివేదికను కౌన్సిల్ చర్చించింది. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ పాల్గొన్నారు.

**సంతాపం :** సమావేశంలో తొలుత ఇటీవల మరణించిన సిపిఐ నాయకులు పశ్య కన్నమ్మ, రఘుపాల్, సుగుణ, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు తోపాటు 26 మావోయిస్టులు, ఇటీవల గుజరాత్‌లోని గంబీర వంతెన ప్రమాదంలో చనిపోయిన వారికి సమావేశం సంతాపాన్ని తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.

## దిగిపోవాలి

(మొదటి పేజీ తరువాయి)

జశ్వంత్ సింగ్, మురళీ మనోహర్ జోషి వంటి సీనియర్ నాయకులను 75 ఏళ్ళ తరువాత మోదీ బలవంతంగా పదవీ విరమణ చేయించారని, ఆయన కూడా అదే ప్రమాణాలు పాటిస్తారా అనే విషయాన్ని వేచి చూడాల్సి ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేత అభిషేక్ మనుషింఘ్వి మాట్లాడుతూ మీరు పాటించని విషయంపై ఉపదేశాలు ఇవ్వడం ప్రమాదకరమని అన్నారు.75 ఏళ్ళ నిబంధన పేరుతో సీనియర్‌లను తప్పించేందుకు మార్గదర్శన్ మండలిని ఏర్పాటు చేశారని, అయినప్పటికీ ప్రస్తుత నాయకత్వం తమకు తాము సడలింపు ఇచ్చుకుంటున్నట్లుగా ఉందని మోదీని ఉద్దేశించి పరోక్షంగా ఎద్దేవా చేశారు.

**2029 వరకు మోదీనే : అమిత్ షా**

ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడైన కేంద్ర మంత్రి అమిత్ షా స్పందిస్తూ 2023 మే మాసంలోనే ఇలాంటి ఊహాగానాలు వచ్చాయని, వయసు సంబంధిత పదవీ విరమణ విధానమేదీ బిజెపి నిబంధనావళిలో లేదని అన్నారు. 2029 వరకు మోదీనే నాయకత్వ బాధ్యతల్లో కొనసాగుతారని, నిరాధార పుకార్లతో ఇండియా కూటమి నెగ్గలేదని అన్నారు.

## ఇక అచ్చేదిన్

(మొదటి పేజీ తరువాయి)

ఎద్దేవా చేసింది. బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే చేసిన ప్రకటన ప్రకారం 75ఏళ్ల వయసులో పదవి నుంచి తప్పుకోవాలని ప్రకటించిన విషయాన్ని ఈసందర్భంగా ఆయన ప్రస్తావించారు. 75 సంవత్సరాల శాలువా మీపై కప్పబడి ఉందని, అంటే మీరు ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నారని, దాని అర్థం మీరు పక్కకు తప్పుకుని ఇతరులను పనిచేసుకోనివ్వాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ పింగ్లే చేసిన వ్యాఖ్యలను ప్రత్యేకంగా ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుంది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో...'పూర్ అవార్డు జీవి ప్రధానమంత్రి'! మీరు స్వదేశానికి ఎలా తిరిగివచ్చారు? తిరిగొస్తుండగా 2025 సెప్టెంబర్ 17న మీకు 75ఏళ్లు నిండుతున్నాయని సరసంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ గుర్తుచేశారు. కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా సరసంఘ్‌చాలక్ భాగవత్‌తో మీకు కూడా 2025 సెప్టెంబర్ 11కు 75 ఏళ్లు నిండుతున్నాయని గుర్తుచేయొచ్చు. అయినప్పటికీ ఆ విషయమై మాట్లాడలేదు. 'ఒక బాణం.. రెండు లక్ష్యాలు' అవుతుంది అని జైరామ్ రమేష్ చెప్పారు. కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పవన్ ఖేరా మట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటినుంచి ఉత్సాహం, ఆనందం వెల్లువెత్తాయని పేర్కొన్నారు. భాగవత్ వ్యాఖ్యలను పవన్ ఖేరా ప్రస్తావిస్తూ 'ఈ ఏడాది సెప్టెంబర్ 11కు భాగవత్‌కు 75ఏళ్లు నిండుతాయి. సెప్టెంబర్ 17కు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి 75ఏళ్లు నిండుతాయి. ఈ 11ఏళ్లు దేశం, రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థల పరిస్థితి ఆగమాగం అయ్యాయి. అయితే, ఇక మనం సెప్టెంబర్ 17నుంచి ఉపశమనం పొందుతాం. సెప్టెంబర్ 11న మొదటి అడుగు వేయబడుతుంది. ఈ ఇద్దరూ దేశం ఆత్మతో ఆడుకున్నారు' అని ఖేరా ఒక వీడియో ప్రకటనలో తెలియజేశారు. 'అయితే ఇక మనం సంతోషంగా ఉందాం, ఎందుకంటే భారతదేశానికి 'అచ్చేదిన్' రానున్నాయి. ఈదేశ రాజ్యాంగం నరేంద్రమోదీ, మోహన్ భాగవత్ వల్లే నిర్వీర్యం అయ్యాయి. వారు ఇక వెళ్లబోతున్నారు' అని ఖేరా పేర్కొన్నారు.

## అనుమతివ్వం

(మొదటి పేజీ తరువాయి)

చేశారంటే ఫీజుల పెంపునకు టీఏఎఫ్ఆర్‌సీ ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు అవ్వదు. రిజిస్టర్‌ను పరిశీలిస్తే అందులో సభ్యుల సంతకాల్లేవు. ఫీజుల పెంపు కమిటీ సభ్యుల పరిశీలనకు లోబడి ఉంటుందని కూడా రిజిస్టర్‌లో ఉంది. గత జూన్ 18న సమావేశమై కాలేజీల ప్రతిపాదనలు గతంలో సుప్రీం కోర్టు, హైకోర్టుల గైడ్‌లైన్స్‌కు భిన్నంగా ఉన్నాయని, కాలేజీల ప్రతిపాదనలపై ప్రభుత్వం అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకోవాల్సివుందని కోర్టుకు సమర్పించిన తీర్మానాల్లో ఉంది. దీనినిబట్టి ఫీజుల పెంపునకు టీఏఎఫ్ఆర్‌సీ ఆమోదం చెప్పలేదు.. అని కూడా ఆదేశాలిచ్చింది.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజులు గత బ్లాక్ పీరియడ్ ఫీజులే 2025–26 విద్యా సంవత్సరానికి వర్తిస్తాయంటూ జూన్ 30న ప్రభుత్వం వెలువరించిన జీవో 26ను 11 ఇంజినీరింగ్ కాలేజీలు సవాలు చేసిన పిటిషన్లపై విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శుక్రవారంతో కౌన్సెలింగ్ పూర్తయ్యేందుకు ఒక్కరోజు ముందు కాలేజీలు హైకోర్టులో అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ వేయడం సమర్ధనీయం కాదు. అడ్మిషన్ల బిగినింగ్ దశలో కాలేజీలు కోర్టుకు వచ్చాయి. కాలేజీల అభ్యంతరాలపై ప్రభుత్వం, టీఏఎఫ్ఆర్‌సీ వేయబోయే కౌంటర్ల పరిశీలన తర్వాత విచారణ చేస్తాం. ఇదే సమయంలో సీబీఐటీకి ఫీజుల పెంపునకు ఉత్తర్వులు వెలువడిన మరో కేసులోని ఆర్డర్‌ను తిరిగి పరిశీలన చేయనున్నట్లు టీఏఎఫ్ఆర్‌సీ చెప్పింది. టీఏఎఫ్ఆర్‌సీ, ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేసింది.

## మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. అనంతరం ఆయన బిఆర్‌కె భవన్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అప్పటి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,సాధారణ పరిపాలన కార్యదర్శి, నీటిపారుదల కార్యదర్శికి లేఖ రాసినప్పటికీ వారి నుంచి స్పందన రాలేదని వివరించారు. మీడియాలో వస్తున్న వార్తలను దృష్టిలో పెట్టుకుని తమ వద్ద ఉన్న సమాచారాన్ని విచారణ కమిషన్‌కు అందజేశామన్నారు. ఇటీవల సిఎం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ 50 ఏళ్ల కాంగ్రెస్ ద్రోహ చరిత్రకు కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని ఎద్దేవా చేశారు. తాము తెలంగాణకు 299,ఎపికి 512 టిఎంసి నీటిని కేటాయించేందుకు శాశ్వత ఒప్పందం చేసుకున్నారని పదే పదే అబద్ధం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇది తాత్కాలిక నీటి వినియోగం అని అన్నారు. నీటి పంపకాన్ని ట్రిబ్యునల్ చేస్తుందని, వినియోగం కెఆర్‌ఎంబి చూస్తుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 299 టిఎంసిలు చాలని 2025లో సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఎందుకు సంతకాలు పెట్టారని ప్రశ్నించారు. కొద్ది నెలల్లో కృష్ణాలో మంచి వాటా రాబోతున్నదని, అహంకారం, వెటకారం వదిలి తెలంగాణకు ఉపకారం చేసే మంచి బుద్ధితో నడుచుకోవాలని సిఎంకు సూచించారు.

## సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

వెనుక ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉన్నారని పేర్కొన్నారు. బిసి నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, మహేష్‌కుమార్ గౌడ్ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులందరికి బిసి సెల్ నేతలు ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఇతర నేతలు మీడియాతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతో బిసిల కల నెరవేరిందని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అయితే బిఆర్‌ఎస్ నేతలు ఈ విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. ఈ బిల్లుకి సంబంధించి చట్టం ప్రకారం ముందుకు వెళ్తున్నామని, బిల్లుకు అడ్డుపడవద్దని ప్రతిపక్షాలకు వారు విజ్ఞప్తి చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో రాజకీయం చేయడం తగదని వారు బిఆర్‌ఎస్ నేతలకు సూచించారు. ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ బిసిలంటే కెసిఆర్‌లో చులకన భావం ఉందని విమర్శించారు. బిసిలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితోనే కాంగ్రెస్ ఈ ప్రయత్నం చేస్తోందని అన్నారు. బిసిలతో పాటు ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జనజీవన స్రవంతిలో కలవండి

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్దమని ప్రకటించిన మావోయిస్టులు ఆయుధాలు వీడేందుకు కూడా సిద్ధపడాలని సూచించారు. ఈ మేరకు 'ప్రజాపక్షం' పత్రికకు డిజిపి జితేందర్ బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రశ్న: మావోయిస్టులే లక్ష్యంగా సాగుతున్న కగార్ ఆపరేషన్ ఎప్పటి వరకు కొనసాగుతుంది?**

**జితేందర్:** జనవరి 2024లో ప్రారంభమైన కగార్ ఆపరేషన్ 2026 మార్చి 31 వరకు కొనసాగుతుంది. ఈ ఆపరేషన్ పూర్తిగా కేంద్ర బలగాల ఆధ్వర్యంలో సాగుతోంది. తెలంగాణ పోలీసులకు సంబంధం లేదు. కగార్ ఆపరేషన్ ద్వారా సాయుధ బలగాలు మావోయిస్టులపై పై చేయి సాధించాయి. ఈ ఆపరేషన్ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రాల సహకారంతో సాగుతోంది.

**ప్రశ్న: ఈ ఆపరేషన్‌లో ఇప్పటి వరకు ఎంత మంది మావోయిస్టులు మృతి చెందారు?**

**జితేందర్:** తెలంగాణ – ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో జరిగిన కగార్ ఆపరేషన్‌లో గత రెండు నెలల్లో 31 మంది మరణించారు. ఇందులో కేంద్ర కమిటీ నాయకులు, డిసిఎం నాయకులు, సభ్యులు ఉన్నారు. ముగ్గురు పోలీసులు కూడా మరణించారు. మే 21న అబూజ్‌మాడ్ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 27 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో నంబాల కేశవరావు, సంగీత, భూమిక, రవిలు ముఖ్యులు. ముగ్గురు గ్రేహౌండ్స్ కమాండోలు రణధీర్, సందీప్, పవన్‌కళ్యాణ్‌లు కూడా మృతి చెందారు.

**ప్రశ్న: ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎంత మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపో–యారు..?**

**జితేందర్:** ఈ ఏడాది ఆరు నెలల వ్యవధిలో పదుల సార్లు మావోయిస్టులు పోలీసుల ముందు తమ ఆయుధాలను అప్పగించి లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన వారి సంఖ్య ఇప్పటి వరకు 350కి చేరుకుంది. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వారిపై ఉన్న రివార్డులను కూడా వారికే అందిస్తున్నాము. నగదుతో పాటు ఉపాధి కూడా కల్పించడంతో ప్రస్తుతం వారంతా సంతోషంగా జనజీవన స్రవంతిలో మంచి జీవితం గడుపుతున్నారు.

**ప్రశ్న: కర్రెగుట్ట ఆపరేషన్ ముగిసినట్లేనా?**

**జితేందర్:** కగార్ ఆపరేషన్‌లో భాగంగానే భద్రాద్రి కొత్తగూడం జిల్లా ఛతీస్‌ఘడ్ ప్రాంతంలోని కర్రెగుట్ట అటవీ ప్రాతంలో కర్రెగుట్ట ఆపరేషన్ ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు కొనసాగింది. పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణ నేపథ్యంలో తాత్కాలికంగా కర్రెగుట్ట నుంచి పోలీసు బలగాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి రప్పించింది. ప్రస్తుతం కర్రెగుట్ట, అబూడ్‌మాడ్ అడవుల్లో పోలీసుల గాలింపు కొనసాగుతుంది.

**ప్రశ్న: రాష్ట్రంలో పరిస్థితి ఏమిటి?**

**జితేందర్:** కగార్ ఆపరేషన్ వల్ల మావోయిస్టులు అర్బన్ ప్రాంతాలకు రావచ్చనే కేంద్ర నిఘా సంస్థల సూచించడంతో నిఘా వర్గాలతో పాటు తనిఖీలను ముమ్మరం చేశాము. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలు అంతగా లేవు. అయినా మా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. స్లీపర్ సెల్స్‌పై నిరంతర సమీక్ష, వారికి కౌన్సిలింగ్, సమాజంలో తిరిగి చేరేందుకు సహకారం కొనసాగుతోంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు నేడు సాయంత్రం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తో పాటు సుప్రీం కోర్ట్ జడ్జి జస్టిస్ పగిడిగంటం శ్రీ నర్సింహాలకు రాష్ట్ర హై కోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు, డిజిపి డాక్టర్ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఎజి జి.సుదర్శన్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.



# ఏడాదిన్నరలోనే రూ.50వేల కోట్లు

* తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు
* లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 60వేల మందికి ఉపాధి

**ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణను 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్'గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, ఆ క్రమంలోనే కేవలం ఏడాదిన్నరలో రూ.50వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫలితంగా కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు. శుక్రవారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్‌లో 'ఇటి ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్' రెండో ఎడిషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. '2024–25లో రూ.66వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసింది. ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ 'వ్యాక్సిన్ రాజధాని'గా ప్రసిద్ధి చెందింది. దేశంలో అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్ నుంచి 'మేడ్ ఇన్ తెలంగాణ' స్టెంట్లు, కేథెటర్లు యుఎస్, జపాన్ తో సహా 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి' అని ఈ సందర్భంగా వివరించారు. 'లైఫ్ సైన్సెస్ లో గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 5 లక్షల మంది కి కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించాలని మా ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం. అందరి అభిప్రాయాలను సేకరించి వికారాబాద్, నల్గొండ, మెదక్ లలో ఫార్మా విలేజెస్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని చెప్పారు. ''లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీ య ప్రమాణాలతో త్వరలోనే 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇక్కడ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను జీవ శాస్త్ర దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అందించబోతున్నాం. ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా డాక్టర్ రెడ్డీస్, అరబిందో లాంటి సంస్థలతో కలిసి తెలంగాణ యువతకు శిక్షణ ఇస్తున్నాం. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్(సీ4ఐఆర్) భాగస్వామ్యంతో సైన్స్ గ్రాడ్యుయేట్లకు లైఫ్ సైన్సెస్ రంగంలో నిపుణులను తీర్చి దిద్దుతు న్నాం' అని పేర్కొన్నారు. 'లైఫ్ సైన్సెస్ రంగంలో 'తెలంగాణ' బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందు కు ప్రత్యేకంగా 'తెలంగాణ కాంప్రెహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ'కి శ్రీకారం చుట్టాం. ఇది చివరి దశలో ఉంది.. ఇప్పటికే మూడు జిల్లా ల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల ను ముందే గుర్తించేందుకు ఎఐ ఆధారిత స్క్రీనింగ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. సత్ఫలితాలు రావడం తో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం'' అని వివరించారు. కార్యక్రమంలో పలు దిగ్గజ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిజెపి కాంట్రాక్టర్ల కోసమే బనకచర్ల : నారాయణ

ప్రజాపక్షం/ హైదరాబాద్ : ఎపి సిఎం చంద్రబాబు ఓవర్ యాక్షన్ వల్లే బనకచర్ల వివాదం తలెత్తిందని నారాయణ అన్నారు. రూ.80 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు చేపట్టారని, అది పూర్తయ్యేనాటికి రూ.2 లక్షల కోట్ల వ్యయం అవుతుందన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేన శంకర్, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎం.బాలనరసింహాలతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటాయని, దాని వెనుక బిజెపి కనుసన్నల్లో కాంట్రాక్టర్లు ఉన్నారని అన్నారు. కాంట్రాక్టర్ల పెట్టుబడితో ప్రాజెక్టు చేస్తే భవిష్యత్తులో టోల్ గేట్ దగ్గర వాహనాల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు నీటికి డబ్బులు వసూలు చేస్తారన్నారు. సముద్రంలోకి వెళ్లే నీటితోనే బనకచర్ల కడుతున్నామని చెప్పుతున్నారని అన్నారు. ముందు ఇరు రాష్ట్రాల సిఎంలు చర్చించిన తరువాత, నీటి వాటాలు తెల్చిన అనంతరం ప్రాజెక్టులు నిర్మించుకోవాలన్నారు. ఈ బాధ్యతను కేంద్ర జల సంఘానికి అప్పగించాలని నారాయణ అన్నారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తమ తాబేదార్ల ప్రభుత్వం ఉండాలి తప్ప ఇతరులు ఉండొద్దనే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని సిపిఐ నారాయణ విమర్శించారు. చివరకు తమిళనాడు, కేరళలలో గవర్నర్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ (మంత్రివర్గం) నిర్ణయాలను అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చివరకు బిజెపికి అనుకూలంగా ఉన్నా పుదుచ్చేరి ప్రభుత్వానికి కూడా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి పప్పెట్‌గా మారిందని విమర్శించారు. దేశానికి తలవంపులు తెచ్చేలా ప్రధాని మోదీ పరిపాలన కొనసాగుతున్నదని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గులాం మాదిరిగా మోదీ వ్యవహరిస్తున్నారని నారాయణ విమర్శించారు.




తెలంగాణ కనీస వేతనాల సలహామండలి సభ్యులుగా నియమితులైన ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నల్ల సుధాకర్‌రెడ్డి లను అభినందిస్తున్న సిపిఐ నాయకులు

## మోదీ ఎగవేతదారుల పక్షమే : చాడ

ప్రధాని మోదీ బ్యాంకులను ముంచిన కార్పొరేట్‌ల పక్షం అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బ్యాంకులను ముంచినవారు విదేశాల్లో విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే వారి గొంతులపై కేసులు పెడుతున్నారని, ఈడి, ఐటి, సిబిఐ పేరిట వేదింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు పెద్దఎత్తున మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా జరగాలన్నారు.

## కెసిఆర్ అసెంబ్లీకి రావాలి : కూనంనేని

మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం, బనకచర్ల తదితర అంశాలపై ఆయన అభిప్రాయాలు చెప్పాలని కూనంనేని సాంబశివరావు కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్నీ తానే అని చెప్పుకున్న కెసిఆర్ తరువాత తనకు సంబంధం లేదనడంతో ఆయన ప్రతిష్ట పోయిందన్నారు. కాళేశ్వరం, బనకచర్ల రెండు సీరియస్ అంశాలేనని, కెటిఆర్ ప్రెస్‌క్లబ్‌కు వెళ్లడం సమస్యను పక్కదారి పట్టించడమే అన్నారు. ఈ రెండు అంశాలపై చర్చించేందుకు కెసిఆర్ అసెంబ్లీకి వచ్చేందుకు ఎందుకు సిద్ధంగా లేరని ప్రశ్నించారు. కాళేశ్వరం పెద్ద బ్లండర్ (తప్పిదం) అని సాంబశివరావు అన్నారు. బిఆర్ఎస్‌కు ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఇతర నాయకులు తామే పండింతులమన్నట్లుగా విమర్శలకు దిగుతున్నారని, అందరికి తెలియనిది వారొక్కరికే తెలుసా? అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమా ర్ రెడ్డి మాట్లాడితే వారికేమి తెలుసు అంటూ దబాయింపులకు పాల్పడుతున్నారని, అభిప్రాయాలు చేబితే కూడా దబాయింపులకు పాల్పడమేంటని ప్రశ్నించారు.

**స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై హర్షం**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువస్తామని నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమని సాంబశివరావు అన్నారు. అయితే తమిళనాడు తరహాలో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేస్తే బాగుంటుందని, కేంద్రం ఈ బిల్లును తమ వద్ద పెండింగ్ పెట్టుకోవడం పై సమాధానం చెప్పాలన్నారు.

**జిఒ 282ను రద్దు చేయాలి**

సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలిసో తెలియకో 8 గంటల పనివిధానాన్ని 10 గంటలకు పెంచడం సరైందికాద ని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలకడమే అవుతుందని, దీనికి సంబంధించిన జి.ఓ 282 ఉపసంహరించుకోకపోతే కార్మికుల ఆందోళన తప్పదని, వారి ఆందోళనకు తాము మద్దతు ఇస్తామన్నారు. ఇటీవల సిగాచి కంపెనీలో జరిగిన ప్రమాదంలో అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి, కేవలం రూ.8వేలు, రూ.9 వేల వేతనంతో పనిచేయిస్తున్నారని, ఇంత తక్కు వ వేతనంతో పనులు చేయిస్తున్నప్పటికీ పట్టించుకోని కార్మిక శాఖ సమాధానం చెప్పాలన్నారు. పూర్తి నిర్లక్ష్యంతో సిగాచి కంపెనీ యాజమాన్యం వ్యవహరించిందన్నారు.

**చంద్రబాబు ఆ ఐదు గ్రామాలు తెలంగాణకు ఇవ్వాలి**

పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో పురుషోత్తమపట్నంలోని ఆలయ భూముల ఆక్రమణను పరిశీలించేందుకు వెళ్ళిన భద్రాచలం రామాలయం ఇఒ పై దాడి జరగడాన్ని కూనంనేని తీవ్రంగా ఖండించా రు. ఇటువైపు వారు కూడా అటువైపు వారిపై దాడి చేస్తూ, పరిస్థితులు తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇప్పటికైనా ఆ ఐదు గ్రామాలను తెలంగాణకు వదిలేయాలని, ఇందుకు ఎపి సిఎం చంద్రబాబు బాధ్యత తీసుకోవాలన్నారు.

# బిసి రిజర్వేషన్ల అమలులో దేశానికే ఆదర్శం

**మీడియా సమావేశంలో రేణుకాచౌదరి**



ప్రజాపక్షం/ఖమ్మం:అందరికీ న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రజల గురించి ఆలోచించి పని చేసేది కాంగ్రెస్ మాత్రమేనని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి తెలిపారు. శుక్రవారం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేణుకాచౌదరి మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ అమలుతో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

నాడు రాజీవ్ గాంధీ మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల్లో అమల్లోకి తీసు కు వస్తే ఇప్పుడు కొన్ని చోట్ల 50 శాతం కూడా అమలు చేస్తున్నారని ఆమె తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా పరిస్థితులను పరిశీలించి బిసి రిజర్వేషన్ అమలుకు సంబంధించి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 42శాతం రిజర్వేషన్లకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని ఆమె తెలిపారు. పదేళ్లు అధికారం లో ఉండి మాట్లాడని కవిత ఇప్పుడు తాను ఉత్తరం రాస్తేనే రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పందించిందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్ బాగుండాలని రేణుకాచౌదరి ఆకాంక్షించారు. బిఆర్ఎస్ లో కొడుకు, బిడ్డ, అల్లుడు వ్యవహారం గురించి తాము స్పందించబోమని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## బిజెపికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆమోదం



ప్రజాపక్షం/హైదరాబాద్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఆమోదించారు. రామచందర్ రావుకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం పట్ల రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బిజెపికి రాజీనామా చేస్తున్నట్లు గత నెల 30న కిషన్‌రెడ్డికి రాజాసింగ్ లేఖను అందచేశారు. రాజాసింగ్ రాజీనామా లేఖను కిషన్ రెడ్డి అధిష్ఠానానికి పంపా రు. ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు శుక్రవారం బిజెపి జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ అధికారికంగా ప్రకటించారు. రాజాసింగ్ ఆరోపణలు పార్టీ సిద్ధాంతానికి, న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. తన రాజీనామా ఆమోదంపై రాజాసింగ్ విడియో సందేశం ద్వారా స్పందించారు. తాను ఎందుకు రాజీనామా చేశానో అనే విషయాన్ని తన రాజీనామా లేఖలో పార్టీ అధిష్టానం చూసినట్లు లేదన్నారు. రాజీనామా ఆమోదంపై కార్యకర్తలు ఆందోళన చెందవద్దన్నారు. తాను మరింతగా దూకుడుగా పనిచేస్తానని అన్నారు.

# ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి జిపిఒ, ప్రతి మండలానికి భూ విస్తీర్ణాన్ని బట్టి నాలుగు నుంచి ఆరుమంది వరకు లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఈ నెల 27వ తేదీన తుది పరీక్ష నిర్వహిస్తామని, 28, 29వ తేదీలలో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తామని, ఆగస్టు 12 న ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. తుది పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందన్నారు.

రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయం లో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో లైసెన్సుడ్ సర్వేయర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా, 10 వేలమంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో తొలి విడతలో 7 వేల మందికి 33 కేంద్రాల్లో మే 26వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభించామన్నారు. ఈ నెల 26తో 50 రోజుల శిక్షణ పూర్తవుతుందని, మిగిలిన 3 వేల మందికి ఆగస్టు 2వ వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని వివరించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని, సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలమని, దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వే విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని, గత పదేళ్ళలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జిపిఒను నియమిస్తున్నామన్నారు. విఆర్‌ఒ, విఆర్‌ఎలకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే అర్హత పరీక్ష నిర్వహించగా 3,554 మంది ఎంపికయ్యారని వివరించారు. మరోసారి అవకాశం కల్పించాలన్న రెవెన్యూ సంఘాల అభ్యర్థన మేరకు ఈ నెల 27న మరోసారి వీరికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

**ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి**

రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలలో ప్రయోగాత్మకంగా రీ సర్వేను విజయ వంతంగా పూర్తి చేశామన్నారు. పైలెట్ గ్రామాలైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలు, జగిత్యాల్ జిల్లా భీర్పూ ర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామంలో 626 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడలోని 845 ఎకరాలు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు లో 502 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్‌లో 593 ఎకరాలలో మొత్తం ఐదు గ్రామాలలోని 2988 ఎకరాలలో చిన్న వివాదాలకు తావు లేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈ సర్వేను పూర్తి చేశామన్నారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు.



## ప్రజావాణిలో 281 దరఖాస్తులు

ప్రజాపక్షం/హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 67, రెవెన్యూ శాఖకు సంబంధించి 58, విద్యుత్ శాఖకు 24, పౌర సరఫరా శాఖకు 09, ఇందిరమ్మ ఇండ్ల కోసం 44, దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 78 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి, దామోదరం**



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లు సంయుక్తంగా రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండల కేంద్రంలో 12.70 కోట్ల రూపాయలతో నిర్మించబోయే 30 పడకల ఆసుపత్రి భవనానికి,మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు అండ్ మాడ్గుల నుండి దేవరకొండ రోడ్ వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బిటి(డబుల్ లైన్) రోడ్డునకు శంకుస్థాపన చేశారు.స్థానిక నాయకు లు అధికారులు మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం ఘనంగా పలికారు.

అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు, మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర మంత్రు లు,స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు, మాడ్గుల నుండి దేవరకొండ రోడ్డు వరకు డబల్ లైన్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినదని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని, ఉచిత కరెంటు, రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ముందు తీసుకెళుతున్నామని, సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నామని,200 యూనిట్ల వరకు జీరో బిల్లు కరెంటు ఇస్తున్నామన్నారు. బిసి కులగణన చేపట్టి 42 శాతం చేపట్టడం జరుగుతుందని అన్నారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలోని మాడ్గుల కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యమును అందించేందుకు గాను మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు వెళ్ళుతున్నామని, త్వరలోనే మహిళా సాధికారత సంపూర్ణంగా తీసుకురావడం జరుగుతుందని, పేదవారికి బాసటగా నిలుస్తూ సంక్షేమానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని పని చేస్తున్నామని అన్నారు. ఆ తర్వాత మంత్రులు మాడ్గుల మండలంలోని 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి శాసన సభ్యులు కసి రెడ్డి నారాయణ రెడ్డి,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లను స్వాగతించిన టిజెఎస్




ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక సంస్థలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ జన సమితి స్వాగతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ అన్నా రు. హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్యగౌడ్ తో కలిసి పల్లె వినయ్ కుమార్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం 32 నుంచి 18 శాతానికి రిజర్వేషన్ల ను తగ్గిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా 42 శాతం పెంచ డం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల అమలుతో రాష్ట్రంలో సామాజిక న్యాయం జరుగుతుందని, సామాజిక తెలంగాణ దిశగా వెళ్లేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో టిజెఎస్ నాయకులు బట్టల రామ చందర్, ధారసత్యం, హనుమంత్ రెడ్డి, హనుమంతు గౌడ్, లక్ష్మ ణ్, జైపాల్ రెడ్డి,మాణిక్యం, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **GUNDU RAVI, S/o. GUNDU SAMMAIAH,** H.No: 3-12-32, Kumarpally, Hanamkonda (mdl), Hanamakonda (Dist),Telangana., I have changed my Daughter Name from **GUNDU SMILY** (Old Name) to **GUNDU SRI VIDHYA** (New Name) for all purpose.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 10/DB/EE/Alwal Circle/GHMC/2025-26 (ప్రకటన) తేది: 11.07.2025

**పని పేరు:** ప్రీకాస్ట్ ఆర్‌సిసి ప్రహరీ గోడ నిర్మాణం, **అంచనా విలువ:** రూ.13.50 లక్షలు, **ప్రారంభ తేదీ & సమయం:** 14.07.2025న సా.4.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 22.07.2025న సా.4.30గం.ల వరకు, ఇఇ **పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 4931-PP/CL/ADVT/1/2025-26, Date: 11-07-2025

**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.

NIT No. 17/D1/PA to EE/SRPT/2025-26, (ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు) తేది: 05.07.2025

''సూర్యాపేట జిల్లాలోని కండిబండ గ్రామం సమీపంలో కోదాడ్ - రేవూర్ రోడ్డులో కూలిపోయిన వంతెన స్థానంలో కి.మీ. 16/8-10 వద్ద హై లెవల్ వంతెన నిర్మాణం. (ఉప పని: ప్రీ-సర్వే మరియు ప్రాథమిక సబ్ సాయిల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించడం)'' **మొత్తం ఖర్చు సుమారు:** రూ. 5.90 లక్షలు. టెండరుదారులు బిడ్ పత్రాలను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.eprocurement.gov.in నుండి 10.07.2025 మధ్యాహ్నం 3.00 గంటల నుండి 14.07.2025 మధ్యాహ్నం 3.00 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **బిడ్లను స్వీకరించడానికి చివరి తేదీ: 14.07.2025 లేదా అంతకు ముందు మధ్యాహ్నం 3.30 గంటల వరకు.** మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.

DIPR R.O. No. : 4911-PP/CL/ADVT/1/2025-26, Date: 11-07-2025

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, దమ్మాయిగూడ.**
మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా.

టెండర్ నోటీసు నెం. E1/08/DMC/2025-26, (టెండర్ నోటీసు) తేది: 10.07.2025

కమిషనర్, దమ్మాయిగూడ మున్సిపాలిటీ క్రింద చూపిన విధంగా రిజిస్టర్డ్ సంస్థలు / కాంట్రాక్టర్ల నుండి టెండర్లు / ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో పాల్గొనమని ఆహ్వానించడమైనది.

| క్ర.సం. | వివరణ | మొత్తం విలువ (లక్షల్లో ) |
|---|---|---|
| 1. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలో LED అమర్చిన PCB ప్యానెల్ సేకరణకు EOI | 2.00 |
| 2. | దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసరలోని PHCలో ఉన్న టాయిలెట్ మరమ్మతులు | 1.00 (బాక్స్ టెండర్) |
| 3. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని బండ్లగూడ వీకర్స్ సెక్షన్ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలోని టాయిలెట్ నిర్మాణం | 1.00 (బాక్స్ టెండర్) |
| 4. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలో బోర్ బావుల నిర్వహణ మరియు వీధి దీపాల కోసం లూజ్ మెటీరియల్ | 5.00 |
| 5. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వార్డు నెం.04లోని గోవింద్ సింగ్ హౌస్ నుండి బి.సునీత హౌస్ వరకు భూగర్భ డ్రైనేజీ వేయడం (రీకాల్) | 5.00 |
| 6. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వార్డు నెం.10లోని సిద్దార్థ కాలనీలో ఇ.నెం.7-26/3/1 నుండి ఇ.నెం.7-28/12 వరకు UGD వేయడం | 5.00 |
| | ఇతర అభివృద్ధి పనులు | |

1) దరఖాస్తు ప్రారంభ తేదీ & సమయం: 11.07.2025 ఉదయం 10:30
2) దరఖాస్తు ముగింపు తేదీ & సమయం : 18.07.2025 ఉదయం 10:30
ఇతర వివరణల కోసం దయచేసి మున్సిపల్ ఆఫీస్ R/o: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయం, SBI ఎదురుగా, దమ్మాయిగూడ 'X' రోడ్. (లేదా) ఫోన్ నంబర్ +91 9154075628 ని సంప్రదించండి.

సం/- కమిషనర్, దమ్మాయిగూడ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 4859-PP/CL/ADVT/1/2025-26, Date: 11-07-2025


ప్రజాపక్షం
శనివారం, 12 జులై

# బిఆర్ఎస్ దుందుడుకుతనం

ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి దుందుడుకుగా వ్యవహరిస్తూ వార్తల్లో నిలుస్తోంది. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఏదో విధంగా ఆటంకాలు సృష్టించేందుకు ప్రయత్నం సాగించింది. అది హైడ్రా విషయంలో గానీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పక్కనుండే కంచె గచ్చిబౌలి భూముల విషయంలో గానీ చేసిన రాద్ధాంతం అందరికీ గుర్తే. ఇటీవల డోసును మరింత పెంచి, ఏదోరకంగా ఇబ్బందులు సృష్టించడంలో తలమునకలై ఇరాకటంలో పడుతోంది బిఆర్ఎస్. అయినా తన ధోరణిని మార్చుకోవడం లేదు. హైదరాబాద్‌లోని ఒక తెలుగు మీడియా ఛానల్ ప్రధాన కార్యాలయంపై ఆ పార్టీ కార్యకర్తలు దాడి చేసిన ఉదంతం, తదనంతరం నాయకులు చేసిన ప్రకటనలు బిఆర్ఎస్‌లో పెరిగిన అసహనానికి దర్పణం పడుతోంది. నిజానికి ఆ మీడియా సంస్థ తమ యూట్యూబ్ ఛానల్‌లో బిఆర్ఎస్ ముఖ్య నేత కెటిఆర్‌కు సంబంధించి పెట్టిన వీడియోల థంబ్ నెయిల్స్ వాడిన భాష అభ్యంతరకరమైనదే. కానీ, బిఆర్ఎస్ ఆ అంశాన్ని ఎత్తి చూపితే, దానిపై చర్చ జరిగేది. అలా కాకుండా ఏకంగా గులాబీ పార్టీ కార్యకర్తలు ఆ ఛానల్ కార్యాలయానికి వెళ్ళి వీరంగం సృష్టించడంతో అసలు విషయం పక్కకు తొలగింది. రెండు దశాబ్దాలకు పైగా తెలంగాణ ఉద్యమం, పిమ్మట అధికారంలో ఉన్న పార్టీ ఎన్నడూ ఇలాంటి దాడులకు పాల్పడకపోవడమే కలిసి వచ్చింది. ఇప్పుడు దాడి చేయడమే కాకుండా, అడ్డంగా సమర్థించుకున్న తీరు ఆ పార్టీ పట్ల సానుకూలంగా ఉండే వారిలో కూడా ఏహ్యత కలిగించింది. పైగా ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా లేని విధంగా అతివాదంతో వ్యవహరిస్తూ, హైదరాబాద్‌లో స్థిరపడిన పొరుగు తెలుగు రాష్ట్రానికి సంబంధించి దూకుడుగా చేసిన వ్యాఖ్యలు సరైన సంకేతాలను పంపడం లేదు. నిజానికి గత శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపొందిన స్థానాలలో అత్యధికంగా గ్రేటర్ హైదరాబాద్ నుండే ఉన్నాయి. అందులో కూడా సెటిలర్లు ఎక్కువ ఉన్న చోట్ల భారీ మెజారిటీనే సాధించింది. ఉన్నట్లుండి బిఆర్ఎస్ భిన్న వైఖరి ప్రదర్శించడం సందేహాలకు తావిస్తోంది.

గత శాసననసభ ఎన్నికల్లో తెలంగాణవాదం బలంగా ఉన్న ప్రాంతాలలో బిఆర్ఎస్ గెలుపొందలేకపోయింది. గతంలో ఉద్యమానికి దన్నుగా నిలిచిన ఉత్తర తెలంగాణ, గ్రామీణ తెలంగాణ ప్రాంతాలలో కూడా ఓట్లు తగ్గాయి. త్వరలో స్థానిక ఎన్నికలు జరుగనుండడంతో తమకు దూరమైన తెలంగాణ వాదాన్ని తిరిగి ఉపయోగించుకునేందుకే ఈ తతంతగమనే మాట వినపడుబతోంది. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తెలంగాణపై దృష్టి పెట్టనున్నట్లు సంకేతాలిచ్చారు. తెలంగాణ రాష్ట్రం తొలి ఎన్నికల్లో టిడిపి 15 స్థానాలు గెలుచుకున్నప్పటికీ, అనంతరం పరిణామాల్లో ఆంధ్రకే పరిమితమైంది. అప్పుడు ఇక్కడి టిడిపి ఎంఎల్‌ఏలు, కార్యకర్తల్లో సింహభాగం బిఆర్ఎస్ బాటపట్టారు. ఇప్పుడు టిడిపి అధికారంలో ఉండడంతో పాటు, కేంద్రంలో దానిపై ఆధారపడిన బిజెపి ప్రభుత్వం ఉండడంతో బిఆర్ఎస్‌లో ఆందోళన నెలకొందని చెప్పొచ్చు. ఏపిలో కూటమిగా ఉన్న టిడిపి, బిజెపి, జనసేనలు, తెలంగాణలో కూడా కలిసి పోటీ చేస్తాయనే ప్రచారం జరుగుతున్నది. కేంద్రంలో, ఏపిలో అధికారంలో ఉన్న టిడిపి ఒకవేళ దృష్టి సారిస్తే తమ పార్టీలో ఉన్న పాత టిడిపి శ్రేణులు ఆ పార్టీ వైపు మొగ్గుతాయేమోననే అనుమానాలు కూడా బిఆర్ఎస్‌లో వ్యక్తమవుతున్నాయి. కాబట్టి నష్టనివారణలో భాగంగా, తాము అధికారంలో ఉన్నప్పుడు మరిచిన తెలంగాణ సెంటిమెంట్‌ను తిరగదోడి, కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అందుకే బనకచర్ల విషయంలో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా, గతంలో వారి ప్రభుత్వమే గోదావరి జలాలను రాయలసీమకు పంపొచ్చని చేసిన అధికారిక ప్రకటనల ముందు అది పని చేయకుండా పోతుంది. అందుకే నీటి పేరుతో ఎంత రెచ్చగొట్టినా సెంటిమెంటు ఫార్ములా పని చేయడం లేదు. నిస్పృహ, అసహనంలో కొట్టుమిట్టాడుతున్న ప్రతిపక్ష పార్టీ ఏదో ఒక అంశంతో రెచ్చగొట్టేందుకు వెనుకాడడం లేదు. అసెంబ్లీలో చర్చకు ప్రతిపక్ష నేత కెసిఆర్ రావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాలుపై కెటిఆర్ తనతో చర్చకు రావాలని ప్రెస్‌క్లబ్‌కు వెళ్ళిన తీరూ వారికి ఆశించిన ఫలితమివ్వలేదు. దీంతో బిఆర్ఎస్ నేతలు ఇష్టమొచ్చినట్లు తూలనాడడమే పనిగా పెట్టుకొని, వితండవాదానికి దిగుతున్న వైనాలు కూడా ద్యోతకమవుతున్నాయి. సోషల్ మీడియా వార్‌కు తోడు ఇటీవల ఒక ఛానల్‌లో జరిగిన చర్చలో కాంగ్రెస్ నేతపై ఒక బిఆర్ఎస్ నేత చేయి చేసుకున్న తీరు అందుకు పరాకాష్ఠ. ఇది రాజకీయ అనారోగ్య వాతావరణానికి దారితీసి, పరిస్థితి చేజారిపోయే ప్రమాదం కనపడుతోంది. ఇప్పటికైనా ఇలాంటి విపరిణామాలకు చెక్ పెట్టాల్సిన గురుతర బాధ్యత ప్రతిపక్ష నేతపై ఉన్నదని విజ్ఞులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, జవాబుదారీని చేసేందుకు, తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను వ్యక్తీకరించడం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించడమే కాకుండా, వారిని తమ వైపు తిరిగి మలుపుకునేందుకు ప్రతిపక్షానికి చట్టసభ(అసెంబ్లీ)నే అత్యున్నత ప్రజాస్వామిక వేదిక.

# బ్రిక్స్ చైర్మన్ హోదాలో అమెరికాను మోదీ ఎదిరించగలడా?



నిత్యా చక్రవర్తి

అభివృద్ధి చెందుతున్న దేశాల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలపై పెరుగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడులు నేపథ్యంలో, దక్షిణ భూగోళం ప్రయోజనాలను పరిరక్షించే వ్యక్తిగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టను బ్రెజిల్‌లో జూలై 6, 7 తేదీల్లో జరిగిన 17వ బ్రిక్స్ సదస్సు పాక్షికంగా పునరుద్ధరించడానికి సహాయపడింది.

ప్రధాని జూలై 2–9 పర్యటనలో ఘనా, ట్రినిడాడ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియాలకు అధికారిక సందర్శనలు ఉన్నాయి. సదస్సు ముగిసిన తర్వాత బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వాకు (ఆయననే లూలా అని పిలుస్తారు) ఆయన అధికారికంగా అతిథిగా కూడా ఉన్నారు. భారత ప్రధాని పర్యటన సందర్భంగా దక్షిణ భూగోళంలోని ఈ ఐదు దేశాలతో జరిగిన చర్చలు, సంతకాలు చేసిన ఒప్పందాలతో గ్లోబల్ సౌత్‌కు భారతదేశాన్ని స్నేహపూర్వక పెద్ద ఆర్థిక శక్తిగా నిలబెట్టడానికి సహాయపడ్డాయి.

*ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలపై ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల రేట్లను వ్యతిరేకించడం ద్వారా వాటి వాణిజ్య ప్రయోజనా–లను రక్షించడమనేది ప్రధాన సమస్య. ఈ పోరాటానికి 2026లో 18వ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షుడిగా వస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం వహించాలి. డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా బలమైన వైఖరి తీసు–కోకుండా ఆయన ఈ పోరాటానికి నాయకత్వం వహించలేరు. అమె–రికా అధ్యక్షుడి సహాయం పొంద–డానికి ఇంత పెట్టుబడి పెట్టిన తర్వాత ఆయన ఆ విధంగా చేస్తారా? ఈ ఏడాది చివర్లో అమె–రికా ప్రాయోజిత క్వాడ్ సదస్సు భారతదేశంలో జరగనుంది.*

రియో డి జనీరోలో జరిగిన బ్రిక్స్ సదస్సు సంయుక్త ప్రకటనలో గాజాలో ఇజ్రాయెల్ చర్యలను ఖండించడంలో, అలాగే ఇరాన్‌పై దాడులను ఖండించడంలో భారతదేశం వైఖరి మార్పు అనేది ముఖ్యమైన ఫలితం. అమెరికా పేరు చెప్పనప్పటికీ, ఈ తీర్మానంలో భారతదేశం సంతకం చేయడం గత వైఖరి కంటే ముందడుగు వేయడమే. పాలస్తీనావాసులను ఇజ్రాయెల్ హతమార్చడంపై, అలాగే ఇరాన్ ఎలాంటి కవ్వింపుకు పాల్పడనప్పటికీ అమెరికా ఆ దేశంపై దాడి చేసి, అణు సదుపాయాలలో పెద్ద భాగాన్ని కూల్చివేసిన విషయంలో అంతకు ముందు వైఖరికి ఇది భిన్నం.

ఈ ఏడాది జూలై 6,7 తేదీల్లో జరిగిన బ్రిక్స్ సదస్సు వరకు, దక్షిణాఫ్రికా, బ్రెజిల్‌తో సహా దక్షిణ భూగోళంలోని ప్రముఖ దేశాల దృష్టిలో భారతదేశం అంటే ట్రంప్‌కు విశ్వసనీయ మిత్రదేశంగా, బ్రిక్స్ లేదా ఎస్‌సిఒ పనితీరు కంటే క్వాడ్‌పై ఎక్కువ ఆసక్తి చూపే దేశంగా సందేహాస్పదంగా ఉండేది. బ్రెజిల్, దక్షిణాఫ్రికా అధ్యక్షులు నెతన్యాహును అరెస్టు చేయాలని, ఆయనను యుద్ధ నేరస్థుడిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారు. మన ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో ఆర్థిక, రక్షణ సంబంధాల విస్తరణ ప్రణాళికలను కొనసాగించింది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం సమయంలో కూడా ఇజ్రాయెల్‌లో భారత కార్మికులు, సాంకేతిక నిపుణులను ఉద్యోగాలు చేయడానికి భారతదేశం అనుమతించింది.




ఇప్పుడు రియో సదస్సులో దక్షిణ భూగోళ ప్రయోజనాలను గట్టిగా సమర్థించడం ద్వారా భారత ప్రధాని ప్రతిష్ట పాక్షికంగా పునరుద్ధరించబడిన ఆయన బ్రిక్స్ సమావేశంలో ఇచ్చిన వాగ్దానాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలి. భారతదేశం 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతదేశంలో సదస్సును నిర్వహిస్తారు. దక్షిణ భూగోళానికి సంరక్షకుడిగా ఈ పదవి ఆయనకు పెద్ద బాధ్యతలను అప్పగించింది. ఆయన దక్షిణ భూగోళ ప్రయోజనాలను నిరంతరం చూసుకోవాలి.

ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలపై ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల రేట్లను వ్యతిరేకించడం ద్వారా వాటి వాణిజ్య ప్రయోజనాలను రక్షించడమనేది ప్రధాన సమస్య. ఈ పోరాటానికి 2026లో 18వ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షుడిగా వస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం వహించాలి. డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా బలమైన వైఖరి తీసుకోకుండా ఆయన ఈ పోరాటానికి నాయకత్వం వహించలేరు. అమెరికా అధ్యక్షుడి సహాయం పొందడానికి ఇంత పెట్టుబడి పెట్టిన తర్వాత ఆయన ఆ విధంగా చేస్తారా? ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రాయోజిత క్వాడ్ సదస్సు భారతదేశంలో జరగనుంది. సదస్సులో పాల్గొంటారని భావిస్తున్న ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ఆతిథ్యం ఇస్తున్న నరేంద్ర మోదీ సాధ్యమైన ప్రతిదీ చేయవలసి ఉంటుంది. 2026లో మళ్ళీ ఆయనే ఆతిథ్యం ఇవ్వాల్సిన బ్రిక్స్ సదస్సులోని కీలక సమస్యలకు భంగం వాటిల్లకుండా భారత ప్రధానమంత్రి ఈ క్వాడ్ సదస్సును ఎలా నిర్వహిస్తారు?

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోపై విచారణ పేరుతో అధ్యక్షుడు లూలా వెంటాడుతున్నాడని, అందుకు అమెరికాకు పంపే ఉత్పత్తులపై తమ ప్రభుత్వం 50% సుంకాన్ని విధిస్తుందని డొనాల్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. బ్రెజిలియన్ చట్టాల ప్రకారం జరుగుతున్న విచారణతో సుంకాల రేటును ముడిపెట్టడం ద్వారా ట్రంప్ బ్రెజిల్ అంతర్గత వ్యవహారాల్లో నేరుగా జోక్యం చేసుకుంటున్నారు. బోల్సోనారో అధ్యక్షుడు లూలాకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన కఠినమైన మితవాద రాజకీయ నాయకుడు, ట్రంప్ అనుచరుడు, అలాగే నరేంద్ర మోదీ స్నేహితుడు. వాస్తవానికి, రాజకీయ విశ్లేషకులు ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే, ఫ్రాన్స్ నేషనల్ ర్యాలీ సుప్రీమో మేరీ లీపెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీని ప్రపంచ పచ్చి మితవాదపక్షంలో భాగంగా చేర్చారు.

ట్రూత్ సోషల్‌లో లేఖలను పోస్ట్ చేస్తూ, అమెరికా అధ్యక్షుడు బుధవారం మరో ఏడు దేశాలను, అంటే ఫిలిప్పీన్స్, బ్రూనై, మోల్డోవా, అల్జీరియా, లిబియా, ఇరాక్, శ్రీలంకలను లక్ష్యంగా చేసుకొని ఆగస్టు 1 నుంచి అమెరికాకు వాటి ఎగుమతులపై కఠినమైన సుంకాలను ప్రకటించారు. ఇప్పటివరకు భారతదేశం–అమెరికా వాణిజ్య ఒప్పందం కుదరలేదు. అయితే, చర్చలు తుది దశలో ఉన్నాయి. భారతదేశ వ్యవసాయ, పాల ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించడానికి భారతీయ చర్చల బృందంతో అమెరికా ఎలాంటి రాయితీలను రాబట్టిందో ఇంకా తెలియరాలేదు. చర్చలకై మూడోసారి భారత ప్రతినిధివర్గం వాషింగ్టన్‌కు వెళుతున్నది.

బోల్సోనారోకు వ్యతిరేకంగా న్యాయపరమైన చర్యలను నిలిపివేయాలన్న ట్రంప్ డిమాండ్‌ను బ్రెజిల్ అధ్యక్షుడు లూలా తిరస్కరించాడు. బ్రెజిలియన్ దిగుమతులపై 50% సుంకం వాణిజ్య లోటును పూడ్చడం అవసరమని ట్రంప్ చేసిన వాదనను కూడా లూలా తిరస్కరించారు. వాస్తవానికి అలాంటి లోటు లేదు. ట్రంప్ ఆరోపణలకు అధ్యక్షుడు లూలా ఒక్కొక్క అంశం వారీగా సమాధానం ఇచ్చారు. బ్రెజిల్ స్వతంత్ర సంస్థలతో కూడిన సార్వభౌమ దేశం అని, ఏ రకమైన జోక్యాన్ని అంగీకరించబోదని స్పష్టం చేశారు.

అమెరికా అధ్యక్షుడు బుధవారం డజన్ల కొద్దీ దేశాలపై సుంకాలను పెంచడానికి షెడ్యూల్ సిద్ధమైంది. ఈ వారం ప్రారంభంలో ఆయన తాజాగా మరో మూడు వారాల ఆలస్యమవుతుందని చెప్పి, ఆగస్టు 1 వరకు సమయం తీసుకున్నట్లు ప్రకటించారు. అయితే ఆ రోజు నాటికి వైట్‌హౌజ్‌తో ఒప్పందం కుదుర్చుకోకపోతే దేశాలు ఎదుర్కొనే కొత్త రేట్లను ప్రకటించడం ప్రారంభించారు. బంగ్లాదేశ్, జపాన్, దక్షిణ కొరియాతో సహా 14 దేశాల నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై 40 శాతం వరకు అమెరికా సుంకాలను ట్రంప్ సోమవారం ప్రకటించారు. ట్రంప్ బుధవారం మరో 11 దేశాలకు లేఖలు రాశారు.

బ్రిక్స్ సదస్సు ప్రకటన వెలువడిన వెంటనే, డాలరీకరణను ప్రోత్సహిస్తున్నాయని ఆ దేశాలపై 10 శాతం అదనపు సుంకాన్ని విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం భారతదేశాన్ని వెంటనే ప్రభావితం చేస్తుంది. కాబోయే బ్రిక్స్ అధ్యక్షుడిగా భారత ప్రధానికి ఈ అదనపు పెంపును, అలాగే బ్రెజిల్‌పై అనవసరమైన కారణాలతో భారీ 50 శాతం సుంకాన్ని విధించడాన్ని వ్యతిరేకించే తక్షణ బాధ్యత ఉంది. దక్షిణ భూగోళ నాయకుడిగా భారత ప్రధాని ఈ సున్నితమైన అంశంపై ట్రంప్‌కు సమాధానం ఇస్తారా, ఆయనను ఎదుర్కొంటారా?

భారతదేశానికి ఇప్పుడు తన విస్తారమైన జనాభా, వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో దక్షిణ భూగోళం సహజ నాయకుడిగా తన పాత్రను పోషించడానికి పెద్ద అవకాశం ఉంది.ఈ విషయాన్ని విదేశాంగ శాఖకు వదిలేస్తే, దక్షిణ భూగోళం ప్రధాన చోదక శక్తిగా భారతదేశం తన పాత వైభవాన్ని తిరిగి పొందగలదు. కానీ,గత ఐదు సంవత్సరాలుగా భారత ప్రధాని పూర్తిగా తన సొంత సిద్ధాంతం ఆధారంగా విదేశీ దౌత్య ప్రణాళిక పనిని చేపట్టారు. ఇది దౌత్యపరమైన ఏకాకితనానికి దారితీసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మన భారతీయ దౌత్యవేత్తలు మరింత ఇబ్బంది పడుతున్నారు.

భారతదేశం తన దౌత్య సవాళ్లను నిశితంగా సమీక్షించి, 2025, 2026లో దేశ ప్రయోజనాలకు అనుగుణంగా మోదీ సిద్ధాంతాన్ని సవరించాల్సిన సమయం ఆసన్నమైంది. ట్రంప్ ప్రభుత్వం పెట్టిన ఒత్తిళ్లను ధిక్కరించడం ద్వారా, దక్షిణ భూగోళానికి నిజమైన నాయకుడిగా ఆవిర్భవించేందుకు, భారతదేశ విదేశాంగ విధానం భవిష్యత్ దిశను రూపొందించేందుకు 2026లో బ్రిక్స్ అధ్యక్ష హోదా భారతదేశానికి అరుదైన అవకాశాన్ని ఇచ్చింది. భారతదేశం తన వ్యూహాన్ని పునరుద్ధరిస్తుందా లేదా అమెరికాను అనుసరించే పాత మార్గాన్ని కొనసాగిస్తుందా అనేది మన శక్తిమంతమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఆధారపడి ఉంటుంది.

# ప్రపంచ మహిళా శక్తికి మారుపేరు మలాలా


నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందిన అతి చిన్న వయస్కురాలిగా మలాలా యూసఫ్‌జాయ్ రికార్డును నెలకొల్పడం మనకు తెలుసు. కేవలం 17 సంవత్సరాల వయస్సులోనే ఆమె బాలికలకు విద్యా హక్కు, లింగ సమానత్వం, మహిళా సాధికారత లాంటి సామాజిక సవాళ్లను అతి చిన్న వయస్సులోనే చేపట్టి ప్రపంచ మానవాళి దృష్టిని ఆకర్షించిన మలాలా యూసఫ్‌జాయ్ జన్మదినం జూలై 12 సందర్భంగా ఐరాస నేతృత్వంలో ప్రతి ఏటా మలాలా దినోత్సవం పాటించడం ఆనవాయితీగా మారింది. అసమాన ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన చిన్నారి ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన అతి కొద్ది మందిలో ఒకరుగా పేరుగాంచింది. ఒక బిడ్డ, ఒక టీచర్, ఒక పుస్తకం, ఒక కలం ప్రపంచాన్ని మార్చగలవు అని నమ్మే మలాలా యూసఫ్‌జాయ్ పాకిస్థాన్‌లోకి ఒక చిన్న పట్టణం మింగోరాలో 1997 జూలై 12న జన్మించింది. 2007లో ఆ చిన్న పట్టణం తాలిబన్ తీవ్రవాదులు అధీనంలోకి తీసుకొని బాలికలు పాఠశాలకు వెళ్లవద్దని, సంగీతం/టివీలు చూడవద్దని మూర్ఖంగా నిషేధం విధించారు. చదువు మీద అమిత ఆసక్తి కలిగిన మలాలా ధైర్యంగా తాలిబన్ల నిర్ణయాన్ని ఎదిరించి, 2009లో బిబిసి ఉర్దూ మీడియాకు ఈ విషయం గూర్చి రాసింది. ఇందుకు ప్రతీకారంగా 2012లో ఆమెను తాలిబాన్ ముష్కరులు కాల్చడంతో తీవ్రంగా గాయపడి, ఆ దాడి నుంచి బయటపడి ఇంగ్లాండ్‌లో చికిత్స తీసుకొని, అక్కడే తన కుటుంబంతో స్థిరపడింది. 2013 జూలై 12న తన 16వ పుట్టిన రోజున మలాలా యూసఫ్‌జాయ్ ఐక్యరాజ్యసమితిలో ఒక శక్తివంతమైన ప్రసంగం చేసి ప్రపంచాన్ని నివ్వెర పరిచింది. అదే రోజున ఐరాస చొరవ తీసుకొని మలాలా యూసఫ్‌జాయ్ పుట్టిన రోజు జూలై 12న ప్రతి ఏటా మలాలా దినోత్సవం పాటించాలని ప్రపంచ దేశాలను కోరడం జరిగింది. ఐ యామ్ మలాలా అనే పేరుతో తన ఆత్మకథను పుస్తకరూపంలోకి తెచ్చి ప్రపంచ మానవాళికా ప్రేరణగా నిలిచింది. ప్రాణాంతక దాడికి భయపడకుండా బాలికల విద్య హక్కు కోసం గళం విప్పి నిప్పులు చెరిగిన మలాలా కోట్ల మంది చిన్నారులకు స్ఫూర్తినిచ్చే అసాధారణ చిన్నారిగా నిలిచింది.



అమ్మాయిలు చదువుకొని, ఎదిగి, సమాజంలో నాయకురాళ్లుగా నిలవాలని మలాలా జీవితం మార్గనిర్దేశనం చేస్తున్నది. సవాళ్లను, పేదరికాన్ని ఎదిరిస్తూ బాలికలు చదువుకోవాలని మలాలా ధైర్యంగా పిలుపును ఇస్తున్నది. బాలికలు, మహిళలను రెండవ శ్రేణి వ్యక్తులుగా చూడడం తగదని పురుషాధిక్య సమాజాన్ని మేల్కొలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న మలాలా మనందరికీ ఆదర్శప్రాయురాలిగా నిలుస్తున్నది. పుస్తకం, కలం మాత్రమే శక్తివంతమైన ఆయుధాలని పిలుపును ఇవ్వడం, కత్తి, కలంతో పాటు స్త్రీ శక్తి కూడా అత్యంత బలవంతమైనవే అని గళం విప్పిన మలాలా ప్రభావం నేడు ప్రపంచ బాలికలకు దారి దీపంగా మారింది. మలాలా జీవిత కథ స్ఫూర్తిదాయకం. బాలికల, యువతులకు సాధికారత కల్పించాలనే మలాలా సందేశం నిజం కావాలని, లింగ సమానత్వం సాధించడానికి మనందరం కృషి చేయాలి.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐఐటి, ఎన్ఐటి, నీట్ శిక్షణ లభించేనా?

విద్య జీవితానికి వెలుగునిస్తుంది. విద్య లేని వాడు గుడ్డివాడితో సమానం అంటారు. విద్య మనలోని మనోవికాసాన్ని వెలిగిస్తుంది. మార్గదర్శలా తోడుగా నిలుస్తుంది. పురాతన కాలంలో విద్యను జ్ఞానానికి మార్గంగా భావించారు. అలాంటిది జీవితంలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన విద్య, పేదలకు ఇంకా అందని ద్రాక్షలా మిగిలిపోవడం విచారకరం. కేవలం మతపరమైన విద్య మాత్రమే కొనసాగిన ఉపనిషత్తుల కాలంలోనే (క్రీస్తు పూర్వం 400 వందల సంవత్సరాలనుండి 600 సంవత్సరాల మధ్యకాలం) విద్యలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంటే, విద్య గొప్పతనాన్ని, విలువను, అప్పుడే తెలుసుకోగలిగారని గుర్తుంచుకోవాలి. తర్వాత కాలంలో ఎక్కడ కూడా విద్య అలసత్వానికి గురికాలేదు. వేలసంవత్సరాల తర్వాత ఎంతో పరిజ్ఞానం పెరిగి, శాంకేతికతను సంతరించుకున్న ప్రస్తుత కాలంలో, పాలకులు విద్యపై పట్టింపు లేని తనంతో వ్యవహరించడం వల్లనే, ప్రభుత్వం నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల విద్య పోటీ పరీక్షలకు దీటుగా నిలబడలేక, నిరుపేద గ్రామీణ విద్యార్థులకు ఉన్నత అవకాశాలు కల్పించడంలో వెనుకబడి నిరాదరణకు గురవుతోందని చెప్పాలి. పోటీ ప్రపంచంలో గ్రామీణ విద్యార్థులు విద్యలో రాణించాలి అంటే, ప్రభుత్వం అందించే విద్యా విధానంలోనే సమూల మార్పులు రావాలి. ఎట్టకేలకు ఇన్నాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం విద్యకు కొంత ప్రాముఖ్యతను ఇచ్చే అవకాశం ఉందని లీలగా అని పిస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో విద్య చేరిందా అనే సందేహం కూడా కలుగక మానదు. ఇందుకు కారణం మారుమూల అటవీ ప్రాంతం అయిన పెద్దపల్లి జిల్లా, ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో తీసుకువచ్చిన విద్యావిధానమే. అక్కడి విద్యార్థులు 'టీ ఫైబర్' ప్రాజెక్టు కింద పర్ ప్లెక్సిటీ ఏఐ ట్యూల్స్‌ను ఉపయోగిస్తున్నారంటే నమ్మలేకుండా ఉంది. అలాగే సంగారెడ్డి జిల్లా అందోల్, నారాయపేట జిల్లా మద్దూరు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా అమలు చేయడం సంతోషించదగ్గ విషయం. ఆయా పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు ఇంటర్నెట్ పాఠాల కొరకు, డిజిటల్ బోర్డ్స్, మానిటర్స్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు వీటి ద్వారానే విద్యా బోధన చేయడం ప్రభుత్వ విద్యలో విప్లవాత్మకమార్పు కిందనే చూడాలి. విద్యా విధానంలో ఏదో మార్పులకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది అని, ప్రజలు చర్చించుకుంటున్న ఈ తరుణంలో, ప్రభుత్వం ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా, పాఠశాల స్థాయిలో 6వ, తరగతి నుండి 9వ, తరగతి వరకు ఫౌండేషన్ విద్యావిధానాన్ని ప్రవేశ పెట్టాలి. దాని అవశ్యకతను గుర్తించి ప్రణాళికలు రచించాలి. ప్రతీ విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభానికి ముందు నుండి నిర్వహించే, బడిబాట కార్యక్రమంలోనే, మన ప్రభుత్వ స్కూల్‌లో ఫౌండేషన్ విద్య ప్రారంభిస్తున్నామని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. అదే సమయంలో అన్ని స్థాయిల్లో పాఠశాల విద్యా ప్రక్షాళనకు అంకురార్పణ జరగాలి. అప్పుడే ప్రయివేట్ పాఠశాలలకు, కళాశాలకు ధీటుగా ప్రభుత్వ విద్య మనగలుగుతుంది. పాఠశాలలో ఫౌండేషన్ విద్య, కళాశాలల్లో ఐఐటీ, నీట్, వంటి ప్రత్యేక శిక్షణతో, నిత్యం అధ్యయనం, అధ్యాపనం అన్నట్టుగా అధ్యాపకుల టైమ్‌టేబుల్ మారిపోవాలి. దీనికి చిత్తశుద్ధితో కూడిన ఒక గట్టి ప్రయత్నం జరగాలి. అందుకు ముందుగా అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వాలి. గ్రామీణ విద్యార్థులు పాఠశాల విద్యను పూర్తి చేసుకొని, పేదరికాన్ని జయించాలని, విద్యతో సంఘంలో సమాన అవకాశాలు పొందాలని ఎన్నో ఆశలతో ప్రభుత్వం అందించే ఉచిత విద్య కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళితే, అక్కడ వారిని మానసికంగా సంసిద్ధులను చేసి, ఉన్నతంగా తీర్చిదిద్దే వాతావరణం కల్పించక పోవడం (నిర్వాహణ లోపం)తో, కళాశాల విద్య నుండే వెనుదిరిగి దినసరి కూలీలుగా దైనందిన జీవితాన్ని గడిపే పిల్లలు పల్లెల్లో కనిపించడం నేడు పరిపాటిగా మారిపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న 430 జూనియర్ కళాశాలల్లో, సుమారు లక్షా అరవై వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే వీరిలో పోటీ పరీక్షలు ఎదుర్కొనే సామర్థ్యం ఎందుకు కొరవడుతుందో ఖచ్చితంగా ఆలోచించాలి. అదే సమయంలో, రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ కళాశాలల్లో ప్రయివేట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వం అందిస్తున్న ఐఐటి, ఎన్ఐటి, వైద్య విద్య అవకాశాలను గణనీయంగా తన్నుకుపోవడం మనం చూస్తూ నే ఉన్నాం. అంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న కళాశాలల్లో చదివే విద్యార్థులకు అదే ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలు పాసయ్యే శక్తి సామర్థ్యాలు లేకపోవడం ఇక్కడ విద్దూరంగా అనిపిస్తుంది. ఇదంతా సరైన పర్యవేక్షణ లేని విద్యావిధానం వల్లనే అని చెప్పక తప్పదు. ప్రభుత్వాలు మారినా, విద్య పట్ల వారి దృక్పథంలో మార్పు రానప్పుడు ప్రభుత్వాలు అందించే ఉచిత విద్య అయోగ్యంగానే మారుతుంది. ప్రతిసారీ విద్యా సంవత్సరం మొదలవడంతోనే, విద్యాభివృద్ధికి (కళాశాలల మౌలిక సదుపాయాల కొరకు) చాలా మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామని అర్భాటపు ప్రకటనలు చేసే ప్రభుత్వాలు, అంతే చిత్తశుద్ధితో పూర్తి స్థాయి పర్యవేక్షణతో ప్రభుత్వ కళాశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ఐఐటి, నీట్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ అందిస్తే, ఆ అవకాశం అందిపుచ్చుకొని వారు తమ జీవితాలను మార్చుకుంటారు. యోగ్యులుగా మిగులుతారు. సమాజంలో బాధ్యత గల పౌరులుగా భాగస్వామ్యం అవుతారు. అలా కాకుండా, బాహ్య ప్రపంచానికి ప్రభుత్వ పెద్దల ప్రకటనలు, నాలుగు గోడల మధ్యలో జరిగే విద్యాశాఖ అధికారుల సమీక్షలతో ప్రయోజనం ఉండదు. విధానపరమైన లోపాలను సవరించకుండా, కళాశాలల్లో విద్యార్థుల చేరిక కోసం కళాశాల ప్రిన్సిపాల్స్‌పై ఎంత ఒత్తిడి చేసినా లాభం ఉండదు. అందుకే అందరికీ ప్రభుత్వ విద్య తప్పనిసరి చేయాలి. అటు వైపుగా ప్రభుత్వం ఆలోచించాలి. ఇక తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుండి అనుబంధం కోసం, దరఖాస్తు చేసుకోవడంలో ప్రభుత్వం నిర్వహించే జూనియర్ కళాశాలలే సంశయిస్తుండటం, దరఖాస్తు చేయడం కోసం చివరి క్షణాల వరకు వేచి చూడటం వంటి పరిణామాలు విస్మయాన్ని కలిగించక మానదు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం ఇకనైనా విద్యకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తూ, గొప్ప సంకల్పంతో, ఒక క్రమపద్ధతి ప్రకారం కార్యాచరణ తీసుకుంటే, అద్భుతాలు చేయవచ్చు. అసలు ప్రయివేట్ విద్యా విధానాన్ని ప్రభుత్వం త్యజించినప్పుడే విద్యలో సమాన అవకాశాలు వస్తాయనేది జగమెరిగిన సత్యం. రాజ్యాంగంలో పొందపరిచినట్లు అందరికీ నాణ్యమైన విద్య ప్రభుత్వమే అందించాలి. బయటి దేశాలు అభివృద్ధి చెందుతున్నాయి అంటే, అందుకు కారణం అక్కడ విద్యను ప్రభుత్వమే అందించడం వల్ల సాధ్యపడుతుందని గమనించాలి. అయినా సరే, మన జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులకు కొదువలేదు. వీరికి తోడు, ప్రభుత్వం కళాశాలల్లో కొత్తగా జూనియర్ లెక్చరర్స్‌గా నియామకం చేసినవారు కూడా ఎంతో ప్రతిభావంతులు కావడం కలిసి వచ్చే అంశం. వారికి సరైన లక్ష్యాలను నిర్దేశించి, మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే బాధ్యతను ప్రభుత్వం నిజాయితీగా తీసుకున్న నాడు, గ్రామీణ విద్యార్థుల భవితతో పాటు తరాలు మారిన తలరాత మారని స్థితిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల గతిని మార్చిన వారు అవుతారు.



— ధీరన్ కొడారి
8008200664


## ప్రైవేట్ ఉపాధ్యాయుల
# జీవితాలు అమానవీయం

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 15,360 ప్రైవేట్ పాఠశాలలు, అందులో 1,40,000 విద్యార్థులు, 41,360 మంది ఉపాధ్యాయులు ఉన్నారని ఒక అంచనా. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, తక్కువ జీతాలతో, తల్లి దండ్రుల అధిక అంచనాలతో బాధ పడుతున్నారు. వీరికి ఉద్యోగ భద్రత కరువు.. వారు తీవ్రమైన పనిభారం, వేగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఒత్తిడిని కూడా ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలో కఠినమైన విద్యా ప్రమాణాలతో విద్యార్థుల మార్కులు సాధించడానికి ఉపాధ్యాయులపై యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి.

ఉపాధ్యాయులు తరగతుల్లో పాఠాలు చెప్పడమే కాకుండా పాఠశాలలు నిర్వహించే ఇతర కంప్యూటర్, ఫీజు వసూలు చేసే పనులు కూడ చేయవలసి వస్తుంది.పిల్లలు పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ వస్తే బలి పశువుగా మారేది ఉపాధ్యాయులే. తల్లిదండ్రులను, పిల్లలను కౌన్సెలింగ్ చేయడం, సాయంత్రం, సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం కోల్పోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయుల కంటే ఎక్కువ విద్యార్హతలు ఉన్నను వారి కంటే తక్కువ వేతనం పొందుతూ ఉన్నారు. కాంట్రాక్ట్ ఆధారిత ఉద్యోగాల వలన వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా ఉంది. పిఎఫ్, గ్రాట్యుటీ, వైద్య భీమా లాంటి సౌకర్యాలు లేకుండా ఎటువంటి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత లేకుండా జీవిస్తున్నారు. అధిక గంటలు ఏకబిగిన తరగతుల్లో భోదించడం వలన గొంతు ఇన్ఫెక్షన్లు, స్వర పేటిక దెబ్బ తినే ప్రమాదం ఉంది. బోధనకై ఎక్కువ సేపు నిలబడటం వలన వెన్ను నొప్పు, మోకాలి నొప్పులతో బాధ పడటం జాలి కలగక మానదు. తక్కువ జీతాలు ఎక్కువ పని ఒత్తిడి వలన ప్రైవేట్ ఉపాధ్యాయుల జీవితాలు అమానవీయంగా ఉన్నాయి. ప్రభుత్వ విద్యా అధికారులు ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేసినప్పుడు కేవలం విద్యార్థుల సంఖ్య, రిజిస్ట్రేషన్ పేపర్లు చూడటం తప్ప, ఉపాధ్యాయుల జీత భత్యాల, వారి ఉద్యోగ భద్రతల గురించి చర్చించుట లేదు, కార్పొరేట్ పాఠశాలల వాణిజ్య ప్రకటనలతో విద్యార్థులు చెల్లించే ఫీజులతో కోట్లకు పడగలెత్తిన్న వారిని ప్రశ్నించే నాథుడు కరువైనాడు. ఎప్పుడో ఒకసారి కార్పొరేట్ పాఠశాల విద్యార్థి ఏదో కారణంతో మరణించగానే విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు చేసే ధర్నా, నిరసన ఒక రోజుకు పరిమితం.నిత్యం శ్రమ దోపిడీకి గురవుతున్న ఉపాధ్యాయులు పరిస్థితి ఏమిటి? ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎటువంటి హక్కులు లేకుండా, అటు కార్మిక హక్కులు ఇటు ఉపాధ్యాయ హక్కులు లేకుండా జీవిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, వేతన పెంపు, ప్రమోషన్స్ గురిం చి ప్రభుత్వాలతో చర్చ జరుపుతున్నారు. కానీ ప్రైవేట్ ఉపాధ్యాయుల మాటేమిటి? ఒకే వృత్తిలో పని చేసే వారి పట్ల వివక్షత ఉండరాదు. టీచర్స్ నుంచి శాసన మండలికి ఎన్నికైన సభ్యులు కూడా వీరి గురించి నోరు మెదపకపోవడం బాధాకరం. గిగ్ వర్కర్ల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేసినట్లుగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా గిగ్ వర్కర్ల జాబితాలో చేర్చి వీరికి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించే అవసరం ఎంతైనా ఉంది.

లేఖ

— ఆళవందార్ వేణుమాధవ్
8686051752, హైదరాబాద్



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## జమిలి ఎన్నికల పార్లమెంటరీ కమిటీ ముందుకు మాజీ సిజెఐలు

**న్యూఢిల్లీ :** భారత మాజీ ప్రధాన న్యాయమూర్తులు జె.ఎస్. ఖేహర్, డి.వై. చంద్రచూడ్ శుక్రవారం జమిలి ఎన్నికల బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీతో సమావేశమయ్యారు. 'ఒక దేశం– ఒకే ఎన్నిక' అనే భావన రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించడం లేదని, కానీ ప్రతిపాదిత చట్టంలో ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారం ఎంతవరకు ఉందో ప్రశ్నించాలని ఇద్దరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారని వర్గాలు తెలిపాయి. దేశంలో ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ ప్రయాణంపై వారు కొన్ని సూచనలు కూడా చేశారు. బిజెపి ఎంపి పి.పి. చౌదరి నేతృత్వంలోని పార్లమెంటు సంయుక్త కమిటీ బిల్లుపై తమ సిఫార్సును సిద్ధం చేస్తున్న నేపథ్యంలో న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది. భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తులు యు.యు. లలిత్, రంజన్ గొగోయ్ గతంలో కమిటీ ముందు హాజరయ్యారు. వీరిద్దరు ఏకకాల ఎన్నికల రాజ్యాంగబద్ధతను ప్రశ్నించనప్పటికీ, వారు బిల్లులోని కొన్ని అంశాలను ప్రశ్నించి సూచనలు అందించారు.

## సుప్రీం తీర్పు ఓటు హక్కును కాపాడుతుందని ఆశిస్తున్నాం : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పిటిషనర్లలో ఎవరూ స్టే కోరలేదని స్పష్టం చేస్తోందని కాంగ్రెస్ పేర్కొంది. ఈ తీర్పు అధిక సంఖ్యలో ఓటర్లను ఓటు హక్కును కోల్పోకుండా కాపాడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్నికల సమయంలో ఆధార్, ఓటరు ఐడి, రేషన్ కార్డులను చెల్లుబాటు అయ్యే పత్రాలుగా పరిగణించాలని సుప్రీంకోర్టు గురువారం ఎన్నికల సంఘాన్ని కోరింది. కాగా, సుప్రీంకోర్టు అధికారికంగా జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, ఎన్నికల సంఘం ఇప్పుడు బిహార్‌లోని ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణలో ఎపిక్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులను చేర్చాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సుప్రీంకోర్టు స్టేకు నిరాకరించడంపై ఇసి స్పిన్ స్పష్టంగా బయటపడిందన్నారు. పిటిషనర్లలో ఎవరూ స్టే కోరలేదని ఆర్డర్‌లోని 7వ పేజీ స్పష్టం చేస్తోందని, ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించే ఇటువంటి హెడ్‌లైన్ నిర్వహణ రాజ్యాంగ అధికారానికి తగినది కాదన్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పును తప్పుగా అర్థం చేసుకున్నారని బిజెపి ఆరోపించింది.

# 'క్రాస్‌రోడ్డు'పై...భారతదేశ జనాభా

### పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వెల్లడి
### అది ఒక సంక్షోభం కాదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** అధిక జనాభా లేదా సంతానోత్పత్తి తగ్గదలపై భయాందోళన కలిగించే చర్చలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు, యువత, వృద్ధులకు అవకాశాలు, గౌరవం, హక్కులు కల్పించే విధానాలపై కేంద్రం దృష్టి సారించాలని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) కోరింది. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం2025 సందర్భంగా ఎన్‌జిఒ పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఒక ప్రకటనలో భారత దేశ జనాభా సవాళ్లు సంఖ్య గురించి కాదు కానీ న్యాయం, సమానత్వం, మానవ సామర్థ్యంలో పెట్టుబడి కోసమని నొక్కిచెప్పింది. 'భారతదేశ జనాభా కథ ఒక సంక్షోభం కాదు, ఇది ఒక కూడలి' అని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా ఈ సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో అన్నారు.యువత తమకు కావాల్సిన కుటుంబాలను, ఆశాజనకమైన ప్రపంచాన్ని సృష్టించడానికి వారిని శక్తివంతం చేయాలనే ప్రపంచ థీమ్‌తో ప్రపంచజనాభా దినోత్సవాన్ని జరుపుకుంటోంది. భారతదేశం జనాభా సంఖ్యలతో పోలిస్తే న్యాయం, సమానత్వం, మానవవనరులలో పెట్టుబడితో ముడిపడి ఉందని ఎన్‌జిఒ వాదించింది. 'మనం అధిక జనాభా పతనం'అనే భయాందోళనల మధ్య ఊగిసలాడటం మానేసి, బదులుగా నిజంగా ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టాలి. అవి నాణ్యత, పునరుత్పత్తి, స్వయం ప్రతిపత్తి, సమ్మిళిత ప్రజా పెట్టుబడి' అని ఆమె వెల్లడించింది. ఫౌండేషన్ ప్రకటన విధాన రూపకర్తలకు మూడు కీలక రంగాలపై దృష్టి సారించింది. 'మొదటిది లింగభేదాన్ని గ్రహించడం. సంతాన నిరోధక శస్త్ర చికిత్సకు అతీతంగా వివిధ రకాల గర్భ నిరోధకాలు,



వాటిలో మహిళలు బాధ్యతలను పంచుకోవడం. పురుషులు కేవలం మద్దతుదారులుగా మాత్రమే పరిష్కారంలో భాగస్వాములు కావాలి. నివాసంలో, కార్యాలయంలో మహిళల భద్రతను నిర్ధారించడం పురుషుల బాధ్యత అని ముత్రేజా చెప్పారు. 'కుటుంబ నియంత్రణ చాలాకాలంగా స్త్రీ బాధ్యతగా చూడబడుతోంది. కానీ పునరుత్పత్తి ఆరోగ్యం ఉమ్మడి బాధ్యత' అని ఆమె తెలిపారు.250మంది యువకులు, ముఖ్యంగా కౌమారదశలో ఉన్నటువంటి బాలికలకు విద్య, నైపుణ్యాభివృద్ధి , పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక శ్రేయస్సులో పెట్టుబడి పెట్టడం ద్వారా సమగ్ర వృద్ధిని సాధించడానికి భారతదేశానికి ఒక ప్రత్యేక అవకాశం ఉంది. మూడవది వెండి డివిడెండ్‌కు సిద్ధం కావడం.2050నాటికి దాదాపు ఐదుగురు భారతీయులలో ఒకరు 60ఏళ్లు పైబడినవారు ఉంటారని గమనించి వృద్ధుల సంరక్షణ, పెన్షన్లు, ఆరోగ్య సందరక్షణ, వయస్సుకు అనుకూలమైన మౌలిక సదుపాయాలలో తక్షణ పెట్టుబడులు పెట్టాలని , వృద్ధులను ఆధారపడినవారుగా కాకుండా కీలకమైన సహాయకులుగా చూడాలని పాపులేషన్ ఫౌం డేషన్ ఆఫ్ ఇండియా పిలుపునిచ్చింది.' మన విధానాలలో ప్రజలను ముఖ్యంగా మహిళలు,యువకులు, వృద్ధులను కేంద్రీకరిస్తే, జనాభా ధోరణులు సంక్షోభాలు ఉండవని తెలిపింది. మరింత న్యాయమైన స్థితిస్థాపక భవిష్యత్తుగా ఉంటాయి' అని పిఎఫ్ఐ ప్రకటన సూచించింది.

## బిహార్‌లో కోటి మంది లబ్ధిదారులకు పెన్షన్ అందజేత



**పాట్నా :** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సీనియర్ సిటిజన్లు, వితంతువులు, వికలాంగులు సహా 1.11 కోట్ల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నెలకు రూ.1,100 చొప్పున పెంచిన పెన్షన్ మొత్తంలో మొదటి విడతను పంపిణీ చేశారు. శుక్రవారం పాట్నాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆరు వేర్వేరు పెన్షన్ పథకాల కింద రూ.1,227 కోట్లకు పైగా జమ చేసినట్లు అధికారులు తెలిపారు. బీహార్ ప్రభుత్వం జూన్ 24న పెన్షన్ మొత్తాన్ని నెలకు రూ.400 నుండి రూ.1,100కు పెంచింది. కాగా, వృద్ధులు సమాజంలో ఒక ముఖ్యమైన భాగమని, వారికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం తమ ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యత అని సిఎం నితీశ్ కుమార్ అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. పెన్షన్ మొత్తాన్ని ప్రతి నెల 10వ తేదీన పంపిణీ చేసేలా చూస్తామని కుమార్ పేర్కొన్నారు. బిహార్ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల సమగ్ర అభివృద్ధికి కూడా కట్టుబడి ఉందని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం మహిళల సాధికారత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, వారి విద్య, భద్రత, ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మహిళా సాధికారత పరంగా తాము ఉదాహరణగా నిలిచామన్నారు. 2005కు ముందు, మునుపటి ప్రభుత్వం మహిళలకు ఏమీ చేయలేదని, తాము అధికారం చేపట్టిన తర్వాతే నిజమైన మార్పు ప్రారంభమైందని నితీశ్ చెప్పుకొచ్చారు. బిహార్‌లో ప్రతిపక్షాలతో చేతులు కలిపి గతంలో తాను 'తప్పులు' చేశానన్నారు. 'ఇధార్ ఉధార్' (ఇక్కడ, అక్కడ) రెండుసార్లు దారి తప్పాను. కానీ ఇప్పుడు, నేను ఎన్‌డిఎతో ఉన్నాను. ఎప్పటికీ కూటమితోనే ఉంటాను. రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తా' అని స్పష్టం చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం, ముఖ్యమంత్రి వృద్ధజన్ పెన్షన్ యోజన, ఇందిరా గాంధీ జాతీయ వితంతు పెన్షన్ పథకంతో సహా ఆరు పెన్షన్‌లను నిర్వహిస్తుంది. ఈ పథకాలకు మధుబని జిల్లాలో అత్యధికంగా 5,53,848 మంది లబ్ధిదారులు ఉన్నారు. తరువాత పాట్నాలో 5,26,339 మంది లబ్ధిదారులు ఉన్నారని అధికారులు తెలిపారు. 71,971 మంది లబ్ధిదారులతో, షేక్‌పురాలో అత్యల్పంగా 7.95 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

# పదే పదే అడగొద్దు

### సిఎం మార్పుపై ప్రశ్నలకు మీడియాపై డికె శివ కుమార్ అసహనం

**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో, ఈ విషయంపై అన్ని ప్రశ్నలకు సిఎం సమాధానమిచ్చారని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తెలిపారు. 'ముఖ్యమంత్రి ఇప్పటికే మీ అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. నేను అదే పదే పదే చెప్పడం సముచితం కాదు, మీరు కూడా అడగడం సరికాదు' అని శివకుమార్ న్యూఢిల్లీ నుండి తిరిగి వచ్చిన తర్వాత బెంగళూరు విమానాశ్రయంలో విలేకరులతో అన్నారు. సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరూ ఈ వారం ప్రారంభంలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవడానికి ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. 'మేము లేనప్పుడు మీరు (విలేకరులను చూపిస్తూ) మా అంతర్గత విషయాల గురించి ఎందుకు భయపడుతున్నారు?' అంటూ చర్చలు అధికార పంపిణీ ఏర్పాటు గురించి అనే ఊహాగానాలను శివకుమార్ తోసిపుచ్చారు. మే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత, ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఆ సమయంలో వచ్చిన నివేదికల ప్రకారం, వారు రొటేషనల్ సిఎం ఫార్ములాపై అంగీకరించారని, దీని ప్రకారం శివకుమార్ రెండున్నర సంవత్సరాల తర్వాత 2025 నవంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తోంది. అయితే, పార్టీ అలాంటి ఒప్పందాన్ని ఎప్పుడూ ధృవీకరించలేదు. కాగా, పార్టీలో సిఎంగా బాధ్యతలు స్వీకరించడానికి తనకు మద్దతు పెరుగుతోందని అడిగినప్పుడు, శివకుమార్ స్పందిస్తూ దాన్ని వదిలేయండి. మీలో చాలా మందికి ఆకాంక్షలు కూడా ఉన్నాయి అని అన్నారు. నాయకత్వ మార్పు గురించిన ప్రశ్నలపై మరింత వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు.



ఈ సమయంలో మీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పను అని ఆయన అన్నారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎటువంటి రాజకీయ చర్చలు జరగలేదని ఆయన అన్నారు. పార్టీ కార్యకర్తలను బోర్డులు, కార్పొరేషన్ల చైర్మన్లుగా, సభ్యులుగా నియమించడంపై తాము చర్చించామన్నారు. అందరు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను సమర్పించినందున తాము ఇప్పుడు చివరి దశలో ఉన్నామని, హైకమాండ్‌తో మరో రౌండ్ చర్చలు పేర్లను ఖరారు చేయడంలో సహాయపడతాయన్నారు. గురువారం సిద్ధరామయ్య ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో నాయకత్వ మారు పై ఊహాగానాల గురించి అడిగినప్పుడు అత్యున్నత పదవికి 'ఖాళీ' లేదని అన్నారు. 'ముఖ్యమంత్రి పదవికి ఖాళీ ఉందా? నేను మీ ముం దు ఉన్నాను. నేను కర్ణాటక ముఖ్యమంత్రిని. శివకుమార్ చెప్పి ంది అదే, నేను కూడా చెబుతున్నాను... ఖాళీ లేదు' అని ఆయన అన్నారు.



## ట్రక్కు లోయలో పడి 5 మంది కార్మికులు మృతి

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో బోర్‌వెల్ తవ్వుతున్న ట్రక్కు ఒక చిన్న లోయలో పడిపోవడంతో ఐదుగురు కార్మికులు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కుక్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాటా గ్రామం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగిందని కబీర్‌ధామ్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ పుష్పేంద్ర సింగ్ బాఘేల్ తెలిపారు. ఆ వాహనం పొరుగున ఉన్న మధ్యప్రదేశ్ నుండి వస్తోందని ఆయన చెప్పారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, తొమ్మిది మందితో కూడిన ట్రక్కు ఒక చిన్న లోయలో పడి బోల్తా పడిందని ఆయన చెప్పారు. ప్రయాణికులలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, మరికొందరిని ఆసుపత్రికి తరలించారని, అక్కడ మరో ఇద్దరు మృతిచెందారని అధికారి తెలిపారు. గాయపడిన నలుగురు వ్యక్తులు చికిత్స పొందుతున్నారని, మృతుల గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉందని ఆయన అన్నారు.


# 22 మంది నక్సల్స్ లొంగుబాటు



**నారాయణ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మరో 22 మంది నక్సల్స్ లొంగిపోయారు. అభుజ్‌మద్ ప్రాంతంలో చురుకుగా వ్యవహరిస్తూ తమ తలలపై మొత్తంగా రూ.37.5 లక్షల రివార్డు ఉన్న మాయిస్టులు శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో లొంగిపోయారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. మాడ్ డివిజన్ మావోయిస్టుల పరిధిలోని కుతుల్, నెల్నార్, ఇంద్రావతి ఏరియా కమిటీలకు చెందిన వీరి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) అధికారుల ముందు లొంగిపోయారు. 'బోలు' మావోయిస్టు భావజాలం, నిషేధిత సంస్థలో పెరుగుతున్న అంతర్గత విభేదాలతో నిరాశ చెందామని లొంగిపోయిన నక్సలైట్లు పోలీసులకు చెప్పారని నారాయణ్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గురియా తెలిపారు. జిల్లాలోని మాడ్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు, వేగంగా రోడ్ల నిర్మాణం ద్వారా కూడా వారు ప్రభావితులయ్యారని, సాధారణ జీవితాన్ని గడపాలని కోరుకున్నారని ఆయన అన్నారు. ఆయుధాలు వదులుకున్న నక్సలైట్లలో డివిజనల్ కమిటీ సభ్యుడు మంకు కుంజమ్ (33) తలపై రూ. 8 లక్షల రివార్డు, హిడ్మే కుంజమ్ (28), పున్న లాల్ అలియాస్ బోటి (26), సనిరామ్ కొర్రం (25) అనే ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులపై రూ. 5 లక్షల చొప్పున రివార్డు ప్రకటించినట్లు అధికారి తెలిపారు. పదకొండు మంది కేడర్లకు ఒక్కొక్కరికి రూ. లక్ష రివార్డు, మరో ఏడుగురు కేడర్లకు రూ. 50,000 రివార్డు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. నరాన్‌పూర్ పోలీసులు, నరాయణ్‌పూర్ జిల్లా రిజర్వ్ గార్డ్ ఐటిబిపి, బిఎస్ఎఫ్ నక్సల్స్ లొంగుబాటులో కీలక పాత్ర పోషించాయని, ఈ పరిణామం అగ్రశ్రేణి మావోయిస్టు కేడర్లకు భారీ దెబ్బగా మారిందని, నక్సల్ రహిత మాడ్ కల సాకారం అవుతోందని గురియా చెప్పారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ ఒక్కొక్కరికి రూ. 50,000 సహాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని ఆయన చెప్పారు. ఈ లొంగుబాటుతో ఈ సంవత్సరం ఇప్పటివరకు జిల్లాలో 132 మంది నక్సలైట్లు హింసను విడిచిపెట్టారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ప్రశంసిస్తూ, నక్సలైట్లు ఇప్పుడు తుపాకులను పక్కనపెట్టి అభివృద్ధి పథంలో కలిసి నడవాలనుకుంటున్నారన్నారు. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం (కేంద్రంలో మరియు రాష్ట్రంలో బిజెపి పాలన) మార్చి 31, 2026 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించడానికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

# పటిష్ట భద్రత మధ్య కన్వర్ యాత్ర ప్రారంభం

**డెహ్రాడూన్ :** పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య శుక్రవారం కన్వర్ యాత్ర ప్రారంభమైంది. గంగా జలాన్ని సేకరించడానికి వేలాది మంది కన్వర్యలు పవిత్ర నగరం హరిద్వార్‌కు చేరుకున్నారు. ఉదయం నుండి హరిద్వార్‌లోని వివిధ ఘాట్‌ల వద్ద కాషాయ సముద్రం కనిపించింది. ఘాట్‌ల వద్ద కన్వర్యలు స్నానం చేసి నీటిని సేకరించారు. ప్రతి సంవత్సరం సావన్ మాసం ప్రారంభంతో వివిధ రాష్ట్రాల నుండి కన్వర్యలు హరిద్వార్‌లోని గంగా జలాన్ని తీసుకెళ్లి వారి స్వస్థలాలలోని శివాలయాలలో 'జలాభిషేకం' చేస్తారు. కాగా, ఉత్తరాఖండ్ డిజిపి దీపం సేథ్ మాట్లాడుతూ 7,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ దళాలు, జల పోలీసులు (నదులు, ఘాట్‌ల వెంట మునిగిపోయే సంఘటనల కోసం మోహరించబడ్డారు), నిఘా అధికారులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, ప్రాంతీయ సాయుధ కాన్స్టాబులరీ (పిఎసి), ఉగ్రవాద నిరోధక దళాన్ని



కన్వర్ యాత్ర భద్రత కోసం మోహరించామని చెప్పారు. కన్వర్ యాత్ర సజావుగా సాగడానికి డ్రోన్‌లు, సిసిటివి, సోషల్ మీడియా ట్రాకింగ్ ద్వారా ప్రతి అనుమానాస్పద కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా సాధువులు, సాధువులుగా నటిస్తూ ప్రజలను, ముఖ్యంగా మహిళలను మోసం చేసే సామాజిక వ్యతిరేక శక్తులపై 'ఆపరేషన్ కలనేమి'ని ప్రారంభించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ 'ఇది ప్రజల మతపరమైన మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా సామాజిక సామరస్యం, సనాతన సంప్రదాయ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తోందన్నారు. ఏదైనా మతానికి చెందిన ఎవరైనా ఇలాంటి చర్యలు చేస్తున్నట్లు కనిపిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కన్వర్ యాత్రలో పాల్గొనేవారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. గత సంవత్సరం, కన్వర్ యాత్ర సందర్భంగా నాలుగు కోట్లకు పైగా కన్వర్లు హరిద్వార్, రిషికేశ్‌కు చేరుకున్నారు. ఈ సంవత్సరం ఆరు నుండి ఏడు కోట్ల మంది కన్వర్లు వస్తారని ప్రభుత్వ అధికారులు తెలిపారు.

## మహిళా సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు సర్ప్‌కు ఆర్థిక శాఖ నిధులను విడుదల చేసింది. ఇందులో రూ. 300 కోట్లు గ్రామీణ మహిళ సంఘాలకు, రూ. 44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు కేటాయించింది. శనివారం నుంచి ఈ నెల 18 వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీలు జమకానున్నాయి. దీనికి సంబంధించిన చెక్కులను అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎంఎల్‌ఎలు పంపిణీ చేయనున్నారు. ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులను కూడా పంపిణీ చేయనున్నారు. కాగా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో వడ్డీలేని రుణాలు నిలిచాయి, సుమారు రూ.3000 కోట్ల వరకు బకాయిలు పెట్టినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం



లోకి రాగానే సకాలంలో వడ్డీలేని రుణాల చెల్లించారు. దీంతో మహిళా సంఘాల ఆర్థిక కార్యకలాపాల్లో అనూహ్య వృద్ధి కనిపించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క చొరవతోనే మహిళా సం ఘాలకు రుణాలు మంజూరయ్యాయని మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తెలిపారు.

## రాష్ట్రంలో మరో 18 దత్తత కేంద్రాలు..

### 2 బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు
### దస్త్రపై మంత్రి సీతక్క సంతకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు (ఎస్ఎఎఎస్), రెండు బాలల సంరక్షణ కేంద్రాలను (చిల్డ్రన్ హోమ్స్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల దస్త్రంపైన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం సంతకం చేశారు. కాగా సిఎం ఆమోదం లభించిన వెంటనే ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభంకానుంది. తెలంగాణలో శిశు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది, అనాథలు లేదా తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ, వారికి అన్ని అవసరాలను



అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కు చేరనున్నాయి. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనికి కొనసాగింపుగా దత్తత కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా రూ. 5.44 కోట్లు ఖర్చు అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను సిద్ధం చేసింది. అందులో 60 శాతం (రూ. 3.26 కోట్లు) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం (రూ. 2.17 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ కేంద్రాల్లో సేవలందించేందుకు 228 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నారు. ముఖ్యమంత్రి సంతకం అనంతరం ఈ ప్రాజెక్టు అమలు ప్రారంభంకానున్నాయి.

## హైకోర్టులో కెవియట్ దాఖలు చేసి.. బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఇవ్వాలి

### : ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే హైకోర్టులో కెవియట్ దాఖలు చేసి, ఆర్డినెన్స్ జారీ చేయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులతో కలిసి హైదరాబాద్ లోని తన నివాసంలో కవిత శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపి, ఆర్డినెన్స్‌జారీ చేయాలని, వెంటనే ఆమోదం తెలిపేలా బిజెపి రాష్ట్ర నాయకులు గవర్నర్‌పై ఒత్తిడి పెంచాలని సూచించారు. బిసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో తాము పిలుపునిచ్చిన రైల్ రోకోను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ప్రకటించారు.బిసి రిజర్వేషన్ల బిల్లును ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కేంద్ర మంత్రి బండి సంజయ్ తీసుకోవాలని, షెడ్యూల్ 9లో బిసి రిజర్వేషన్లను పొందుపర్చి, రాజ్యాంగ పరమైన భద్రత కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో యుపిఎఫ్ కన్వీనర్ బొల్లా శివశంకర్, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు రూప్ సింగ్, వరలక్ష్మి , లలితా యాదవ్, సంపత్ గౌడ్, కొట్టాల యాదగిరి, నరేందర్ యాదవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



ప్రముఖ న్యాయవాది విద్యాసాగర్ రావు దంపతులను పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కెవిఎల్, విజయలక్ష్మి పండిట్, మంద సదాలక్ష్మి



కాలుష్య నియంత్రణ మండలిలో..

## అంతర్జాతీయ జనాభా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో శుక్రవారం అంతర్జాతీయ జనాభా దినోత్సవం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బివి రాజు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కెజి రెడ్డి కాలేజ్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, అవినాష్ కాలేజ్‌ల నుండి మొత్తం 61 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ డబ్ల్యూ జి. ప్రసన్న కుమార్ జనాభా సిద్ధాంతాలపై మాట్లాడారు. టిజిపిసిబి పర్యావరణ విద్యా ప్రాజెక్ట్ అధికారి బి. నాగేశ్వరరావు ఈ దినోత్సవ ప్రాముఖ్యతను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ అవగాహన అవసరాన్ని తెలిపారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలైన భారత్ (1.44 బిలియన్), చైనా (1.42 బిలియన్), అమెరికా (347 మిలియన్), ఇండోనేసియా (280 మిలియన్), పాకిస్తాన్ (242 మిలియన్), నైజీరియా (234 మిలియన్) గురించి చర్చించారు.

## హైదరాబాద్‌లో జింక మాసం విక్రయం
### పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జింక మాసం విక్రయించిన ఘటన హైదరాబాద్ నడిబొడ్డులో జరిగింది. టోలిచౌకికి చెందిన సిరాజ్, వసీమ్ చార్మినార్ చౌక్ వద్దకు వెళ్లారు. ఓ వ్యక్తి వద్ద జింక మాసం కొనుగోలు చేశారు. దీంతో ఈ సమాచారం పోలీసులకు అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సిరాజ్, వసీమ్ను అదుపులోకి తీసుకున్నారు. 'ఎవరి వద్ద కొనుగోలు చేశారు. జింకను ఎక్కడ పట్టుకొచ్చారు.' అనే కోణంలో విచారణ చేపట్టారు. అయితే జింకమాసం విక్రయం వెనుక పెద్ద నెట్ వర్కే ఉన్నట్లు తెలుస్తోంది. ఎప్పటి నుంచో ఈ దందా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ దందా వెనక ఎవరున్నారో కనిపెట్టి మిగిలిన జింకల ప్రాణాలను కాపాడాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు. మన దేశంలో జంక మాసం నిషేధం. అమ్మకూడదు.. తినకూడదు. ఇదీ జాతీయ రూల్. అలాంటిది ఇప్పుడు జింక మాంసం చాలా ఈజీగా దొరుకుతుంది. జింకను వేటాడకూదని అవగాహన కల్పించినా యదేచ్ఛగా చంపుతున్నారు. అనంతరం అమ్ముకుంటున్నారు. డబ్బుల కోసం అడవి జంతువును వేటాడుతున్నారు.

## బిసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ అభినందనీయం
### సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు జాజుల కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం 2018–పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి ఆర్డినెన్స్ ద్వారా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని నిర్ణయించడం అభినందనీయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, బిసి మంత్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశ్‌చారి అధ్యక్షతన శుక్రవారం జరిగిన వివిధ బిసి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి బిల్లు ఆమోదించాలని మూడు నెలలుగా ఎదురుచూసినా కేంద్రం బిసిలకు నిరాశే మిగిల్చిందన్నారు. తప్పనిసరి పరిస్థితిలో బిసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తేవాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇది ముమ్మాటికి బిసిల పోరాట విజయమేనన్నారు. అగ్ర కులాలు బిసి రిజర్వేషన్ల పెంపునకు సహకరించాలని లేదంటే, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దుకు రోడ్డెక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూసినా పార్టీ నేతలను వివిధ పార్టీల నాయకత్వం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రెండు మూడు రోజుల్లో అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలు, మేధావులతో సమావేశం ఏర్పాటుచేస్తామని తెలిపారు. సమావేశంలో మహాత్మ జ్యోతిభాపూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, ప్రొఫెసర్ భాగయ్య, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



## 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలి
### ఈనెల 15న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా
### తాటిపాముల వెంకట్రాములు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తరువాతనే స్థానిక సంస్థలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కార్యాలయాలు, ఆర్‌డిఓ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి, వినతిపత్రాలు అందచేసే కార్యక్రమాలు నిర్వహించాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి, 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేసి, కేంద్రానికి పంపితే కేంద్ర ప్రభుత్వం ఆమోదం ముద్ర వేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. ఎందుకు కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లుకు ఆమోద ముద్ర వేయడం లేదో తెలంగాణ రాష్ట్రంలోని బిజెపి నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి పార్టీ పచ్చి బిసి వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. గత 11 సంవత్సరాలుగా కేంద్రంలో కులగణన చేపట్టకుండా ఏకాభిప్రాయం పేరుతో కాలయాపన జరుపుతుందన్నారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా రగులుతున్న అస్తిత్వ ఉద్యమాలకు తలొగ్గి తప్పనిసరి కులగణనకు ముందుకు వచ్చిందన్నారు. 2027లో కులగణన చేపడుతామని ప్రకటించడం సరికాదన్నారు. 2025 బిసి కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, లొడంగి శ్రవణ్ కుమార్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీటి నరసయ్య పాల్గొన్నారు.

అమెరికా – తెలంగాణ మధ్య

# వాణిజ్య సంబంధాల మెరుగుకు కృషి

### అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమెరికా – తెలంగాణల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణను 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ దార్శనికతకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు మాకు అమెరికన్ల మద్దతు కావాలని సిఎం కోరారు. హైదరాబాద్ మరింత పురోభివృద్ధి సాధించాలని, అమెరికాలోని అత్యుత్తమైన వాటిని తెలంగాణకు తీసుకొస్తారని ఆశిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసం, విలువల ఆధారంగా అమెరికా భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని, వ్యాపార, వాణిజ్య రంగాలు, పెట్టుబడులు, ప్రజాస్వామ్యాన్ని విస్తృతం చేయడం, ప్రపంచ శాంతిని నెలకొల్పడం వంటి లక్ష్యాలతో స్నేహపూర్వక బలమైన సంబంధాలు కలిగి ఉండాలని ఇరు దేశాలు కోరుకుంటున్నాయన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రపంచం పూర్తిగా మారిపోయిందన్నారు. అమెరికా ప్రపంచం ముందు అనేక సానుకూల అంశాలను ఆవిష్కరించిందని, ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతరం ఆవిష్కరణలను అందించడమనే రెండు అంశాల్లో అమెరికా ప్రపంచ దృక్కోణాన్ని మార్చిందన్నారు. ఓటమిని ఎప్పుడూ అంగీకరించని స్ఫూర్తి అమెరికాదని, ఎల్లప్పుడూ బలమైన దేశంగా, అనేక అంశాల్లో ఒక సానుకూల మార్గంలో పరిష్కారాలను చూపగలిగిందన్నారు. తెలంగాణ స్ఫూర్తి కూడా అమెరికా స్ఫూర్తికి ఎంతో సారూప్యత ఉందని, స్నేహాన్ని కోరుకోవడం, బంధాన్ని మరింత పటిష్టపరుచుకోవడం తెలంగాణ ప్రత్యేకత అన్నారు. భారత దేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతను ప్రదర్శించిందన్నారు. అమెరికాతో తెలుగు ప్రజలకు ఉన్న స్నేహపూర్వకమైన బంధం ఎంతో బలమైందని, అమెరికాలో తెలుగు భాష వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రెండు సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలను పటిష్టపరచడంలో ఇరు దేశాల మధ్య బలమైన వారధిగా నిలుస్తున్నారన్నారు. ఐటి, ఫార్మా, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుతం పనిచేస్తున్నాయన్నారు. ముఖ్యంగా సైనిక విన్యాసాలు, అంతరిక్ష పరిశోధనలో సహకారం, సాంకేతిక రంగంలో పెట్టుబడులకు సంబంధించిన వాణిజ్యంలో ఇరు దేశాలు రికార్డు నెలకొల్పాయన్నారు. 2008 లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైందని గుర్తు చేశారు. ఎంతో మంది విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకోవడానికి ఇక్కడి నుంచి అమెరికా వెళుతున్నారు.

లాల్ దర్వాజా మహంకాళి ఆలయంలో..

## జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శుక్రవారం ఉదయం పాతబస్తీలో ప్రసిద్ధిగాంచిన లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న కమిషనర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఆలయ కమిటీ సభ్యులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దేవాలయం పరిసరాలలో శుభ్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నో రోజులుగా లాల్ దర్వాజా మహంకాళి దేవాలయాన్ని దర్శించాలనే కోరిక ఉండేదని, ఈ రోజు అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పాతబస్తీలోని ఈ దేవాలయానికి చారిత్రక ప్రాముఖ్యతతో పాటు విశిష్టత కూడా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు హైదరాబాద్ నగర ప్రజలందరిని కాపాడాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు.



## 51కి చేరిన కల్తీకల్లు బాధితులు
### ఏడుకు చేరిన మృతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య శుక్రవారం నాటికి 51కి చేరింది. వీరంతా నీమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్నారు. తాజాగా మరో ఇద్దరు మృతి చెందడంతో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. నిమ్స్ ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులిటెన్లో కీలక విషయాలను వెల్లడించారు. నిమ్స్ వైద్యుల హెల్త్ బులిటెన్ ప్రకారం.. చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. మొత్తం 34 మంది నిమ్స్ లో అడ్మిట్ అయ్యారు. ఇందులో భాగంగా కిడ్నీల్లో సమస్య ఉన్న 9 మందికి డయాలసిస్ ట్రీట్మెంట్ అందిస్తున్నట్లు వైద్యులు ప్రకటించారు. 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని, మరో 12 మంది నిరంతరం పర్యవేక్షణ లో ఉన్నారని పేర్కొన్నారు. అలాగే గాంధీ హాస్పిటల్లో హెల్త్ అప్డేట్ ప్రకారం.. ప్రస్తుతం 15 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఇందులో 13 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరికి కిడ్నీల్లో సమస్య ఉందని, వారికి డయాలసిస్ (సిఆర్ఆర్‌టి) చేస్తున్నారని వెల్లడించారు. కాగా, కూకట్పల్లిలో కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిన్నటికే 8 మంది మృతి చెందగా గాంధీలో చికిత్స పొందుతున్న చాకలి పెద్ద గంగారాం (70) అర్ధరాత్రి మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 7 కి చేరింది. గాంధీ, నిమ్స్‌తో పాటు ఇఎస్ఐ, ప్రైవేటు ఆస్పత్రిలో మరికొందరు చికిత్స తీసుకుంటున్నారు. మొత్తంగా బాధితుల సంఖ్య 51 కి చేరింది.

**'కల్తీ కల్లు బాధితుల' ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర రాజనర్సింహా ఆరా**

కల్తీ కల్లు తాగి నిమ్స్, గాంధీ హాస్పిటల్స్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి దామోదర రాజనర్సింహ నిమ్స్, గాంధీ డాక్టర్లు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో శుక్రవారం మాట్లాడారు. పేషెంట్ల కండీషన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నిమ్స్‌లో 35 మంది, గాంధీలో 18 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు మంత్రికి వివరించారు. కాగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురిని డిశ్చార్జ్ చేస్తున్నామని, మిగిలిన 30 మందికి చికిత్స కొనసాగిస్తున్నామని వివరించారు. గాంధీలో ఉన్న 18 మందిలో నలుగురు డయాలసిస్‌పై ఉన్నారని, మిగిలిన 14 మంది పేషెంట్ల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నదని వివరించారు. పేషెంట్లందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు, డాక్టర్లకు మంత్రి సూచించారు. పూర్తిగా కోలుకునే వరకూ వారిని హాస్పిటల్స్‌లోనే ఉంచాలని, ఆ తర్వాతే డిశ్చార్జ్ చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

## కల్తీ కల్లు ఘటనపై చర్యలు తీసుకోవాలి
### మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.కోటి ఇవ్వాలి
### సిపిఐ (ఎం) రాష్ట్ర నాయకులు డిజి.నర్సింహ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కల్తీ కల్లు ఘటనపై చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎం) రాష్ట్ర నాయకులు డిజి.నర్సింహారావు డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం) పార్టీ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కమిటి ఆధ్వర్యంలో నాంపల్లిలోని రాష్ట్రా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిజి.నర్సింహ రావు మాట్లాడుతూ కూకట్పల్లిలో కల్తీ కల్లు ప్రమాద ఘటనలో ఇప్పటివరకు 8 మంది చనిపోయినట్టు 42 మంది చికిత్స పొందుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన చాలా తీవ్రమైనది. కల్లు కాంపౌండ్ల యాజమాన్యాలు కొందరు లాభాపేక్షతో రసాయనాలతో కృత్రిమంగా కల్లును తయారుచేసి ప్రజలను ఆర్థికంగానూ, అనారోగ్య పరంగాను తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారు. ఈ ఘటన అందుకు ఒక ఉదాహరణ. పేద ప్రజల మరణాలకు కారణమైన యాజమాన్యాలపై హత్యా నేరం కింద కఠినంగా శిక్షించాలి. ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు కాంపౌండ్లపై తనిఖీలు చేసినట్లయితే ఈ ఘటన జరిగి ఉండేది కాదు. అందుకని సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కల్లు కాంపౌండ్ల పై నిరంతరం తనిఖీలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుచున్నాము. మరణించిన కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేష్, కోట రమేష్, ఎన్పిఆర్డీ రాష్ట్రా అధ్యక్షుడు వెంకట్, సిపిఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర అశోక్, జి.శ్రీనివాసులు, రాజశేఖర్, మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, ఎన్.శ్రీనివాస్, లింగస్వామి, కల్లుగీత కార్మిక సంగం జిల్లా నాయకులు వెంకట నర్సయ్య, మహిళ సంగం నాయకులు మంగ, విజయ, డి వై ఎఫ్ ఐ నగర కార్యదర్శి జావిడ్ సీపీఐ(ఎం) నాయకులు గణేష్, నర్సింగ్ రావు, లక్ష్మీ, వెంకటేష్, శ్రీనివాస్, సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నాలాల ఆక్రమణలు తొలగించిన హైడ్రా
### కూకట్‌పల్లి, చింతలబస్తీలో నాలాల విస్తరణ
### వరద సాఫీగా సాగేందుకు హైడ్రా చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో నాలాల ఆక్రమణలను తొలగించడంపై హైడ్రా దృష్టి పెట్టింది. కూకట్‌పల్లి, ఖైరతాబాద్ పరిసరాల్లోని నాలాల ఆక్రమణలను శుక్రవారం తొలగించింది. నాలాల ఆక్రమణల వల్ల కాలనీలు, బస్తీలు నీట ముంపునకు గురికాకుండా చూడాలని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులతో కలసి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐడిఎల్ నాలాతో పాటు, బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది.

**బుల్కాపూర్ నాలా ఆక్రమణల తొలగింపు..**

తుమ్మలబస్తీ పరిసరాల్లో బుల్కాపూర్ నాలా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా ఐటి ప్రాంతాలను సస్యశ్యామలం చేసి హైదరబాద్‌లో అడుగుపెట్టి చింతలబస్తీ, తుమ్మలబస్తీ మీదుగా ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్‌లో కలుస్తుంది. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురైంది. మరీ ముఖ్యంగా తుమ్మలబస్తీ ఆనందనగర్ మధ్య 8 మీటర్లుండాల్సి ఉండగా, కేవలం 5 మీటర్లకే పరిమితమైంది. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరద సాఫీగా సాగక తుమ్మలబస్తీతో పాటు, అటు ఆనందనగర్ కాలనీల్లోకి మురుగు నీరు పోటెత్తుతున్నట్టు స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. శ్రీధర్ ఫంక్షన్ హాల్ యజమానులు నాలాలో నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. పై భాగంలో కూడా కొంతమేర ఆక్రమణ జరగగా, అక్కడ నివాసితులు తమకు తాము తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారికి కొన్ని రోజులు హైడ్రా గడువు ఇచ్చింది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద కల్వర్టుకు ముందు ధర్మాకోల్ వ్యర్థాలను కూడా హైడ్రా తొలగించింది. దీంతో వరద సాఫీగా సాగేందుకు మార్గం సుగమమైంది.

**ఐడిఎల్ నాలా ఆక్రమణలు కూడా..**

కూకట్‌పల్లిలోని ఐడిఎల్ చెరువు నుంచి మొదలైన నాలా వెడల్పు 7 మీటర్లుండాల్సి ఉండగా, చాలా చోట్ల 2 మీటర్లకే పరిమితమైంది.

దీంతో హబీబ్‌నగర్, శ్రీహరినగర్, శివశక్తి నగర్ నీట మునగడం పరిపాటిగా మారింది. నడుం లోతు నీళ్లుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నాలాకు ఆనుకుని ఆక్రమణలకు పాల్పడిన ఎన్ఆర్‌సి, ఎన్‌కెఎన్ఆర్ ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు 3 మీటర్లకుపైగా జరిపిన ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఈ రెండు ఫంక్షన్ హాళ్ల పొడుగునా 50 నుంచి 70 మీటర్లమేర ఆక్రమణలను తొలగించి, వరద నీరు సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకుంది. ఐడిఎల్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా మూసాపేట మెట్రోస్టేషన్ దాటి కూకట్‌పల్లి నాలాలో కలుస్తుంది. ఇలా 2 కిలోమీటర్ల మేర పలుచోట్ల ఆక్రమణలను హైడ్రా తొలగించే పనులు ప్రారంభించింది. మూసాపేట మెట్రో స్టేషన్‌కు ఆనుకుని ఉన్న శివశక్తి నగర్ దగ్గర నాలా కేవలవం మీటరున్నరకు కుంచించుకుపోవడంతో అక్కడ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టింది.

## రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన జిహెచ్ఎంసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, నగరంలోని రోడ్లపై ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూడటమే లక్ష్యంగా జిహెచ్ఎంసి ఇంటెన్సివ్ మెయింటెనెన్స్ డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ (నిర్వహణ) విభాగం ఆధ్వర్యంలో 7500 ప్రాంతాలలో గుర్తించిన బిటి, సిసి రోడ్లపై గుంతల పుడ్చివేత, క్యాచ్ పిట్స్ మరమ్మతులు, సెంట్రల్ మీడియన్‌లలో మైనర్ రిపేర్లు తదితర పనులను చేపట్టారు. ఈ పనులలో భాగంగా చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ శుక్రవారం ఎర్రమంజిల్ ప్రధాన రహదారిపై జరుగుతున్న మరమ్మత్తు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు నగరంలోని వాహనదారులకు రహదారులపై సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 7500 ప్రాంతాల్లో సమస్యాత్మకంగా గుర్తించిన రోడ్లపై మరమ్మత్తుల పనులు ఒక వారం లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని, ప్రజల భద్రతే ముఖ్యమని చీఫ్ ఇంజనీర్ తెలిపారు.



## టిజిపిసిబిలో ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్ ఫెస్ట్-2025

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడానికి ఆవిష్కర్తలు, పర్యావరణ ఔత్సాహికులు తమ ఆలోచనలు, పద్ధతులను ప్రదర్శించడానికి ఒక వేదిక అయిన ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్ ఫెస్ట్‌ను నిర్వహించింది. వివిధ రంగాల నుండి 22 కంటే ఎక్కువ జట్లు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. ప్లాస్టిక్‌ను దశలవారీగా తొలగించడానికి వారి వినూత్న పరిష్కారాలను ప్రదర్శించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయాలుగా స్వీకరించగల ఉత్తమ అందుబాటులో ఉన్న పరిష్కారాలను ఎంచుకోవడానికి పాల్గొనే బృందాలు బయోడిగ్రేడబుల్ ప్రత్యామ్నాయాలు, పునర్వినియోగ ఉత్పత్తులు, సృజనాత్మక వ్యర్థాల నిర్వహణ పరిష్కారాలతో సహా అనేక రకాల వస్తువులను ప్రదర్శించారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ప్లాస్టిక్ కాలుష్యం ముఖ్యమైన సమస్యను పరిష్కరించడానికి ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి యువత పాల్గొనేలా ప్రేరేపించడానికి, శక్తివంతం చేయడానికి హ్యాకథాన్ ఫెస్ట్ రూపొందించారు. ఈ కార్యక్రమంలో వినూత్న ప్రాజెక్టుల ప్రదర్శనలు జరిగాయి. పాల్గొనేవారు తమ పనిని ప్రదర్శించడానికి, ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పించారు. నదులు వంటి నీటి వనరులలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని వర్గీకరించడం, తగ్గించడం, ద్రవ ప్యాకేజింగ్ కోసం ప్రత్యామ్నాయ పద్ధతులు, నిర్మాణాలు, భవన నిర్మాణాల్లో ఉక్కు స్థానంలో ప్లాస్టిక్‌లను మార్చడం, నీటి వనరుల నుండి మైక్రో ప్లాస్టిక్‌లను అయస్కాంతంగా వేరు చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పునర్వినియోగ ప్లాస్టిక్‌లలో రోబోటిక్స్ ద్వారా ఎఐ పాత్రను గుర్తించడానికి పాల్గొనేవారు ఎఐ పరిష్కారాలను అభివృద్ధి చేశారు. ఎకోకుతుంబ్ పేరుతో బయోడిగ్రేడబుల్ కత్తిపీట, అరటి ఆకు పలకలు మట్టి కుండలు తాజా పువ్వులు, రీసైకిల్ పేపర్లు, ఆకుపచ్చ వివాహ బహుమతులు వంటి స్థిరమైన వివాహ పద్ధతులను ప్లాస్టిక్ అలంకరణలకు బదులుగా ఉపయోగించాలి. ఇది స్వయం సహాయక బృందాలు, చేతివృత్తులవారి ఆదాయాన్ని పెంచడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఇది ఒక ఉద్యమం అని అవినాష్ కళాశాలకు చెందిన దుర్గా తన్మయ్ అన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



ప్రజాపక్షం/షాబాద్ : ముఖ్యమంత్రి పథకం పేదలకు వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం మండలానికి చెందిన 10 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తు సంక్షేమ కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వైజ్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపిటిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిజెకు ఘనంగా స్వాగతం పలికిన అధికారులు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు శుక్రవారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఘనస్వాగతం పలికింది. శంషాబాద్ ఎయిర్ పోర్టులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌తో పాటు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పగిడిగంటం నర్సింహాలకు రాష్ట్ర హైకోర్టు ఆక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, డిజిపి డాక్టర్ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఎజి.సుదర్శన్ రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కేబినేట్ నిర్ణయంపై హర్షం



ప్రజాపక్షం/రంగారెడ్డి: తెలంగాణ స్థానిక సంస్థల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్ నిర్ణయం చేయడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, అబ్దుల్లాపూర్మెట్ మాజీ జెడ్ పిటిసి బింగి దేవదాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక విప్లవానికి నాంది పలికే విధంగా బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్ స్థానిక ఎన్నికల కోసం కేటాయించడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మాజీ జెడ్ పిటిసి బింగి దేవదాస్ గౌడ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను శుక్రవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు లింగోజిగూడ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఎల్‌బి నగర్‌లో ఉన్న సమస్యలను మధుయాష్కీ గౌడ్ ఆదేశాల మేరకు కమిషనర్ కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ మేరకు కమిషనర్ సానుకులంగా స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కారం లభించే విధంగా కృషి చేస్తామని కమిషనర్ తెలిపినట్లు కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. వారి వెంట ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## బిసిల రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి : ధనుంజయనాయుడు



ప్రజాపక్షం/శంషాబాద్; తెలంగాణలో బిసిలకు సువర్ణావకాశాలు సిద్ధమవుతున్నాయని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు.శుక్రవారం శంషాబాద్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కుల గణన, ఎమ్మెల్సీ నియామకాలలో ప్రాధాన్యత వంటి అంశాలు బీసీల ఉద్యమ విజయాలని పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలంటే బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్లు అమలు కాకపోతే బీసీ సంఘాలన్నీ ఐక్యమై ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కేతరాజు నరసింహ అధ్యక్షత వహించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు జే ఆనంద్ గౌడ్, రాములుగౌడ్, పొన్నాడి శ్రీనివాస్, కుంచాల సౌజన్య, మారే బోయిన నరేందర్, సదానంద గౌడ్, పడమటి వెంకటయ్య, డేరంగుల శంకర్, రాపోలు రమేష్, బండారి రేణుక, కొండే బాలరాజు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కెపురం డివిజన్‌లోని వాసవికాలనీలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో శాకంబరీ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయం చారిత్రాత్మకం



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లకు ఆమోదం క్యాబినెట్ నిర్ణయం చారిత్రాత్మకం అని మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం చేసిన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన గారి లక్ష్మారెడ్డి పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిసిలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాపక్షం/ఫరూక్‌నగర్: వచ్చేది బిసిల రాజ్యమేనని..ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిసిసేన షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప అన్నారు. శుక్రవారం బిసిసేన ఆధ్వర్యంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. బాణా సంచాలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించి జై బిసీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం దక్కాల్సిన హక్కులు బిసిలు 42శాతం రిజర్వేషన్లతో దక్కాయని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, జంగ నర్సింహ్మా, నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, శ్రీశైలం, లింగారెడ్డిగూడ అశోక్, విశ్వం, బస్వం, దంగు శ్రీనివాస్ యాదవ్, రాములు, బిసిసేన నేతలు పాల్గొన్నారు.

# రేపే సికింద్రాబాద్ బోనాలు..ట్రాఫిక్ ఆంక్షలు

### రెండు రోజులు మద్యం అమ్మకాలు బంద్



ప్రజాపక్షం/హైదరాబాద్ :సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఆదివారం జరగనుంది. ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పోలీసులు, జిహెచ్ఎంసి, దేవాదాయశాఖ అధికారులు పూర్తిచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా అన్ని చర్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే ఆది, సోమవారాల్లో సికింద్రాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో మద్యం అమ్మకాలపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ నిషేధం విధించారు. ఈ రెండు రోజులు బార్లు, వైన్‌షాప్‌లు, కల్లు దుకాణాలు మూసి ఉంటాయి. ఎవరైనా అక్రమంగా మద్యం సరఫరా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఆలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇందులో కర్బలా మైదాన్, రాణిగంజ్, రామ్గోపాల్పేట్, ప్యారడైజ్, సీటీవో ప్లాజా, ఎస్బీఐ క్రాస్ రోడ్ వైఎంసీఏ, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్, పట్నీ, బాటా, ఘస్మండి, బైబిల్ హౌస్, మినిస్టర్ రోడ రసూల్పుర ప్రాంతాల్లో ఈ ఆంక్షలు ఉండనున్నాయి.

✻ టొబాకో బజార్, హిల్ స్ట్రీట్, బాటా క్రాస్ రోడ్స్ నుంచి పాత రామ్గోపాల్పేట్ పోలీస్ స్టేషన్ వరకు సుభాష్ రోడ ఆదాయ క్రాస్ రోడ్స్, జనరల్ బజార్ నుంచి ఆలయానికి వెళ్ళే రోడ్లు మూసివేయబడతాయి.

✻ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్కు వెళ్ళే వాహనాలు రాణిగంజ్ క్రాస్ రోడ్స్ వద్ద డైవర్ట్ చేయబడి, మినిస్టర్ రోడ రసూల్పుర, పిఎన్‌టి ఫ్లైఓవర్,హెచ్‌పిఎస్ యూ టర్న్, సిటిఓ, ఎస్‌బిఐ,వైఎంసిఏ, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్, గోపాలపురం లేన్ మీదుగా వెళతాయి.

✻ ఘస్మండి క్రాస్ రోడ్స్ వద్ద బైబిల్ హౌస్ నుంచి వచ్చే ట్రాఫిక్ సజ్జన్లాల్ స్ట్రీట్, హిల్ స్ట్రీట్కు, పట్నీ క్రాస్ రోడ్స్ వద్ద ఎస్‌బిహెచ్, క్లాక్ టవర్, ప్యారడైజ్కు, ప్యారడైజ్ నుంచి ఆర్‌పి రోడ్కు వెళ్ళే ట్రాఫిక్ ఎస్‌బిహెచ్, క్లాక్ టవర్కు, సిటిఓ నుంచి ఎంజి రోడ్కు వెళ్ళే ట్రాఫిక్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, సింధీ కాలనీ, మినిస్టర్ రోడ రాణిగంజ్, కర్బలా మైదాన్కు డైవర్ట్ చేయబడుతుంది.

✻ పార్కింగ్ కోసం సెయింట్ జాన్స్ రోటరీ, స్వీకార్ ఉపకార్, ఎస్‌బిహెచ్ సైడ్లో హరిహర కళా భవన్, మహబూబియా కాలేజీ, కర్బలా మైదాన్, బైబిల్ హౌస్, ఘస్మండి వద్ద ఇస్లామియా హై స్కూల్, రాణిగంజ్, ఆదాయ క్రాస్ రోడ్స్ వద్ద గవర్నమెంట్ ఆదాయ మెమోరియల్ హై స్కూల్, సుభాష్ రోడ్ ద్ద ఓల్డ్ జైల్ఖానా, మంజు థియేటర్ సైడ్లో అంజలి థియేటర్ లేన్, రసూల్పుర నుంచి వచ్చే వాహనాలు మహాత్మా గాంధీ విగ్రహం, ఎంజి రోడ్డు వద్ద పార్క్ చేయాలి.

✻ అలాగే జాతర జరిగే జూలై 13 ఉదయం 6 గంటల నుంచి జూలై 15 ఉదయం 6 గంటల వరకు గాంధీనగర్, చిలకలగూడ, లాలగూడ, వారాసిగూడ, బేగంపేట్, గోపాలపురం, తుకారంగేట్, మారేడ్పల్లి, మహంకాళి, రామ్గోపాల్పేట్, మార్కెట్ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బార్లు మూసివేయబడతాయి. వాహనదారులు, భక్తులు ట్రాఫిక్ సూచనలు పాటించాలని పోలీసులు కోరారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్ 9010203626ని సంప్రదించాలి, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

### సమాజ మార్పులో..

## విద్యార్థులు భాగస్వాములు కావాలి



### రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ళ శారద

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : సమాజ మార్పులో భాగస్వాములు కావాలని రాష్ట్ర మహిళా కమషన్ చైర్‌పర్సన్ నేరళ్ళ శారద విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గిరిజన బాలికల కళాశాల వసతిగృహాన్ని కెన్‌ఫిటెక్ సంకల్ప కంపెనీ యాజమాన్యం కోటి పది లక్షల రుపాయలతో అభివృద్ధి చేసే పనులకు ఆమె ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పా టు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ మారుతున్న సమాజం లో విదేశీ పోకడలకు, సోషల్ మీడియాకు ఆసక్తులై తమ జీవితాలను వృధా చేసుకోవద్దని సూచించారు. విద్యలో నైపు ణ్యం సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేయలన్నారు. విద్యను అభ్యసించే సమయంలో పలువురు గ్రామీణా ప్రాంత విద్యార్థులు పట్నం వాతావరణం నచ్చక మానసికంగా కృంగిపోతున్నారని తెలిపారు. గిరిజన వసతి గృహంలో కళాశాల విద్యార్థులకు మౌలి క సదుపాయాలు కల్పించి ఏలాంటి ఇబ్బందులు జరుగ కుం డా వార్డెన్ తగు జాగ్రతలు చేపట్టాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం వసతి గృహన్ని అభివృద్ధి చేయడానికి దత్తత తీసుకోవటం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కెన్‌ఫిటెక్ కంపెనీ యాజమాన్యం వసతిగృహాన్ని భవిషత్ తరాలకు గుర్తుండేలా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యను నిర్లక్ష్యం చేయకుండా ఉత్తమ ఫలితాల సాధనకు నిర్విరామంగా శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, బి.మహీపాల్, వైస్‌చైర్మన్ కరుణాకర్, జిల్లా అధికారులు పద్మజరాణీ, రామేశ్వరిదేవి, శ్రీలత, సూసింధర్‌రావు, వెంకటేశ్వర్లు, రామారావు, నవీన్‌రెడ్డి, డాక్టర్ పున్నామ్, పాల్గొన్నారు.

## సిపిఐతోనే నిరుపేదలకు న్యాయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/షాబాద్ : సిపిఐతోనే నిరు పేదలకు న్యాయం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని సిపిఐ మక్దూంభవన్ కార్యాలయంలో సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహాయసహకారాలతో నాగర్‌కుంట గ్రామానికి చెందిన పాలమాకుల ఆనందంకు మంజూరయిన రూ.1,48000 సిఎం రీలీఫ్ ఫండ్ చెక్కును సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో దళితులకు, నిరు పేదలకు అండగా సిపిఐ పని చేస్తుందన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు పేదలకు అందేవిధంగా అధికారులు పని చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో చాల మంది నిరు పేదలకు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగా రెడ్డి జిల్లా చాల మంది పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు ఇంటి స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జిల్లా అధికారులు స్పందించి పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, చేవెళ్ల ఇంచార్జ్ రామస్వామి, మండల పార్టీ కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## జనాభా నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కండి

### షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ



ప్రజాపక్షం/షాద్‌నగర్: జనాభా నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు అయ్యేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ కోరారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించడంతోపాటు ముఖ్యకూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబం ఆరోగ్యంగా జీవించు ఆదాయం పెంచేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, ఎంపిహెచ్ఈఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్ వైజర్లు అమృత, శ్రీరామ, పిహెచ్ఎన్ పుష్పలీల పాల్గొన్నారు.

## కామారెడ్డి డిక్లరేషన్ అమలు ఘనత సిఎం రేవంత్‌రెడ్డిదే

### తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: కామారెడ్డి డిక్లరేషన్‌లు ప్రణాళిక బద్దంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలకే దక్కుతుందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన నేపథ్యంలో శుక్రవారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ముఖ్యకూడలిలో బాణా సంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని గత 40ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారని, వారి పోరాటాల ఫలితం, తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో కామారెడ్డి బహిరంగ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించిన బిసిలకు 42శాతం డిక్లరేషన్‌ను ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేసిందని వివరించారు. రాష్ట్రంలో 56.33శాతం బిసిలు ఉన్నారని, 285వ ఆర్డినేన్స్ ద్వార బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని, కుల గణనలో పాల్గొని రాజకీయ పార్టీలు నేడు బిసిల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లు అమలు విషయంపై గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ అమోదం తెలిపిన నేపధ్యంలో రాహుల్‌గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బిసిసంఘాల నాయకులు చంద్రశేఖర్, కత్తి చంద్రశేఖర్ అప్ప, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, జలజ, స్రవంతి, గడ్డమీది రమేష్, సరస్వతి, అనురాధ, అరుణ, తంగిడిపల్లి శంకర్, సిందూర, మేకల వెంకటేష్, చంద్రశేఖర్, నర్సింలు, సౌజన్య, మమత, వసంత, హాజీపల్లి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ గ్రామాల్లోనూ పంచాయతీ ఎన్నికలు

### కార్పొరేషన్‌కు సంబంధం ఉండదు


### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

### ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలని అదేశం



ప్రజాపక్షం/యాచారం : ఫార్మాసిటీ గ్రామాల్లో పాత పద్ధతిలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుతాయని, కార్పోరేషన్ కు ఏ మాత్రం సంబందం ఉండదని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం యాచారం తహసీల్దారు కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌సిడి అభివృద్ధిలో భాగంగా ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో అనే అనుమానాలను జిల్లా కలెక్టర్‌ని నివృత్తి చేశారు. ఈ విషయంలో ఎవరికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదని తెల్చి చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్లు కేటాయించిన వారందరు కట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారు నిర్మాణ చేసుకునే విధంగా చూడాల్సిన భాధ్యత మనపై ఉందని అన్నారు. ఇండ్ల విషయంలో ఎలాంటి కొర్రీలు పెట్టవద్దని సూచించారు. ఎదైనా సమస్యలుంటే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. మహిళ సంఘాల నుండి ఇందిరమ్మ ఇండ్లకు లక్షరూపాయల రుణం ఇప్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టకుండా బిల్లులు తీసుకొవాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన చెక్కులు సకాలంలో పాస్ కావడం లేదు, సానిటేషన్ . జీతాలకు ఇబ్బంది ఎదురౌతుందని పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ దృష్టికి తేగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వన మహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అదికారులకు కోరారు. మొక్కలు నాటడానికి కట్టెలు తెవడానికి ఇబ్బంది అవుతుందని కలెక్టర్‌కు వివరించారు. మండలంలో ఎవి పనులు జరుగుతున్నాయి. ప్రోగేస్ ఎంత వరకు వచ్చిందని పంచాయతీరాజ్ ఎఇ సూర్యవంశిని అడిగి తెలుసుకున్నారు. మండంలో జరుగుతున్న పనుల గురించి కలెక్టరకు వివరించారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులందరికీ పారదర్శంగా ప్లాట్ల పంపిణీ జరుతుందని అన్నారు. అందరికీ న్యాయం చేయడానికి తమ వంతుగా ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఆర్‌డిఒ అనంతరెడ్డి, తహసీల్దారు అయ్యప్ప, ఎంపిఒ శ్రీలత, ఉపాధి ఎపిఒ లింగయ్య, హౌజింగ్ ఎఇ రేష్మా, పంచాయతి కార్యదర్శులు శ్రీనివాస్, తరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పదవి వచ్చినా.. రాకున్నా.. ప్రజా సేవకు అంకితం : మల్‌రెడ్డి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : మంత్రి పదవి వచ్చినా.. రాకున్నా.. ప్రజా సేవకు అంకితమవుతానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో ఆదిభట్ల గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 44లో 18ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. గత రాష్ట్ర రెవిన్యూ శాఖ ఉన్నతాధికారి నవిన్ మిట్టల్, జిల్లా కల్లెక్టర్లు అమోయ్‌కుమార్, హరిష్ హయాంలో రికార్డులన్ని తారుమారు చేసి ప్రభుత్వ భూములన్ని అన్యాక్రాంతమయాయని త్వరలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై విచారణ జరిపి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం తహసీల్థార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ నిరుపేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న డిప్యూటీ తహసీల్థార్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్థార్‌ను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఫార్మా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం కాలూష్య రహిత పరిశ్రమలు స్థాపించి, ఫోర్త్ సిటీ ఏర్పాటుతో ఇబ్రహీంపట్నం నియోజక వర్గానికి మహార్ధశ కలుగనుందని ధీమా వ్యక్తం చేశారు. మంచాల మండలం లింగంపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో డబుల్ బెడ్ రూమ్‌లకు విధ్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించి అర్హులకు డబుల్ బెడ్ రూమ్‌లను పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు సహకరిస్తే నియోజక వర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానన్నారు. సమావేశంలో గురునాథ్ రెడ్డి,శేఖర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి

ప్రజాపక్షం/కాప్రా: మల్లాపూర్ డివిజన్‌లోని నెహ్రూనగర్ కాలనీలో రూ.5.50 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణు గోపాల్, స్థానిక నేతలు బోదాసు లక్ష్మి నారాయణ, నాగారం బాబు , బోనదసు నరేష్, మల్లేష్ గౌడ్,రమణ, శ్రీనివాస్, లింగం, అంజి, రాజేష్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని డివిజన్లు అభివృద్ధి హామీ : ఎమ్మెల్యే మర్రి

ప్రజాపక్షం/మల్కాజిగిరి : నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రాధాన్యతాపరంగా అభివృద్ధి పరుస్తానని, ఎలాంటి ప్రజా సమస్యలైనా తన దృష్టికి తీసుకొని రావాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ లోని పలు అభివృద్ధి పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో కల్సి శుక్రవారం ప్రారంభించారు. రాఘవ్ కళ్యాణ్ ఎస్టేట్స్ వద్ద రూ.97 లక్షల వ్యయంతో చేపట్టిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రూ.6 లక్షల వ్యయంతో భరణి కాలనీలో గ్రేవ్ యార్డు కాంపౌండ్ వాల్ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఇ సృజన, పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.





## నవజాత శిశువు మృతికి కారకులైన వైద్యులను సస్పెండ్ చేయాలి

### ఎఐవైఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/కాప్రా: నవజాత శిశువు మృతికి కారకులైన వైద్యులు, నర్సులను సస్పెండ్ చేయాలంటూ సిపిఐ,ఎఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు లు డిమాండ్ చేసాయి. గురువారం ప్రసవం కోసం మల్లాపూర్ బాబానగర్ ప్రాంతానికి చెందిన గుడిసె కవితకు సూర్యానగర్ అర్బన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్యూటీలో ఉన్న వైద్యుడు నిర్లక్ష్యంగా బాధ్యతలను అక్కడి స్టాఫ్ నర్సుకు అప్పచెప్పటంతో సరైన వైద్యం లేక ప్రసవం అయిన నవజాత శిశువు మృతి చెందిందని, దీనికి నిరసనగా శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర,సిపిఐ ఉప్పల్ మండల కార్య దర్శి టి.సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో ధర్నా చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులు, పిహెచ్ సెంటర్లలో తరచు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకొంటున్నాయని, ఉన్నతాధికారుల నియంత్రణ కొరవడిందని, ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అక్కడికి వచ్చిన డిప్యూటి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సత్యవతికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, అజీమ్ పాషా,మేరీ,స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.




## జనాభా పెరుగుదల బాధ్యతను సూచిస్తుంది : డిఎంహెచ్ఓ

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: జనాభా పెరుగుదల కేవలం గణాంకాలు మాత్రమే కాదని, మన భవిష్యత్తు పట్ల ఉండాల్సిన బాధ్యతను సూచిస్తుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవం2025 సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ మన సమాజ భద్రతకు, మాతా శిశు ఆరోగ్యం, మన భవిష్యత్ తరాల ఆరోగ్యానికి, గర్భ నిరోధక సాధనాల వినియోగం వ్యక్తిగత నిర్ణయాధికారానికి ప్రతిరూపంగా నిలుస్తాయన్నారు. పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, నీరు. ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభావం చూపుతోందని, దీని వల్ల నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రతి ఒక్కరికి సమర్థమైన ఆరోగ్య విద్య, ప్రణాళికాబద్ధమైన కుటుంబ జీవితం మీద అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖలో విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓలు శోభ,సత్యవతి,జిల్లా ప్రోగ్రాం అధికారులు మల్లేశ్వరి, గీత, కౌశిక్, సూపర్‌వైజర్లు విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాపక్షం/నాగారం: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోధుమకుంట వార్డు ఆఫీసులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఇసిఐఎల్ జీనియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. 100 మంది మున్సిపల్ కార్మికులు కంటి, దంత పరీక్షలు, ఇసిజి, షుగర్, బ్లడ్ ప్రెజర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. స్థానికులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో కీలకంగా నిలిచింది. కార్మికులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ధర్మారెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బాబు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాపక్షం/చర్లపల్లి: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాల్ రాజ్ తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సాయి నగర్ ఫీడర్ ను 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపివేయడంతో ఎంఆర్ఆర్ కాలనీ, సాయి నగర్, నాగార్జున నగర్ కాలనీ 1,2,3,4,5,6 సాయి రామ్ బేకరీ, చక్రీపురం ప్రధాన రహదారిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఇఇ బాల్‌రాజ్ కోరారు.



## డిసిఎంఎస్ వైస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ప్రజాపక్షం/శామీర్‌పేట:శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మేడ్చల్ ఎంఎల్‌ఏ చామకూర మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం శామీర్ పేట సోసైటిలో మూడుచింతలపల్లి మాజి సర్పంచ్ జాం రవి, నాగిశెట్టిపల్లి సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, పలువురు బిఆర్ఎస్ నాయకులు మధుకర్‌రెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్‌యాదవ్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళిగౌడ్, నర్సింలు, శ్రీశైలం, యాదగిరి, వెంకట్‌రెడ్డి, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బస్తీలను అభివృద్ధి చేయని గత ప్రభుత్వం

### జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : గత ప్రభుత్వం హైదరాబాద్‌లో బస్తీలను అభివృద్ధి చేయలేదని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ. 5.15 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర్ రావులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో రూ. 5 కోట్లకుపైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంను అన్ని రంగాల్లో ముందుంచుతామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. గత 10 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహించిన వారిలో వారికి సన్నిహిత ఉన్నవారి నియోజకవర్గాలు మాత్రమే అభివృద్ధి జరిగాయని, వివక్షపూర్తితంగా వ్యవహరించారని విమర్శించారు. హైదరాబాద్‌లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా పరిష్కారం చేస్తున్నామన్నారు. నగరంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నగర ప్రజలు ఎక్కడైనా ప్రజా సమస్యలు ఉంటే స్థానిక అధికారి, ప్రజా ప్రతినిధుల దృష్టికి లేదంటే మంత్రుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పాటు మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం, తమ ప్రభుత్వం ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని, తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి అండగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను కోరారు. మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావులు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాము ఎక్కడికి వెళ్లిన ప్రజలు నాలాలు, సిసి రోడ్లు, తాగునీటి సమస్యలను తీర్చమని ప్రజలు కోరుతున్నారన్నారు. ప్రజా సమస్యలన్నింటిని తీరుస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ అజారుద్దీన్, గుర్రం మురళీ గౌడ్ పాల్గొన్నారు.



## విద్యార్థిని ఢీకొట్టిన అక్షర స్కూల్ బస్సు

### నుజ్జు నుజ్జయిన విద్యార్థి చెయ్యి

ప్రజాపక్షం/చర్లపల్లి: స్కూలు బస్సు ఢీకొని విద్యార్థి చెయ్యి నుజ్జు నుజ్జైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ సుభాష్‌చంద్ర నగర్‌కు చెందిన విద్యార్థి చైతన్య గోపిశెట్టి(13)ఉదయం 8 గంటలకు సైకిల్‌పై అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌కు వెళుతుండగా అదే స్కూల్‌కు చెందిన బస్సు టిస్ 08 యుఎఫ్ 1780 ఢీకొట్టడంతో చెయ్యి నుజ్జునుజ్జయింది. విద్యార్థి సైకిల్‌ను బస్సు కొద్ది దూర లాకెళ్లింది. దీంతో విద్యార్థిని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆక్సిడెంట్‌కు కారణమై డ్రైవర్ నర్సింహను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.



## విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

### కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం / కొడంగల్ : ప్రతి విద్యార్థి శ్రద్ధ, నిబద్ధత క్రమ శిక్షణతో కూడిన విద్యాను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రాలలో నూతనంగా ప్రారంబమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులను, కళాశాల నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతు ఈ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం జూనియర్ కళాశాలలను స్థాపించడం జరిగిందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించి ఉన్నత చదువులు చదివే దిశగా అడుగులు వేయాలని సూచించారు. తమ భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దే దిశగా తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ హామి ఇచ్చారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఎంసెట్, నీట్, ఐఐటి పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు వీలుగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అధ్యపకుల విద్య భోదనను పరిశీలించి విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం పోలేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లీని దర్శించుకుని ప్రత్యేక పూజల చేశారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులను షాలువలతో సత్కరించి అభినందించారు. దేవాలయం అభివృద్ధిలో బాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. నాణ్యతను పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వీరితోపాటు ఆలయ కమిటి చైర్మెన్ జయరాం, ఇఒ రాజేందర్‌రెడ్డి, ఎంపిడిఒ వెంకన్నగౌడ్, నర్సింహా, సింగర్ నర్సింహా, లతో పాటు పార్టీ నాయకులు తదితరులున్నారు.





## ఎంపి ఈటలను సన్మానించిన పుట్టం పురుషోత్తం

ప్రజాపక్షం/శామీర్‌పేట : మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను మున్నురుకాపు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం శాలువాతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాష్ట్ర మున్నూరుకాపుల సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన పుట్టం పురుషోత్తం ఎంపి ఈటలను శామీర్‌పేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంను ఎంపి ఈటల రాజేందర్ ఘనంగా సన్మానించారు. అనంతరం మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్ ఎంపితో మాట్లాడుతూ కీసరగుట్టలో మున్నూరుకాపు సంఘం నిత్యాన్నదాన సత్రానికి వేయి గజాల స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు ఎంపి సుముఖం వ్యక్తం చేశారని శ్రీనివాస్‌పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మూడుచింతలపల్లి మండల మహిళా అధ్యక్షురాలు సింగం విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన తిరుపతిరెడ్డి

### రూ.44 కోట్లతో కొడంగల్ పెద్ద చెరువు సుందరీకరణకు శంకుస్థాపన



ప్రజాపక్షం / కొడంగల్ : ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలనే దృడసంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇండ్లు నిర్మించాలని సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని హట్టహసంగా ప్రారంబించారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు కానున్న నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను ఏ విధంగా నిర్మించాలో సంబందిత కాంట్రాక్టర్ అంజిల్‌రెడ్డికి పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈ మేరకు 44 కోట్ల నిధులతో కొడంగల్ పెద్ద చెరువు కట్ట మరమత్తు పనులకు గాను భూమి పూజ చేశారు. పాత కొడంగల్‌లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఎడ్యూకేషన్ హబ్ ఏర్పాటు కావడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చెరువు కట్ట సుదరీకరణ చేయడం జరుగుతుందన్నారు. పాత కొడంగల్ నుంచి గౌరారం రోడ్డు వరకు దాదాపు 2 కిలో మీటర్ల మేర బీటి వైడ్ రోడ్డు , చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్ట్, స్విమింగ్ పుల్స్, వాకింగ్ ఏరియా , టైయిలెట్స్ వంటి అనేక రకాల సౌకర్యాలు చెరువు కట్టపై నిర్మించేందుకు దాదాపు 44 కోట్ల నిధులతో పనులను ప్రారంబించడం జరిగిందని తెలిపారు.




అతి త్వరలోనే కొడంగల్ రూపు రేఖాలు మారనున్నాయని కొడంగల్ ప్రజల చిరకాల కోరికలను మన రేవంత్‌రెడ్డి తీర్చబోతున్నాడని అన్నారు. అనంతరం కడ ప్రత్యేక కార్యాలయంలో అర్హులైన లబ్దిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను బోంరాస్‌పేట మండలానికి 23,30,000. దౌల్తాబాద్ మండలానికి 22,26, 000. దుద్యాల 18,49,000. గుండుమాల్ 9,64000. కొడంగల్ 26,12,000. కోస్గి 2,24,9000. కొత్తపల్లి 11,13,500. మద్దూర్ 24,84,500 రూపాయల చెక్కులను దాదపు 293 మంది లబ్దిదారులకు అందజేశారు. అదేవిధంగా నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల్ , బోంరాస్ పేట మండలాల్లోని దాదాపు 112 ప్రాథమిక పాఠశాలలకు ఏఐ బోధనలో బాగంగా 265 కంప్యూటర్‌లను అందజేశారు.

కార్యక్రమంలో కడ ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ శేరి రాజేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పార్టీ మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మెన్ ఉషారాణి, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకులు కృష్ణంరాజు, నాయకులు శ్రీరాంరెడ్డి, దేశ్యానాయక్, నయ్యూం, దాము, కృష్ణంరాజు, పర్సాపూర్ మాజీ సర్పంచ్ కన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూముల పరిరక్షణపై ప్రభుత్వ చర్యలు శుభపరిణామం

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : గాజులరామారం లోని సర్వే నంబర్ 307, 308 లలో ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని గత కొద్దీ సంవత్సరాలుగా సిపిఐ చేస్తున్న పోరాట ఫలితంగా నేడు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ అధికారులు ఆ స్థలం పరిరక్షణ కొరకు బడ్జెట్ కేటాయించడం శుభపరిణామమని ఇప్పటికైన స్థానిక అధికారులు పేద ప్రజలు కబ్జాదారుల చేతిలో మోసపోకుండా చర్యలు చేపట్టాలని పత్రిక ప్రకటనలో పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ చర్యను స్వాగతించడం జరిగింది.



## ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే

ప్రజాపక్షం/దుండిగల్: కొంపల్లి ఎస్ఎన్ఆర్ గార్డెన్‌లో జరిగిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే, కూన శ్రీశైలం గౌడ్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ బస్వరాజ్ సారయ్య, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్ణయాలు, బలోపేత అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నియోజవర్గల ఇంచార్జ్‌లు, అబ్జర్వర్స్ పారిజాత నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట సొసైటీని ఆదర్శంగా తీసుకుంటాం

### నాబార్డ్ జిఎంలు రాజమోహన్, అజయ్‌కుమార్‌గుప్త

ప్రజాపక్షం/శామీర్‌పేట : రైతులకు ఉత్తమ సేవలందిస్తున్న శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘాన్ని ఆదర్శంగా తీసుకుంటామని, శామీర్‌పేట సోసైటీల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను అన్ని సోసైటీల్లో అమలుపరిచే విధంగా కృషి చేస్తామని నాబార్డ్ జిఎంలు రాజమోహన్, అజయ్‌కుమార్ గుప్తలు అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని వ్యవసాయ సహకార సంఘాన్ని నాబార్డ్ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో సోసైటీ చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు అందిస్తున్నామని చెప్పా రు. రైతులకు వ్యవసాయంలో మెళకువలను నేర్పిస్తు అధిక దిగుబడులు పొందే విధంగా కృషి జరుగుతుందని పేర్కొన్నారు. ఫార్మ్‌రైస్ వన్ ద్వారా రైతులు పండించిన కూరగాయలు, పండ్లకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. నాబార్డ్ బృందం ఇట్టి విషయాలపై పూర్తిస్థాయిలో క్షేత్ర పరిశీలను చేశార ని వివరించారు. భవిష్యత్తులో శామీర్‌పేట సోసైటీ లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను అన్ని సోసైటీల్లో చేసే విధంగా కృషి చేస్తామని నాబార్డ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ మేనేజర్ బెంజమాన్, టెస్కాబ్ అధికారులు, డిసిసిబి, ఫార్మ్ రైస్ వన్ ప్రతినిధులు, సంఘం వైస్ చైర్మన్ ఐలయ్య, సంఘం డైరక్టర్ లు పాల్గొన్నారు.



# దోబూచులాడుతున్న వరుణుడు..కురవని భారీ వర్షం

* ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం
* 5.63లక్షల ఎకరాలలో పంట సాగు, వరిపైనే అందరి ఆశలు

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:వికారాబాద్ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. కర్షకులకు కష్టాలు మొదలయ్యాయి. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత ఒకవైపు ..సరైన వర్షాలు కురవక పోవడం మరోవైపు రైతులను అందోళనకు గురిచేస్తోంది. నెల రోజులుగా చెప్పుకోదగ్గ వానలు కువరవకపోవడంతో పంటలకు సాగు సమస్యగా మారింది. నిత్యం ఆకాశం మేఘావృతం కావడం, సాయంత్రానికి తేలిపోవడంతో రైతన్నలు నిరాశ చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 90శాతం సాగు పూర్తి అయింది. ఈసారి మాత్రం వానాకాలం ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా వరుణుడు కరుణించడం లేదు.. సాగు నెమ్మదిగానే సాగుతుంది. మే నెలలో దంచికొట్టిన వానలు జూన్, జులైలో ముఖం చాటేశాయి. తేలికపాటి వర్షాలకు కొంతమంది రైతులు ఆరుతడి పంటలు సాగు చేశారు. వీటికి అడపాదడపా ఒక మోస్తరు వానలు కురుస్తున్నా ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం కురవలేదు. వికారాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 3,14,922 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో కంది సాధారణ సాగు 1,47,366, ప్రస్తుతం 82,216ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మొక్కజొన్న సాధారణసాగు 42,166ఎకరాలు కాగా ప్రస్తుతం16,775 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. పత్తి సాధారణంగా 2,44,390 ఎకరాలకు ప్రస్తుతం 2,02, 910 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి, మోమిన్‌పేట్, వికారాబాద్, బంట్వారం, కుల్కచర్ల, తాండూర్, బషీరాబాద్, కొండగల్ మండలాల్లో నేటికి వర్షాభావ పరిస్థితులే కనిపిస్తున్నాయి. జులై 1నుంచి 3వ తేదీవరకు కురిసిన వర్షాల తో 40మి.మీ లవర్షపాతం నమోదైంది. వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం ఇది సాధారణం కన్న తక్కువే అని తెలుస్తుంది.

ఇప్పటివరకు సగంమంది పత్తి, కంది, మొక్కజొన్న, వరిసాగు చేశారు. మిగిలిన వారు వర్షాలకోసం ఎదురుచుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు వరి సాగుపైనే ఆశలు పెంచుకున్నారు. సాగు సగమే అయినా వరితో పూర్తి అవుతుందని వ్యవసాయశాఖ భవిస్తోంది. నారుమళ్లు పోసుకున్న రైతులు నిత్యం నింగికేసి చూస్తున్నారు. చెరువులు, కుంటల్లోకి నీరు చేరితేనే వరి సాగు సవ్యంగా సాగునుంది. ఎటు చూసినా జలవనరులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. మరో వారం రోజులు వర్షాభావ పరిస్థితులు సంభవిస్తే రైతులు పొలాల్లో వేసుకున్న పంటలు పూర్తిగా ఎండిపోతాయని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.



## ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవికి సన్మానం

ప్రజాపక్షం/శామీర్‌పేట : ఉమ్మడి శామీర్‌పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడు క్యాతం రవిని మూడుచింతలపల్లి మాజి సర్పంచ్ జాం రవి శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం శామీర్‌పేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఇటీవల నూతనంగా ఏర్పాటైన ప్రెస్‌క్లబ్ పాలక కార్య వర్గానికి జాం రవి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదిగా ఉంటు ప్రజల సమస్యలను పరిష్కరించే విదంగా వార్తలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగిశెట్టిపల్లి మాజి సర్పంచ్ కృపాకర్ రెడ్డి, మాజి కోఆప్షన్ సభ్యుడు నర్సింలు, మాజి ఉపసర్పంచ్ మురళిగౌడ్, యాదగిరి, శ్రీశైలం, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్‌యాదవ్, కార్యవర్గ సభ్యుడు చిన్నా, సలహాదారుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# హడలెత్తించిన బుమ్రా



## 387 పరుగులకే తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ ఆలౌట్



**లా**ర్డ్స్ టెస్టులో భారత పేసర్ల విజృంభణతో ఇంగ్లాండ్ రెండో సెషన్‌లోనే ఆలౌటయ్యింది. జస్ప్రీత్ బుమ్రా(574) ఇంగ్లాండ్ బ్యాటింగ్ యూనిట్‌ను కకావికలం చేశాడు. తొలి సెషన్‌లో మూడు వికెట్లతో ఆతిథ్య జట్టును దెబ్బతీసిన స్పీడ్‌స్టర్.. లంచ్ తర్వాత ఆర్చర్‌ను బౌల్డ్ చేసి ఐదో వికెట్ సాధించాడు. ఒకదశలో 271కే ఏడు వికెట్లు పడినా.. బ్రాండన్ కార్సే(56), వికెట్ కీపర్ జేమీ స్మిత్(51)ల అసమాన పోరాటంతో స్టోక్స్ సేన కోలుకుంది. వీళ్లిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యంతో భారీ స్కోర్ అందించారు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచిన కార్సే.. సిరాజ్ సంధించిన స్లో బాల్‌కు బౌల్డ్ కావడంతో 387 పరుగులకే ఇంగ్లాండ్ కుప్పకూలింది. బర్మింగ్‌హమ్‌లో సూపర్ విక్టరీతో సిరీస్ సమం చేసిన భారత జట్టు లార్డ్స్‌లోనూ పట్టుబిగించే దిశగా సాగుతోంది. రెండో రోజు తొలి సెషన్‌లో నిప్పులు చెరిగిన బుమ్రా (574) ఇంగ్లండ మిడిలార్డర్‌ను చకచకా చుట్టేశాడు. సిరాజ్ (285) కూడా ఓ చేయి వేయడంతో రెండో సెషన్‌లోనే ఆతిథ్య జట్టు ఆలౌటయ్యింది. రెండో కొత్త బంతితో చెలరేగిన అతడు బెన్ స్టోక్స్(44), జో రూట్(114) లను బౌల్డ్ చేసి ఆతిథ్య జట్టు నడ్డివిరిచాడు. అయితే.. రెండో టెస్టులో మాదిరిగానే టెయిలెండర్లు ఈసారి ప్రతిఘటించారు. ఏడు వికెట్ల పడి ఆలౌట్ అంచున నిలిచిన ఇంగ్లండ్‌ను వికెట్ కీపర్ జేమీ స్మిత్ (51) మరో సారి ఆదుకున్నాడు. 5 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కేఎల్ రాహుల్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన స్మిత్.. అర్ధ శతకంతో ఆదుకున్నాడు. పేసర్ బ్రాండన్ కార్సే(56)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు విలువైన 84 రన్స్ రాబట్టాడు. లంచ్ తర్వాతి ఓవర్లో స్మిత్‌ను ఔట్ చేసిన సిరాజ్ వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాత ఆర్చర్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా ఐదో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. లార్డ్స్ మైదానలో అతడు ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం ఇదే మొదటిసారి. ఓ వైపు వికెట్లు పడుతున్నా ధాటిగా ఆడి హాఫ్ సెంచరీ బాదిన కార్సేను సిరాజ్ బౌల్డ్ చేయడంతో 387 వద్ద ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

## నాకో సమస్య ఉంది..

### బయటపడే మార్గాలను అన్వేషిస్తున్నా: నీరజ్ చోప్రా



**భా**రత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన చోప్రా.. స్వదేశంలో తన పేరుతో నిర్వహించిన ఎన్‌సీ క్లాసిక్ తొలి సీజన్‌లో విజేతగా అవతరించాడు. ప్రస్తుతం యూరప్‌లో శిక్షణకు సిద్ధమవుతున్న వరల్డ్ బెస్ట్ జావెలిన్ త్రోయర్ తన వ్యక్తిగత జీవితం గురించి ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. తన ఆటలో ఓ సమస్య ఉందని.. అదేంటో ఈమధ్యే తెలుసుకున్నానని చెప్పాడు చోప్రా. 'నా గేమ్ పరంగా ఒక సమస్య ఉంది. ఈ ప్రాబ్లమ్ ఏంటనేది ఈమధ్యే తెలుసుకున్నా. అదేంటంటే.. ఈటెన్ బలంగా విసిరేసిన తర్వాత నేను తరచూ ఎడమ పక్కకు పడిపోతున్నా. అయితే.. శిక్షణ సమయంలో నేను అలా పడిపోవడం లేదు. కానీ, పోటీలోకి దిగాక మాత్రం బడిసెను శక్తికొద్ది దూరం విసిరిన తర్వాత నాకు తెలియకుండానే ఎడమ వైపు కూలబడుతున్నా. దీనికి కారణం నేను ఎక్కువ శక్తిని ఉపయోగించడమే కారణమని కోచ్ చెప్పాడు. అందుకే ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా చూసుకోవడంపై దృష్టి సారించాను' అని చోప్రా వెల్లడించాడు. ఈమధ్యే దోహా డైమండ లీగ్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్ అందుకున్న చోప్రా అసాధ్యమన్నది లేదని చాటాడు. ఇదే అంశంపై స్పందించిన బడిసె వీరుడు ఏం అన్నాడంటే.. 'నా కెరీర్లో మొదటిసారి 90 మీటర్ల దూరం విసిరాను. అందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ, ప్రతిసారి తొంభై మీటర్ల మార్క్ అందుకోవడంపై ఫోకస్ పెడుతున్నా. అయితే నేను నిలకడగా 88–89 మీటర్ల దూరం చేరుకుంటున్నా. నా ప్రదర్శన పట్ల కోచ్ సంతృప్తిగా ఉన్నానని చెప్పాడు.

నేను మరింత నిలకడగా రాణించాలని అనుకుంటున్నా. నా తదుపరి లక్ష్యం వరల్డ్ ఛాంపియన్‌షిప్స్. అక్కడ కచ్చితగా పతకం గెలవాలి. సో.. ఆ టోర్నీ సన్నద్ధతకు ఏ ఈవెంట్ పనికొస్తుందో కోచ్‌తో మాట్లాడాక తేల్చుకుంటాను' అని చోప్రా వివరించాడు. టోక్యో వేదికగా సెప్టెంబర్‌లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభం కానుంది. 13 నుంచి 21 తేదీ వరకూ జరుగబోయే ఈ మెగా టోర్నీ కోసం నీరజ్ చెక్ రిపబ్లిక్‌లో 57 రోజులు శిక్షణ తీసుకోనున్నాడు.

## టీమిండియాపై రూట్ పదకొండో సెంచరీ




సుదీర్ఘ ఫార్మాట్‌లో పరుగుల వీరుడిగా పేరొందని జో రూట్ మరో శతకంతో రెచ్చిపోయాడు. భారత్‌పై సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్న రూట్ కెరియర్లో 37వ సారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. తనకు అచ్చొచ్చిన వేదికపై మరెవరికీ సాధ్యం కాని రికార్డును పట్టేశాడు రూట్. ఇక టీమిండియాపై అత్యధిక పర్యాయాలు వంద కొట్టిన రెండో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడీ ఇంగ్లాండ్ మాజీ సారథి. లార్డ్స్‌లో కీలక ఇన్నింగ్స్‌తో శతకం బాది జట్టును పటిష్ట స్థితిలో నిలిపిన రూట్ ఒకే మైదానంలో అత్యధిక సెంచరీల వీరుల క్లబ్‌లో చేరాడు. అతడికి ఈ మైదానంలో ఇది ఎనిమిదో సెంచరీ కాగా.. శ్రీలంక వెటరన్ మహేల జయవర్ధనే కొలంబో మైదానంలో ఏకంగా 11 సెంచరీలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## సిరాజ్‌కు బిగ్ వికెట్..



లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ ఆలౌట్ అంచున నిలిచింది. లంచ్ తర్వాత రెండో ఓవర్లోనే సిరాజ్ ఆతిథ్య జట్టును గట్టి దెబ్బ కొట్టాడు. క్రీజులో కుదురుకున్న జేమీ స్మిత్(51)ను ఔట్ చేసి స్టోక్స్ సేనకు షాకిచ్చాడు. వికెట్ కీపర్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అంతే.. 8వ వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెరపడింది. తొలి సెషన్లో సిరాజ్ ఓవర్లో 5 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కేఎల్ రాహుల్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన స్మిత్.. అర్ధ శతకంతో ఆదుకున్నాడు. కానీ, ఈసారి మాత్రం సిరాజ్‌కే వికెట్ ఇచ్చేసి వెనుదిరిగాడీ యువకెరటం.

# ఫోకస్ సైన్స్




ఎ★★ అనే బ్లాక్ హోల్ నుంచి ఒక మిలియన్ సంవత్సరాల క్రితం విసిరిన శక్తివంతమైన ఢీల వలన ఏర్పడ్డవని పాలపుంత గెలాక్సీ గతంలో బ్లాక్ హోల్ క్రియాశీలత, గ్యాలాక్టిక్ వాయు ప్రవాహాలపై మరింత స్పష్టత లభిస్తోంది.

## ఫెర్మీ బబుల్‌లో చల్లని హైడ్రోజన్



**పా**లపుంత (మల్కీ వే) గెలాక్సీలో ఫెర్మీ బబుల్స్ ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించడం ఖగోళ శాస్త్రంలో కొత్త ఆవిష్కరణలకు తావిస్తున్నది. ఫెర్మీ బబుల్స్ అనేవి మన గెలాక్సీ మధ్యభాగం నుంచి రెండు దిక్కులకూ వ్యాప్తి చెందిన భయంకరమైన గ్యాస్ వాయువు గోళాలు. వీటిని తొలిసారిగా 2010లో నాసాకు చెందిన ఫెర్మీ గామా రే స్పేస్ టెలిస్కోప్ ద్వారా కనుగొన్నారు. ఇవి శక్తివంతమైన గామా రే ఉద్గారాలను వెలువరిస్తూ గెలాక్సీకి పైకీ, కిందకీ సుమారు 25,000 లైట్ ఇయర్స్ వరకు విస్తరించి ఉన్నాయి. ఇలాంటి దట్టమైన, అధిక ఉష్ణోగ్రతలతో నిండిన ప్రాంతంలో చల్లని హైడ్రోజన్ కనుగొనడం అనేది అద్భుతమైన, విప్లవాత్మక విషయం. ఈనెల ప్రారంభంలో గ్రీన్ బ్యాంక్ టెలిస్కోప్ (జిబిటి) అనే అత్యాధునిక రేడియో టెలిస్కోప్‌ను ఉపయోగించి, ఫెర్మీ బబుల్స్ ప్రాంతంలో చల్లగా ఉన్న హైడ్రోజన్ మేఘాలను పరిశోధకులు గుర్తించారు. ఇవి చాలా తక్కువ ఉష్ణోగ్రతల్లో ఉండే గ్యాస్‌తో, తక్కువ ఉష్ణవిద్యుత్తుతో ఉన్నాయని తేల్చారు. సుదీర్ఘ గమనికల ద్వారా ఈ గ్యాస్ మేఘాలు ఫెర్మీ బబుల్స్ లోపలే ఉన్నాయి అని స్పష్టమైంది. ఫెర్మీ బబుల్స్ వంటి ప్రదేశాల్లో అధిక ఉష్ణోగ్రతల వాతావరణం ఉంటుంది. అలాంటిది చల్లని గ్యాస్ ఉండటం అనేది శాస్త్రవేత్తల అంచనాలకు విరుద్ధం. అందుకే, ఇప్పటి వరకూ ఉన్న కొన్ని సిద్ధాంతాలు లేదా అభిప్రాయాలు భవిష్యత్తులో మారడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ బబుల్స్, పాలపుంత కేంద్రంలోని సజిటేరియస్ ఎ** అనే బ్లాక్ హోల్ నుంచి ఒక మిలియన్ సంవత్సరాల క్రితం విసిరిన శక్తివంతమైన ఢీల వలన ఏర్పడ్డవని భావిస్తున్నారు. పాలపుంత గెలాక్సీ గతంలో బ్లాక్ హోల్ క్రియాశీలత, గ్యాలాక్టిక్ వాయు ప్రవాహాలపై మరింత స్పష్టత లభిస్తోంది. కాగా, చల్లని హైడ్రోజన్ మనం చూసే సాధారణ గెలాక్సీ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. గెలాక్సీ కేంద్ర భాగం చుట్టూ ఉన్న గ్యాస్ వాతావరణం ఎలా ఉండేదో ఈ కనుగొనడం ద్వారా స్పష్టమవుతుంది. దీని ద్వారా భవిష్యత్తు గ్యాలాక్సీ ఏర్పాట్లు, నక్షత్రాల జననం, వాయు ప్రవాహాల మెకానిక్స్ గురించి కొత్త మోడల్స్ రూపొందించవచ్చు. అమెరికాలోని పశ్చిమ విజినియాలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద రేడియో టెలిస్కోప్ జిబిటి సాయంతో చేసిన 220గంటల పర్యవేక్షణల ద్వారా ఈ చల్లని హైడ్రోజన్ మేఘాల గురించిన అంచనాలు స్థిరపడ్డాయి. ఈ అధ్యయన వివరాలను 'నేచర్ ఆస్ట్రానమీ' పత్రికలో ప్రచురించారు. ఈ సంచలనాత్మక ఆవిష్కరణ ఫెర్మీ బబుల్స్ చుట్టూ ఉన్న శక్తివంతమైన, ప్రమాదకరమైన వాతావరణం కేవలం వేడిగా మాత్రమే కాకుండా కొన్ని ప్రాంతాల్లో చల్లగా, నిరీక్షణలో ఉండే నక్షత్ర మూలాలతో కూడినదిగా ఉండవచ్చని పేర్కొంటున్నది. ఖగోళశాస్త్రంలో ఇది భవిష్యత్తు పరిశోధనలకు దిశానిర్దేశం చేస్తుంది. అందుకే ఈ ఆవిష్కరణను ఖగోళ శాస్త్రం, ప్రత్యేకించి మన గెలాక్సీపై లోతైన అధ్యయనానికి దిక్సూచిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.



## నాసా 'డార్ట్'తో భూగోళానికి రక్షణ!

**అ**మెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' చేపట్టిన 'డబుల్ ఆస్టెరాయిడ్ రిడైరెక్షన్ టెస్ట్' (డార్ట్) విజయవంతం కావడంతో, గ్రహ శకలాల నుంచి భూమికి చాలా వరకు రక్షణ లభిస్తుందని శాస్త్రవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రహశకలాల నుంచి భూమిని కాపాడే తొలి ప్రయత్నంగా ఈ ప్రయోగాన్ని భావించవచ్చు. భవిష్యత్తులో భూమికి హానికరం చేసే గ్రహశకలాలను కనిపెడితే, వాటి దిశను మార్చి భూమిని రక్షించే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు సమాధానంగా డార్ట్ ప్రయోగాన్ని రూపొందించారు. 2025లో వచ్చిన తాజా అధ్యయన ప్రకారం, డార్ట్ ఢీకొనడం వల్ల వందకు పైగా పెద్ద గ్రహశకలాలు బయటకు వెళ్తున్నట్టు గుర్తించారు. ఇవి డిమార్ఫోస్ ఉపరితలంపై ఉన్న మట్టిని, పరిసరాల నుంచి విడదీసి, బయటకు తోస్తాయి. డార్ట్ ప్రయోగంతో, విజయవంతమైన ఢీ ద్వారా భవిష్యత్తులో భూమికి హానికరంగా మారే గ్రహశకలాలపై మానవ జాతికి దిశ మార్చే శక్తి ఉందని చూపించింది. తక్కువ గురుత్వాకర్షణగల పర్యావరణ శాస్త్రంలో భాగమైన 'ఆబ్జెక్టివ్ బిహేవియర్' మీద జరుగుతున్న పరిశోధనలు డార్ట్ ప్రయోగం ఆధారంగా మరింత ముందుకు సాగుతున్నాయి. గ్రహ శకలాన్ని ఢీకొన్న తర్వాత ఏర్పడిన ధూళి మేఘాల ఆదారంగా డిమార్ఫోస్ అంతర్గత నిర్మాణం తీరుపై విలువైన సమాచారం లభించినట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు. డార్ట్ మాదిరిగానే యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ) కూడా 'హెరా' మిషన్‌ను రూపొందిస్తున్నది. ఇది డిమార్ఫోస్‌కి 2026లో చేరి, అది ఎలా మారిందనే విషయంపై అధ్యయనం చేస్తుంది. ఇలావుంటే, డార్ట్ ప్రయోగం చివరి 5 సెకన్లలో పంపిన చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అయ్యాయి. గ్రహశకలాన్ని ఢీకొన్న తీరు అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించింది.

## ఫీజు బకాయిలు విడుదల చేయండి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ డిమాండ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులకు రావాల్సిన ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఐఇఓ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సర్టిఫికెట్లకోసం కాలేజీ యాజమాన్యాలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు చెల్లించలేని వారు చదువులకు స్వస్తి చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్‌జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా సమితి సభ్యులు కమల్, నాయకులు మహేష్, రవి, వెంకటేష్, సునీల్, యోగి, ఆదిత్య పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు నియంత్రించండి

### ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోలీసులకు వినతి




**ప్రజాపక్షం/భద్రాచలం :** మత్తుపదార్థాల నివారణకు కృషి చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాధనపల్లి సతీష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా అడ్డుకోవడం, అమ్మకాలు సాగించే వారిని, వాడే వారిని కఠినంగా శిక్షించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా యువత చెడు దారుల్లో పయణించకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నారపోగు ఏసు, కటిటపు మహేష్, ప్రవీణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాలు ప్రబలకుండా మెడికల్ క్యాంప్‌లు : సిపిఐ డిమాండ్




**ప్రజాపక్షం/మణుగూరు :** విషజ్వరాలు ప్రబలకుండా మణుగూరు మండలం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఐ మణుగూరు పట్టణ, మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో చెత్తా చెదారం పెరిగిపోయి, దోమలు స్వైర విహారం చేయడంతో జనాలు జ్వరాలు బారిన పడి ఇబ్బంది పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని, కాలువలు శుభ్రం చేయాలని, బావులలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమలు ప్రబలకుండా క్లోరినేషన్ చల్లాలని, హాస్టల్స్‌లో విద్యార్థులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ, సహాయ కార్యదర్శిలు తోట రమేష్, చింతల దశరథం, ఎడారి రమేష్, వేర్పుల నరేష్, ఆధర్ల రాములు, కొత్తపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

### 15న దేవరకొండలో సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభలు




**ప్రజాపక్షం/దేవరకొండ :** జిల్లాలో తాగు, సాగు నీటి సరఫరాకు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన దేవరకొండ, చందంపేట, కొండమల్లేపల్లి, పిఏపల్లి, నేరేడుగొమ్ము, గుడిపల్లి మండలాల మండల కౌన్సిల్ సమావేశానికి పల్లా నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లాకు శాశ్వత కరువు నివారణకు చేపట్టిన ఎస్ఎల్‌బిసి సొరంగ నిర్మాణం, డిండి ఎత్తిపోతల పథకం, బి వెల్లెంల ఎత్తిపోతల, పిల్లాయిపల్లి ధర్మారెడ్డి ఫీడర్ ఛానల్స్, మైనర్ ఇరిగేషన్ పథకాలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా పూర్తి చేయుటకు అధిక నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయకుండా పెట్రోల్ , డిజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్లుగా తీసుకువస్తుందన్నారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేకపాలన చేస్తున్న బిజెపి నుంచి దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజాస్వామ్య లౌకిక శక్తులు ఐక్యం కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందని, ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నల్లగొండ జిల్లా 23వ మహాసభలు ఈనెల 15న దేవరకొండలోని ముదిగొండ రోడ్డులోని మందాడి నర్సింహారెడ్డి ప్రాంగణం(సాయిరమ్య ఫంక్షన్‌హాల్) జరుగనున్నాయని ఆయన తెలిపారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శులు దేప సుదర్శన్‌రెడ్డి, ఉప్పునూతల వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, అచ్చయ్య, జయరాములు, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, రాంరెడ్డి, పాండురంగారెడ్డి, అనిత, వెంగలయ్య, యాదయ్య, గోవర్ధన్, మైనోద్దీన్, జ్యోతిబస్, రమేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** డ్యూటీలో ఉండగా చనిపోయిన అంగన్‌వాడీ టీచర్‌కు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామం లబ్ధి తండాలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్, ఈనెల 8న స్కూలు నుంచి వస్తున్న క్రమంలో తనకు లిఫ్ట్ ఇచ్చి దారి మళ్లించి తీసుకెళ్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై పడి తీవ్రంగా గాయాలపాలయింది. స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించడం బాధాకరమన్నారు. ఆయాలపై ఇలాంటి అఘాయిత్యాలపై పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాని, ఇతర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు, టీచర్లకు భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత, కల్లూరి చందన, టీచర్లు శాంత, సరోజన, మంజుల, అన్నపూర్ణ, వనజ, శోభ పాల్గొన్నారు.



## జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

### ఈనెల 13, 14న సిపిఐ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు చేపడతామని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13,14 న నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో సిపిఐ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు 150 మంది డెలిగేట్స్ తో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మహాసభలను ఈ నెల జులై 13 న రేగొండ ఎస్ఎల్ఎన్ గార్డెన్ లో మహా సభ నిర్వహించడం జరుగుతుందని, 14న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భూపాలపల్లికి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, జిల్లా సమగ్ర అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా మహాసభలలో చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన పెద్ద ఎత్తున చర్చ జరిపి తీర్మానాలు ప్రవేశపెట్టి భవిష్యత్తు ఆందోళన పోరాటాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా మహాసభలను ప్రజలు, మేధావులు, కార్మికులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని రాజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు మాతాంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొరిమి సుగుణ, క్యాతరాజ్ సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గోలి లావణ్య, పెద్దమాముల సంధ్య, పొన్నగంటి లావణ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమబోర్డులో అర్హులకు సభ్యత్వం



### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ బోర్డులో సభ్యత్వం కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో టిప్పర్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టిప్పర్ డ్రైవర్లు, వర్కర్స్‌ను సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి పని గంటలు పెంచే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కార్పోరేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధానాన్ని కార్మికులతో పాటు దేశ ప్రజలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమబోర్డులో అర్హులైన అసంఘటిత రంగ కార్మికులం దరినీ సభ్యులుగా చేర్పించి వారికి రావాల్సిన బెనిఫిట్లను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్‌లో క్లైమ్స్‌ను అర్జిదారులకు అందించే విధంగా అధికారులు, ప్రభుత్వం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి యూనియన్ నాయకులు అమరబోయిన శ్రీనివాస్, మునగా నర్సింహరావు, కారింగుల కొండ లెనిన్, విజయ్‌కుమార్ స్వామి, మహిమూద్, లింగస్వామి, వెంకన్న, నారాయణరెడ్డి, భాగ్యరాజు, వెంకటేశ్వర్లు, ధర్మ, లింగరాజు, ప్రసాద్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండల సిపిఐ మహా సభ ఈనెల 15న నిర్వహించనున్న నేపథ్యంలో సిపిఐ పార్టీ 100 వ సంవత్సరంలో ప్రవేశించిన తరుణంలో సిపిఐ శత జయంతి ఉత్సవాలకు సంబందించి శుక్రవారం ఉమ్మడి చందంపేట మండల కార్యదర్శులు ఉప్పునూతల వెంకటయ్య, బొమ్ము అచ్చయ్య ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నారని ఈ శత జయంతి ఉత్సవాలకు ఉమ్మడి మండలంలోని సిపిఐ పార్టీ కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మొగుళ్ళ వెంగలయ్య, బాలు, శేఖరర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మడేల్, మహేష్, రామాంజనేయులు, దేవ్‌లాల్, కిష్టయ్య, లాలయ్య, హనుమంతు, శివ పాల్గొన్నారు.



## కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** జనాభా పెరుగుదల వలన కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ ప్రోత్సహించాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఏరియా ఆసుపత్రి నుండి భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇట్టి ర్యాలీని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటికే భారతదేశం జనాభాలో మొదటి స్థానంలో ఉందని, దాదాపుగా 150 కోట్ల మంది ప్రజలతో భారతదేశం ముందుందన్నారు. ఈ విధంగా జనాభా పెరుగుట వలన మానవుల అవసరాలకు కావలసిన అనేకమైనటువంటి వనరులను సమకూర్చలేక భారతదేశము ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, గృహం , ప్రకృతి పరమైనటువంటి వనరులను సమకూర్చుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పాండు, ప్రోగ్రామ్ ఇంచార్జి డాక్టర్ యశోద, ప్రోగ్రాం అధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్స్, ఎం.పి.హెచ్.ఓలు, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్‌లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. సాగర్ లోని ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమా దాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న సందర్భంగా శుక్రవారం ఆయన సాగర్ లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే కొన్ని ముఖ్యమైన బ్లాక్ స్పాట్ లను గుర్తించారు. ముఖ్యంగా దయ్యాల గండి మూలమలుపు, డౌన్ పార్క్ వద్ద ముత్యాలమ్మ గుడి మూలమలుపు, బుద్ధవనం, శివమ్ హోటల్ మూల మలుపులను ప్రధాన బ్లాక్ స్పాట్లు గా గుర్తించి ఈ ప్రాంతా లలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధి త అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ వింగ్ సిఐ అంజయ్య , నేషనల్ హైవే డి ఈ మురళీకృష్ణ, ఎలక్ట్రికల్ ఎస్‌ఈ వి. గీత,ఏఈ కే.శేఖర్, ఫారెస్ట్ ఎఫ్ డి ఓ రాఘవరావు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సతీష్ , ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కల్ప న,సాగర్ సిఐ శ్రీను నాయక్ విజయపురి టౌన్ ఎస్‌ఐ జి ముత్తయ్య పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలి

### నాలా ఆక్రమ కట్టడం ఆపకపోతే సిపిఐ పోరాటం : శేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ రోడ్డు లో సర్వే నంబర్ 176 నాలా కల్వర్టు వద్ద చేపడుతున్న అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేసి చౌటుప్పల్ ఊర చెరువు అలుగు ముంపు నుండి రాంనగర్ ,శాంతి నగర్ కాలని వాసులను రక్షించాలని తక్షణమే విచారణ జరిపి నాలా పరిరక్షించి ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలని సీపీఐ మండల పార్టీ అధ్యక్షులు పల్లె శేఖర్ రెడ్డి పత్రిక ప్రకటన ద్వారా అధికారులను కోరారు.నాలా ఆక్రమణ పై సమగ్ర విచారణ జరిపి ముంపు ప్రాంతాల కాలని ప్రజలకు న్యాయం జరగకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అధికారులను హెచ్చరించారు. పేద ప్రజలకు ఎక్కడ ఆపద వస్తే అక్కడ ప్రజలపక్షాన ఎర్రజెండా నిలబడి ఉదమిస్తుంది అని తెలిపారు.గతం లో వర్షాలు అధికంగా కురిసి చౌటుప్పల్ ఊర చెరువు అలుగు పారడం తో జాతీయ రహదారి ఉత్తరభాగం పూర్తిగా నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అలాగే గతంలో నాలాలో అక్రమ కట్టడాలు నిలిపివేయాలని గత జిల్లా కలెక్టర్ కూడా నాలా ను సందర్శించి ఆదేశాలు జారీ చేశారని, ప్రస్తుత ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి నాలా ను పర్యవేక్షించి గత సమస్య పునరావృతం కావద్దని నాలాలో అక్రమ కట్టడాలు ఎవరు చేపట్టిన సహించేది లేదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి తక్షణమే విచారణ చేపట్టి ముంపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు.

## రుణాల మంజూరులో జాప్యంపై రైతుల నిరసన

**ప్రజాపక్షం/హాలియా:** పంట అదును దాటిపోతున్న బ్యాంకు రుణాలు ఇవ్వడంలో అధికారుల చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం హాలియా యూనియన్ బ్యాంకు వద్ద యాచారం, పులిమామిడి, అన్నారం గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ రుణాలను రెన్యూవల్ చేసుకునేందుకు రెండు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వడంలో చేస్తున్న ఆలస్యం మూలంగా తాము అప్పులు తెచ్చి విత్తనాలు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు రుణాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టాఫ్ కొరత ఉందంటూ తమను పట్టించుకోవడంలేదని తెలిపారు. బంగారం తాకట్టు రుణాలు, వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేసేందుకు రోజుల తరబడి జాప్యం చేస్తున్నారని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయ ని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజుల క్రితం బ్యాంకు అకౌంట్ లో డబ్బులు వేస్తే రోజుకు రూ.10 వేల నుండి రూ.20 వేలు మాత్రమే ఇస్తున్నారని దీంతో ఎరువులు విత్తనాలు రైతు కూలీల చెల్లింపులు చేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి త్వరగా గతిన రుణాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



# యాదాద్రి థర్మల్ ద్వారా వచ్చే ఏడాది విద్యుత్

### రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్



**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర్ల ) :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని 5వ యూనిట్ పనులను జనవరి, 2026 నాటికి పూర్తి చేసి విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని,పవర్ ప్లాంట్ లోని ముఖ్యమైన పనుల పూర్తి పై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆదేశించారు.శుక్రవారం అయన దామరచర్ల మండలం లో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ ఎస్. హరీష్ తో కలిసి సందర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ విద్యుత్తు ఉత్పత్తి యూనిట్‌ను,పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరా చేసే మార్షలింగ్ యార్డును, కూలింగ్ టవర్లు, స్విచ్ యార్డ్, తదితర యూనిట్లను ప్రిన్సిపల్ సెక్రెటరీ తిరిగి పరిశీలించారు.ఈ సందర్భంగా వనమహోత్సవం కింద పవర్ ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం వై టి పి ఎస్ సమావేశ మందిరంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఇంజనీరింగ్ అధికారులు, బిహెచ్‌ఇఎల్ ,జెన్కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వై టి పి ఎస్ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు వైటిపిఎస్ ప్రస్తుత పరిస్థితిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీఎండీలకు వివరిస్తూ 2015 జూన్లో తలపెట్టిన ఈ ప్రాజెక్టు పనులు అక్టోబర్ 2017 లో ప్రారంభం అయ్యాయని,సవరించిన అంచనాల ప్రకారం 36,131.99 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ యూనిట్లలో ప్రస్తుత పరిస్థితిని ఆయన తెలియజేశారు.అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ జనవరి నుండి విద్యుత్ కు ఏర్పడే డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని అనుకున్న సమయానికంటే ఒక నెల ముందుగానే 5 వ యూనిట్ పనులు పూర్తి చేసి విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.రబీ సీజన్ తో పాటు, వేసవి ప్రారంభమవుతున్న దృష్ట్యా వై టి పి ఎస్ అధికారులు, అలాగే బీహెచ్‌ఈఎల్ ఇంజనీరింగ్ అధికారులు వీటన్నింటిని పరిగణనలో తీసుకొని 5 యూనిట్ ద్వారా ఫిబ్రవరి, 2026 లో కాకుండా, జనవరి, 2026 లోనే విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వై టి పి ఎస్ లోని ముఖ్యమైన పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ప్రత్యేకించి పర్యావరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ,టౌన్షిప్ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే సివిల్ పనులపై సైతం ప్రత్యేక దృష్టిని నిలపాలని ,ప్రాజెక్టు పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, ప్రతి పనిలో నాణ్యతను అభివృద్ధి చేసే విధంగా అధికారులు చూడాలన్నారు. తక్కువ ధరకు బొగ్గును తీసుకునే విధంగా అధికారులు మార్గాలు అన్వేషించాలని, థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలో ఎక్కువ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వైటీపీఎస్ కోల్ డైరెక్టర్ నాగయ్య, సివిల్ డైరెక్టర్ అజయ్ ,థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, థర్మల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మయ్య, సివిల్ సీఈ శ్రీనివాసరావు, బీహెచ్‌ఈఎల్ సిఇ సురేష్, బీహెచ్‌ఈఎల్ఈడి వినోద్ జాకబ్ ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.



## బిసిల సాధికారతకు కాంగ్రెస్ కృషి

### దేవరకొండ శాసనభ్యులు నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/చింతపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని తీదేడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బాలునాయక్ శుక్రవారం ప్రారంభించారు. వనమహూత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. తీదేడు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన గ్రీన్ కో కంపెనీ వాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం గొల్లపల్లి గ్రామానికి చెందిన కున్న అజయ్ విద్యుత్ షాక్‌తో మరణించిన విషయం తెలుసుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల్ వ్యవపాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, ఆ పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, భవాని పవన్ కుమార్, వెంకటయ్య గౌడ్, జితేందర్ రెడ్డి, యాదయ్య గౌడ్, శ్రీనివాస్ యాదవ్, హరినాయక్, కొండల్, దావలయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** పెండింగులో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్సు హాల్ నందు భూ భారతి, రేషన్ కార్డుల ధృవీకరణ, మీ సేవ దరఖాస్తులు, ఎఫ్‌లైన్ పిటిషన్లపై అన్ని మండలాల తాహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా భూమి వివాదాలు తగ్గి రైతులకు భూ యజమానులకు శాశ్వత న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. భూమి సమస్యలపై ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, రెవెన్యూ, సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని దరఖాస్తులపై తదుపరి చర్యలకు ముందు త్వరితగతిన నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పూర్తిగా పరిశీలించి, నివేదికను సమర్పించాలని అన్నారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పెండింగులో ఉన్న రేషన్ కార్డుల దరఖాస్తులను వెంటనే పూర్తి చేసి, అదనపు కుటుంబ సభ్యుల చేర్పు, అనర్హుల తొలగింపు ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. మీ సేవ దరఖాస్తులు, ఎఫ్‌లైన్ పిటిషన్లు కొన్ని నిర్ణీత కాల పరిమితిని మించి పెండింగులో ఉన్న వాటిని అత్యవసరంగా పూర్తి చేసి ప్రజలకు ఆలస్యం లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రామ్ చందర్, అన్ని మండల తాహసీల్దార్లు పాల్గొన్నారు.



# యువత గంజాయి బారిన పడకుండా చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** యువత, విద్యార్థులు, ప్రజలు గంజాయి బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా లో గంజాయి నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ , అడిషనల్ డిసిపి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్, ఎక్సైజ్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్, వైద్య, విద్యా, అటవీ, ఆర్టీసీ, సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.గంజాయి మీద దృష్టి పెట్టి, యువతను, విద్యార్థులను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుండి కాపాడాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాలని, ఎక్కువగా పాఠశాలలు, కళాశాలలు ఉన్న చోట నష్టాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అన్నారు. గంజాయి చాలా ప్రమాదకరమైనదని భవిష్యత్తును అంధకారంలోకి తీసుకువెళ్తుందనే విషయాలను యువతకు తెలియజేయాలన్నారు. జిల్లాకు సరిహద్దు రాష్ట్రాల నుండి గంజాయి పదార్థాలు రాకుండా అన్ని చెక్ పోస్ట్ లలో గట్టి నిఘా పెంచి పటిష్ఠ చర్యలు చేపట్టాలని, జిల్లాలో గంజాయి పంట సాగును గుర్తించాలన్నారు. రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి మూలాలతో సహా గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు అవసరమైతే భవిష్యత్తును నాశనం చేసే గంజాయిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో లో చదివే పిల్లలకు డ్రగ్స్ పై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ద్వారా గంజాయి పై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ సంబంధిత అధికారులు అందరూ కార్యచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ శాఖ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ల వద్ద గట్టి నిఘా ఉంచామని తెలిపారు. జిల్లా లోని పాఠశాలలు, కళాశాలల్లో, గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లా గా తీర్చిదిద్దేందుకు సమాచారం అందించడంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపర్నెంట్ విష్ణుమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి పద్మజ, జిల్లా అధికారి మనో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో మహిళలపై దాడి



**ప్రజాపక్షం/మోతె:** మండల పరిధిలోని రావిపహాడ్ రెవిన్యూ గ్రామమైన అప్పన్న గూడెం గ్రామంలో వారసత్వ భూమి కోసం తిరుగుతున్న కుటుంబ మహిళలపై అమానుషంగా దాడి జరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. భూమికి సంబంధించిన సర్వే నెంబర్లు 589/ఇ, 589/ఈ, 590/ఆ విస్తీర్ణంలో రెండు ఎకరాల 11 గుంటల భూమి తమ తండ్రిఐన ఏనుగు సురేందర్‌రెడ్డి సంపాదించిన భూమిలో ఇద్దరు కుమార్తెలు ఏనుగు సింధు, బింధులు వెళ్లగా వారసురాళ్లపై వారి మేనత్త పొలగం నీరజ బంధువులతో కలిసి బంధుత్వాన్ని మరిచి తీవ్రంగా దాడికి పాల్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అసలైన వారసులు తామేనని ఏనుగు సురేందర్‌రెడ్డి కుమార్తెలు వారి నాన్న చనిపోయిన తర్వాత ఆయన సంపాదించిన భూమి అక్రమంగా పట్టా చేసుకుని తమను భౌతికంగా దాడి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుధాలతో దాడి చేయగా మా తలలకు, చేతులకు బలంగా గాయాలయ్యాయని అన్నారు. మాకు పొలగం నీరజ కుటుంబంతో ప్రాణహాని ఉన్నదని బోరున ఏడ్చారు. గత కొద్దిరోజుల క్రితం తప్పుడు రికార్డులు సృష్టించి పట్టాలు చేసిన దాంట్లో మా భూమి ఉందని, ఈ భూమిని ఆర్ఐ మన్సూర్‌అలీ అక్రమంగా పట్టా చేసిందని జిల్లా కలెక్టర్ ఆట్టి భూమిని రికార్డుల నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. కొన్ని ఏండ్లుగా జిల్లా కలెక్టర్,తహసిల్దార్, ఆర్ ఐ అధికారులను కలిసిన ఎలాంటి స్పందన రాలేదని వాపోయారు. స్థానికులు, గ్రామపెద్దలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, సర్వే నెంబర్ల ఆధారంగా భూమి హక్కును వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం బాలెంల పల్లె దవాఖానను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకి అందుబాటులో ఉండాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న పెషెంట్స్ ఎంత మంది ఉన్నారు. వాళ్ల చికిత్స పై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో వాటర్ ట్యాంక్ ను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా క్లీన్ చేయాల్సిందిగా గ్రామ కార్యదర్శిని అదేశించారు. వ్యాధి నిరోధక టీకాలు వేసే రోజు పెషెంట్స్ వచ్చినప్పుడు కూర్చోవడానికి వీలు ఉండటంలేదని డాక్టర్ చెప్పగా వెంటనే వెయిటింగ్ షెడ్ నిర్మించాలని గ్రామ కార్యదర్శిని అదేశించారు. ఈ నివేదికను రెండు రోజుల్లో ఇవ్వాలని అదేశించారు. అనంతరం బాలెంల ప్రాథమిక పాఠశాల సందర్శించి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి నాల్గవ తరగతి క్లాస్‌లోకి వెళ్లి సుశాంత్ అనే విద్యార్థిని ఇంగ్లీష్ అనుష్క అనే బాలికను తెలుగు చదివించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి తెలుగు, ఇంగ్లీష్ భాషలలో పట్టు సాధించాలని అన్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, నీటి గుంతలు ఉండే ప్రదేశంలో మట్టి పోయించాలని గ్రామ కార్యదర్శికి అదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించి సెంటర్‌లో ఎంతమంది పిల్లలు ఉన్నారు. వారికి అందుతున్న మెనూ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పిల్లల చేత పదాలు చదివించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా మార్చటానికి ప్రతిపాదనలు పంపాలని, టాయిలెట్స్ ఎత్తు పెంచుకోవాలని, వాటర్ ట్యాంకు నిర్మాణం చేయాల్సిందిగా అదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి మణిరత్నం, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ నీరజలత, ఉపాధ్యాయులు రేణుక, ఎల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్ నాగమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందుతుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధిని 18 మంది లబ్ధిదారులకు రూ.7.81 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలల వ్యవధిలోనే 55 మందికి రూ.24.70, 500నియోజక వర్గంలో అందించినట్లు తెలిపారు. బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బిసి గణన చేయించి 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. ఈ సర్వే ఎంతో శాస్త్రీయంగా జరిగిందన్నారు. రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేయడం జరిగిందని చెప్పారు. ఈనెల 14వ తేదీన అర్హులైన వారికి రేషన్‌కార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో ప్రారంభించబోతున్న నూతన రేషన్‌కార్డుల పంపిణీకి సిఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, నేరెళ్ల మధుగౌడ్, వెంకన్న నాయక్, పిల్లల రమేష్‌నాయుడు, మాజీ కౌన్సిలర్లు వెంకన్న, వెలుగు వెంకన్న, జ్యోతి, కరుణాకర్ పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు పరిశుభ్రత కీలకం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** వాతావరణ మార్పులు, వర్షకాలం వేగంగా దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా పరిశుభ్రతను అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి సూచించారు శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా 36వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీటి నిల్వలతో దోమల ఉత్పత్తి అధికమవుతుందని, వాటివల్ల డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు విస్తరించే అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లారిన తర్వాత వాడాలని, పాత ట్యాంకులు, డ్రమ్ములు, బిందెల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. తడి, పోడి హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. శిధిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే కూల్చివేయాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యకరమైన సూర్యాపేటను నిర్మించగలమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు శివప్రసాద్, శ్వేత, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## నిధుల మంజూరుకు మంత్రికి వినతి



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలో నిధుల్లేక అసంపూర్తి దశలో నిలిచిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పూర్తికి నిధులు మంజూరుచేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలో శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి పాతభవనం వెనకాల కొత్తగా నిర్మించిన భవనం నిధుల్లేక నిర్మాణ పనులు నిలిచిపోయాయని, మిగిలిన పనులపూర్తికి అవసరమయ్యే రూ.5కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలతోపాటు అందజేశారు. ఇందుకు నిధుల మంజూరుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## నిందితుడికి జైలు శిక్ష



**ప్రజాపక్షం/నారాయణపేట :** నేరం నిరూపణ అయినందున బి.సాయిమనోజ్ అనే నిందితునికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించడం జరిగిందని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఉట్కూరు మండలం, పెద్ద జట్రం గ్రామానికి చెందిన నరసప్ప తండ్రి రాజన్న, వయస్సు 45 సం॥ లు అనే వ్యక్తి పని నిమిత్తం నారాయణపేటకు రాగా అదే గ్రామానికి చెందిన బూడిది రాములు తండ్రి కిష్టప్ప వయస్సు 35 సం॥ లు ఊరిలో పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒక హోటల్ ముందల నిలబడి ఉన్నా నర్సప్పను బండరాయితో తలపై కొట్టగా తలకు బలమైన గాయమైనందున నారాయణపేట పోలీస్ స్టేషన్లో 2016లో ఫిర్యాదు ఇవ్వగా అప్పటి పేట ఎస్ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ నమోదు చేయగా ప్రస్తుత సీఐ శివశంకర్, ఎస్ఐ కృష్ణయ్య గౌడ్, సిడిఓ అరవింద్ కుమార్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్, కోర్టులో వాదనలు వినిపించగా జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించడం జరిగింది. నిందితునికి కోర్టులో శిక్ష పడినందున ఎస్పీ పోలీస్ అధికారులను, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభినందించారు.

## కృష్ణ నూతన ఎంపిడిఒగా విజయలక్ష్మి



**ప్రజాపక్షం/కృష్ణ:** కృష్ణ మండల నూతన ఇంచార్జి ఎంపీడీవోగా శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న జానయ్య సూర్యాపేటకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కృష్ణ మండల ఇంచార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

## ఆషాడమాసం గోరింటాకు వేడుకలు



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బిజ్వార్‌లో గోరింటాకు వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, రమేష్, గోపాల్, నాగరాజు, గజలప్ప, మనోహర్, హర్షద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, శేఖర్, నరేష్, కృష్ణ, యాసీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** గృహహింస నిరోధక చట్టం, వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎదుర్కొనే విధంగా ధైర్యం ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికారి అన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని మాట్లాడుతూ గృహహింస నిరోదక చట్టం , పోక్సో యాక్ట్ , పోష్ యాక్ట్ ల గురించి వివరిస్తూ మైనర్లు ఇచ్చిన అంగీకారాలు చట్టపరంగా చెల్లవు , మైనర్లు చేసుకున్న వివాహాలు చెల్లెవు అని తెలియజేశారు. మైనర్లు అంగీకారంతోనే లైంగిక సంబంధం కలిగి ఉన్న అది చట్టపరంగా అత్యాచారం అవుతుందని తెలియజేశారు. అదేవిధంగా ఇంటర్నల్ కంప్లైట్ కమిటీ పరిధిలోకి రాని మహిళలు ఎవరైనా లైంగిక వేదింపులకు గురి అయితే లోకల్ కంప్లైంట్ కమిటీలో ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కృష్ణయ్య, కళాశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా ఝాన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు గౌరీ శంకర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నయూముద్దీన్ అనారోగ్యంతో బంజారాహిల్స్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరాలజీ అండ్ నెఫ్రాలజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సందర్భంలో మాజీ ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ దేశావలి సతీష్ కుమార్, ఉపాధ్యాయులు రమణాచార్యులు, హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించి అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

## దేవాలయానికి రెండు బస్సులు అందజేత

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వర దేవస్థానానికి రెండు బస్సులను ఉచితంగా ఇచ్చినట్లు ఎమ్మెల్యే వంశీ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఉమామహేశ్వర దేవస్థానంలో సిబిఎం ట్రస్టు డైరెక్టర్ అనురాధ దేవస్థానానికి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమామహేశ్వర దేవస్థానం భక్తులసౌకర్యాన్ని దృష్టిలోపెట్టుకొని పాలకమండలి విజ్ఞప్తి మేరకు బస్సులను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఈబస్సులు కొండపైనుంచి దిగువకు వచ్చేందుకు సహకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర దేవస్థాన చైర్మన్ బీరం మాధవరెడ్డి పాల్గొన్నారు.

## మంత్రివర్గ నిర్ణయం చరిత్రాత్మకం

**ప్రజాపక్షం/మక్తల్ :** కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరీ ముఖ్యంగా మక్తల్ ఎమ్మెల్యే, మంత్రి డాక్టర్ .వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి కార్మికులతో డిసిహెచ్ఎస్ చర్చలు సఫలం

చర్చల హామీలు నెరవేర్చకపోతే మరోసారి సమ్మె తప్పదు : తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** బాలనగర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికుల వేతనాల్లో ఏజెన్సీ భారీ కోతల అవినీతి అక్రమాలపై విచారణ జరిపి ఏజెన్సీ లైసెన్సు రద్దు చేయాలని, నాలుగు నెలల పెండింగ్ వేతనాన్ని చెల్లించాలని డిమాండు చేస్తూ రెండు రోజులుగా పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు కాంట్రాక్టు వర్కర్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరానికి ఆసుపత్రి సూపరింటెండెంట్, డిసిహెచ్ఎస్ డా.చంద్రకళ చేరుకుని ఏఐటీయూసీ యూనియన్ నేతలు, కార్మికులతో శుక్రవారం ఆమె చాంబర్లో చర్చలు జరిపి సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపి మూడు రోజుల్లో వేతనాలు పెంచుతూ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించి ఎందుకు చేయరాదు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ ఆగడాలు అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయిందని కార్మికుల జీతాల చెల్లింపులలో అవినీతికి పాల్పడటం దారుణం అన్నారు. జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరిస్థితులు ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రి కార్మికుల పరిస్థితి ఏంటి ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్ణయించిన జీవో ప్రకారం, టీవీ విపి కమిషనర్ ఆదేశాలు ఇచ్చిన జీతాలు, పిఎఫ్ ఈఎస్ఐ అమలవుతున్నాయో లేదో పరిశీలన చెయ్యకపోతే ఏమి లాభం అని అన్నారు. చేసిన కష్టానికి జీతం ఇవ్వకుండా నెలలు తరబడి పెండింగులో ఉంచితే కార్మికుల జీవనం సాగేది ఎలా అని అన్నారు. ఏజెన్సీ అవినీతి అక్రమాల సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, చర్చల్లో ఒప్పుకున్న జీతాల పెంపు అమలు, కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేనిచో మరోసారి సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా కోశాధికారి ఎస్.దేవానంద్, ఆసుపత్రి కార్మికులు గోపిచారి, అంజి, సాధిక్, సుగుణ, అనిత, పద్మ, ప్రమీల, రాఘవేందర్, ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్స్, ఆసుపత్రి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/అడ్డాకుల :** దేవరకద్ర మండలంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ పాఠశాల, పిహెచ్‌సి, కెజిబివిని, ఇందిరమ్మ ఇంటిని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు, గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. దేవరకద్ర పిహెచ్‌సిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపి రిజిస్టర్ పరిశీలించారు. శుక్రవారం ఇప్పటివరకు 60మంది ఓపి నమోదు చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ వివరించారు. ప్రతి నెల పిహెచ్‌పిలో నిర్వహించే ప్రసవాల గురించి అడిగారు ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగారు. మందుల కొరత లేదని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ 5,11 వార్డులలో కలెక్టర్ " డ్రై డే" కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ వార్డులలో నివాసం ఉన్న ప్రజలకు డ్రై డే పాటించాలని ప్రతి ఒక్కరు తమ ఇంటిని, ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దోమల ద్వారా వ్యాధులు నివారించవచ్చని అన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్త వేయవద్దని, నీరు నిల్వ లేకుండా చూడాని సూచించారు. దేవరకద్ర మండలం మినుగోనిపల్లి శివార్లో ప్రభుత్వ స్థలం పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించారు. దేవరకద్ర మండలం వినుగోనిపల్లిలో జిల్లాలో మొట్టమొదటిగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి అయిన ఇందిరమ్మ గృహ లబ్ధిదారు విజయతో మాట్లాడారు. ఎన్ని చదరపు అడుగులలో నిర్మించారు అని కలెక్టర్ అడిగారు. 466 చదరపు అడుగులలో నిర్మించినట్లు లబ్ధిదారురాలు కలెక్టర్‌కు తెలిపారు. లబ్ధిదారురాలు విజయతో పాటు ఇందిరమ్మ ఇంటిని, లోపల వంట గదిని పరిశీలించి మీ ఇల్లు చాలా బాగుందని కలెక్టర్ అన్నారు. కె.జి.బి.వి తనిఖీ దేవరకద్ర మండలంలో కె.జి.బి.వి తనిఖీ చేశారు. ఎనిమిదవ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో బోధన పాఠశాలలో మౌలిక వసతులు అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనంపై మాట్లాడారు. స్టోర్ రూమ్, వంట గదిని, మధ్యాహ్న భోజనం ఆహారంను పరిశీలించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మండల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలలో కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సిజిఆర్) పాఠశాల విద్యా శాఖ సంయుక్తంగా అమలు చేస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలలో పలు పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ద్వారా విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన పెంచడం బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఔషధ మొక్కల తోట ఏర్పాటు చేయడం జరిగింది. దీనివల్ల విద్యార్థులకు ఆయుర్వేద ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన ఏర్పడుతోంది. ఈ ద్వారా విద్యార్థులలో ప్రకృతి పట్ల గౌరవభావాన్ని పెంచే విధంగా సామాజానికి ఒక స్పష్టమైన సందేశం తెలిపినట్టు ఉంటుంది. నేడు కొమ్మలు నాటితే రేపటి తరం జీవించగలదు అనే సందేశాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎర్త్ లీడర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహాచారి, సైన్స్ టీచర్స్ సౌభాగ్యాలక్ష్మి , వెంకటమ్మ, ఉపాధ్యాయ బృందం, సిజిఆర్ తదితరుల పాల్గొన్నారు.

# పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్‌ల బహుకరణ



శిశుమందిర్ పాఠశాలలో గోరింటాకు ఉత్సవం

**ప్రజాపక్షం/మక్తల్ :** సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా గోరింటాకు ఉత్సవం నిర్వహించడం జరిగిందని శాంతాబాయ తెలిపారు. మక్తల్ పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా విద్యార్థులందరు గోరింట పండుగను చేసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులందరూ వివిధ రకాల ఆకృతులలో గోరింటాకును చేతులకు అలంకరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికా విద్యా ప్రముఖ్ శాంతాభాయి మాట్లాడుతూ వేసవికాలం నుండి వర్షాకాలం మారుతున్న తరుణంలో చల్లబడుతున్న శరీరానికి వేడిని జత చేసి వివిధ రకాల అనారోగ్యాల నుంచి గోరింటాకు కాపాడుతుందని తెలియజేశారు. అంతేకుండా ఆడపిల్లల అలంకారానికి గోరింట ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉండదని గోరింటను గౌరీదేవిగా పూజించే సంస్కృతి సంప్రదాయం మన సనాతన ధర్మంలో ఉందని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ఆపరేషన్ చంద్రమాన్ 3 భారత్ మాతాకీ జై వంటి అక్షరాలు తమ చేతులపై అలంకరించుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నూతనంగా నిర్మించబడిన తరగతి గదికి పాఠశాల సమితి సభ్యులు చందాపురం శేఖర్ తమ వంతుగా రెండు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు కావలి వెంకటేష్, పాఠశాల, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన రజక సంఘం సభ్యులు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ పురపాలక సంస్థ పరిధిలోని ఎదిర డివిజన్‌లో రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం అసంపూర్తిగా నిర్మించింది. అసంపూర్తిగా ఉన్న రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయుటకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రూ.5 లక్షలు నిధులను మంజూరు చేసినందుకుగాను రజక సంఘం సభ్యులు ఎమ్మెల్యేని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. మంచి చదువులు చదువుకుంటేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే చదువుతో పాటు ఏదైనా ఒక వృత్తి విద్యలో పిల్లలు ప్రావీణ్యం సాధించే విధంగా వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలన్నారు. రజకులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంగారి భరత్‌కుమార్, బి.శ్రీనివాసులు, బి.విజయ్‌కుమార్, పి.మోహన్, బి.రవికుమార్, పి.నాని, బికె శ్రీకాంత్, బి.మల్లేష్, టి.నర్సింహులు, తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన మాజీ పాలక వర్గం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు పట్టణ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినటువంటి ఖాజా ఆరిఫుద్దిన్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పెబ్బేరు పట్టణ తాజా మాజీ మున్సిపల్ పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ పెబ్బేరు పట్టణ అభివృద్ధికి నిష్పక్షపాతంగా కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో కర్రెస్వామి, చిన్న ఎల్లారెడ్డి, రామకృష్ణ, పెబ్బేరు పట్టణ నాయకులు మేకల ఎల్లయ్య, వేణుయాదవ్, ఎద్దుల సాయినాథ్, బీష్మ తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తం

కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లాలో భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల సమయంలో ఏమైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే వెంటనే జిల్లా కంట్రోల్ రూంను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్లు 08545 / 233525,08545/220351కు సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలు వానకు సంబంధించి ఎలాంటి అపాయకర పరిస్థితులు, నీటి ముంపు ప్రాంతాలు ఇతర సమస్యలపై వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నదని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## పూడికతీస్తే భూగర్భజలాలు పెంపు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** చెరువులు, కుంటల్లో పూడిక తీస్తే భూగర్భజలాల పెరుగుదల సులువుగా పెరగడంతోపాటు పోషకాలతో నిండి ఉన్న మట్టిరైతుల పొలాల్లో వేసుకోవడంవల్ల పంట దిగుబడికి ఉపయోగపడుతుందని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి అతర్వపవర్ అన్నారు. మండలంలోని నందివడ్డెమాన్, లింగసానిపల్లి గ్రామాల్లో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను శుక్రవారం క్షేత్రపరిశీలన చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. లింగసానిపల్లిలో నిర్మించిన కమ్యూనిటి సోప్ పిట్ను పరిశీలించి గ్రామస్తులకు ఏవిధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. నందివడ్డెమాన్‌లోని సూరమ్మకుంటపూడిక తీయడం వల్ల కలిగిన ఉపయోగాలను రైతులను అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఎస్ఆర్ఇజిఎస్ పనులను గ్రామీణప్రాంతాల్లోని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా అడిషనల్ డిఆర్‌డిఓ రాజేశ్వరి, రాజేష్‌కుమార్, క్రాంతికుమార్, పవన్, ఎంపిడిఓ కతలప్ప, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, ఏపివో మల్లిఖార్జున్, ఈసి రాంమోహన్, రాజు, రమేష్ ఉన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా 'ఫ్రైడే డ్రైడే'



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో వైద్య సిబ్బంది, పట్టణ మున్సిపల్ సిబ్బందిచే ఫ్రైడే డ్రైడే నిర్వహించి పట్టణ ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డా.ప్రవళిక అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంటి ముందర, ఇంటి పై కప్పున, ఉన్న ప్లాస్టిక్ కంటైనర్స్, పగిలిపోయిన కుండలు, పూలకుండీలు, ఎయిర్ కూలర్లు, సిమెంట్ ట్యాంకులలో, పాత టైర్లులో నీళ్లు నిలవకుండా చూసుకోవాలన్నారు. పెబ్బేరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఏఈ యోగేష్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎంలు వెంకటమ్మ, శారదమ్మ, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ వార్డు ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

## చట్టసవరణ చేసి అందరికి అవకాశం




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** పంచాయతీరాజ్‌చట్టం 2018చట్ట సవరణ చేపట్టి ఆంక్షలు లేకుండా ఎన్నికల్లో పోటి చేసేందుకు అందరికి అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మండల సిపిఐ మండల సహాయ కార్యదర్శి భూపేష్‌బాబు డిమాండ్ చేశారు. మండల సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలంచెల్లిన ఇద్దరుపిల్లల నిబంధనను తొలగించి ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తే స్థానికసంస్థల ఎన్నికల్లో పోటి చేసి గ్రామాభివృద్ధికి పాటుపడతారని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆధ్యాత్మిక చింతన అవసరం



**ప్రజాపక్షం/అచ్చంపేట :** గ్రామీణప్రాంత విద్యార్థులకు ఆధ్యాత్మిక చింతన ఉంటే విద్యార్థులు అభివృద్ధి చెందుతారని నాగర్‌కర్నూల్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రామీణజీవన వికాససంస్థ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక చింతన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు సాంఘిక ఆధ్యాత్మిక చింతన ఉండాలని అభిప్రాయపడ్డారు. గతంలో నీతిశాస్త్రం అనేపుస్తకం ఉండేదని కాని ఇప్పుడు లేనందున ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, స్థానిక నాయకులు జూలూరి సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

# రీల్

## కిరణ్ అబ్బవరం తాజా చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'



హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన సొంత నిర్మాణ సంస్థ కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమాకు 'తిమ్మరాజుపల్లి టీవీ'. అనే పేరును ఖరారు చేశారు. తేజేశ్వర్ రెడ్డి వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద శ్రీ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. సాయి తేజ్ కిరణ్ అబ్బవరం గత సినిమాల్లో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేశాడు. 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వి.మునిరాజు కిరణ్ అబ్బవరం మూవీస్ కు ఆన్ లైన్ ఎడిటింగ్ చేసేవారు. 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ఆసక్తిని కలిగిస్తున్నాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ రిలీజ్

రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పణలో తెరకెక్కిన 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం రామానాయుడు స్టూడియోలో జరిగింది. నటిచిత్రనిర్మాత ప్రవీణ పరుచూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. రికార్డ్ డ్యాన్స్ స్టూడియో ఓనర్ అయిన రామకృష్ణ సావిత్రిని ప్రేమిస్తాడు. ఒక రోజు, సావిత్రి అతన్ని గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. రామకృష్ణ చాలా ఉత్సాహంగా వెళ్తాడు. కానీ ప్రేమకథ ఇక్కడే షాకింగ్ మలుపు తిరుగుతుంది. అతని జీవితాన్ని గందరగోళంలోకి నెట్టివేస్తుంది. ఆ క్షణం నుండి ఊహించని మలుపులతో ఒక మిస్టీరియస్ ఎలిమెంట్ తెరపైకి రావడం చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. గురుకిరణ్ బతులా రాసిన ఈ కథ ఊహించని థ్రిల్లింగ్ అంశాలతో చిత్రానికి ప్రత్యేకమైన ఫ్లేవర్‌ని తీసుకొచ్చింది. ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహించడంతో పాటు ఓ కీలకమైన పాత్రను కూడా పోషించారు.






## బాహుబలి టీమ్ పదేళ్ల సంబరం

ప్రభాస్ హీరోగా, ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సినిమా ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికి తెలిసిందే. తెలుగు సినిమా చరిత్రను మార్చింది. తెలుగు సినిమాను పాన్ ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన చిత్రం బాహుబలి. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ప్రభాస్ వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్, ప్రతి సన్నివేశం అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత దర్శకుడు రాజమౌళికి దక్కుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ సినిమా విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా టీమ్ సభ్యులంతా కలసి సెలబ్రేషన్ చేసుకున్నారు. ఇండియన్ సినిమాపై ఓ మైలురాయిగా నిలిచిన బాహుబలి చిత్రాన్ని తిరిగి అక్టోబర్ 31న మళ్ళీ విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఆగస్ట్ 29న 'మైనే ప్యార్ కియా'




మలయాళ చిత్రం మైనే ప్యార్ కియా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇది రొమాన్స్, కామెడీ, సస్పెన్స్‌లతో కూడిన థ్రిల్లర్‌ఎ సినిమాగా నూతన దర్శకుడు, రచయిత ఫైజల్ దర్శకత్వంతెరకెక్కించారు. ఈ చిత్రాన్ని స్పైర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సంజు ఉన్నితన్ నిర్మించారు. హృదు హరూన్, ప్రీతి ముకుందన్ హీరో హీరోయిన్ గా నటించారు. డిఫరెంట్ లవ్ స్టోరీగా ఈ సినిమాను రూపొందించారు. ఈచిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి ఆగస్ట్ 29న థియేటర్లలో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. హీరోయిన్ ప్రీతి ముకుందన్, తమిళ చిత్రం స్టార్, అసై కూడైలో దృష్టిని ఆకర్షించిన తర్వాత మలయాళంలో అరంగేట్రం చేస్తోంది.

## థమన్ స్టూడియోలో ప్రభాస్



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న రాజాసాబ్ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. ఒకపక్క షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా కోసం ప్రభాస్ థమన్ స్టూడియోకు వచ్చారు. రీ రికార్డింగ్ జరుగుతున్న సమయంలో ప్రభాస్ థమన్ స్టూడియోకు వచ్చి కాసేపు గడిపారు. ఇటీవలే విడుదల చేసిన రాజాసాబ్ టీజర్ కు మంచి స్పందన వచ్చింది. హర్రర్ , యాక్షన్ డ్రామా గా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు రీ రికార్డింగ్ కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనికోసం థమన్ ఎంతో కష్టపడి పని చేస్తున్నారు. చాలా రోజుల తరువాత ప్రభాస్ నటిస్తున్న అచ్చమైన తెలుగు సినిమా కావడంతో ఈ సినిమాను ఎలాగైనా సూపర్ డూపర్ హిట్ చెయ్యాలనే తపనతో సినిమా యూనిట్ పని చేస్తోంది.

## 'విసా వింటూరా సిరదాగా' ఫస్ట్ లుక్



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. బ్యానర్‌పై నిర్మించిన మరో విభిన్న చిత్రం 'విసా వింటూరా సరదాగా'. ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలైంది. వినోదం, ప్రేమ, భావోద్వేగాలతో నిండిన ఓ సరికొత్త యూత్‌ఫుల్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. అమెరికా నేపథ్యంలో సాగే ఈ చిత్రం.. విదేశాలలో చదువుతున్న భారతీయ విద్యార్థుల జీవితాలను, వారి కలలను, సందిగ్ధతలను, స్నేహాలను, మధుర క్షణాలను ప్రేక్షకుల మనసుకి తాకేలా చూపించనుంది. యువత మెచ్చేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు ఉద్భవ్ దర్శకత్వం వహిస్తున్నారు.

## ఫిష్ వెంకట్‌కు జెట్టి సినిమా హీరో ఆర్థిక సహాయం



జెట్టి సినిమా హీరో కృష్ణ మానినేని ఆధ్వర్యంలో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థ థౌసండ డ్రెయిన్స్ ఫౌండేషన్ తరపున సినీ నటుడు ఫిష్ వెంకట్ వైద్య అవసరాల కోసం జెట్టి సినిమా హీరో కృష్ణ ఆర్థిక సహాయం చేశారు. వైద్య ఖర్చుల కోసం ఫిష్ వెంకట్ కుమార్తె స్రవంతికి రెండు లక్షల రూపాయలను కృష్ణ అందించారు. చిత్రపరిశ్రమలో తనదైన హాస్యంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఫిష్ వెంకట్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన వైద్య ఖర్చులకు మానవతా దృక్పథంతో సహాయం చేశానని హీరో కృష్ణ మాని నేని చెప్పారు.

## 'కేడీ ది డెవిల్' టీజర్ ఆవిష్కరణ



కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధృవ సర్జా హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద నిర్మాత వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ ఎత్తున నిర్మించిన చిత్రం 'కేడీ ది డెవిల్'. ఈ సినిమాను ప్రేమ్ తెరకెక్కించారు. ఈ మూవీలో ధృవ సర్జాకు జోడిగా రీష్మా నటించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి వంటి భారీ తారాగణం ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను హైదరాబాద్ ఆర్ కె సినీ ప్లెక్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ఎంతో మందితో కలిసి పని చేశాను. మరీ ముఖ్యంగా నాకు హైదరాబాద్ ఫుడ్ అంటే చాలా ఇష్టం. నేను ప్రభాస్ రాజా సాబ్ సినిమాకు పని చేస్తున్నాను. అక్కడే తెలుగు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు తెలుగులో చిరంజీవి గారంటే చాలా ఇష్టం. కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంకీ సర్, సుప్రిత్‌లకు సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. అందుకే ఇలాంటి మూవీని ఇంత గొప్పగా నిర్మించగలిగారు. డైరెక్టర్ ప్రేమ్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. రీష్మా చాలా చక్కగా నటించారు. ధృవ్ నా తమ్ముడు లాంటివారు. ధృవ చాలా ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాను. శిల్పా శెట్టితో ఎప్పుడు పని చేసినా అదే ఎనర్జీ ఉంటుంది. మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.

## 'ఏ ఊరికెళ్తావే పిల్లా' పాట ఆవిష్కరణ

మల్టీ ట్యాలెంటెడ్ అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రజా యుద్ధ నౌక గద్దర్ భార్య విమలా గద్దర్ చేతుల మీదుగా ఈ సినిమా నుంచి 'ఏ ఊరికెళ్తావే పిల్లా' పాటను ఆవిష్కరించారు. కనకవ్వ, గంగవ్వ, జోగిని శ్యామల, బేబీ లాంటి జానపద కళాకారుల సమక్షంలో 'సీత పయనం' టీం అందరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నల' కూడా పాల్గొన్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ పాటను. రాహుల్ సిప్లిగంజ్, మధు ప్రియ ఆలపించారు. ఆస్కార్ అవార్డు, తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు గ్రహీత చంద్రబోస్ సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర కిలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి డిఓపి జి.బాలమురుగన్, ఎడిటర్ అయూబ్ ఖాన్, డైలాగ్స్ సాయి మాధవ్ బుర్రా రాశారు.



# సామాజిక న్యాయానికి కట్టుబడ్డాం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత 100 సంవత్సరాలలో భారతదేశంలోని ఏ రాష్ట్రము చేయని బిసి కుల గణన 1.04 లక్షల ఎన్యూమరేటర్ల ద్వారా సేకరించి విజయవంతం చేశామని, ఇచ్చిన మాటప్రకారం కులగణన చేసి బిసిలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42శాతం అమలు కోసం చట్టం తెచ్చామని, జూలై 10న నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే ప్రజల కోసం ఎస్సీ వర్గీకరణ చేశామని, బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణ అనే రెండు క్యాబినెట్ సబ్ కమిటి చైర్మన్‌గా నేనే వ్యవహరించానని తెలిపారు. జూలై 14న కొత్త కార్డులను ఇవ్వబోతున్నామని, అదనంగా కుటుంబ సభ్యులని రేషన్‌కార్డులో చేర్చుతున్నామని రూ.13 వేల కోట్ల రూపాయల ద్వారా రూ. 3.10 కోట్ల మందికి ఆరుకేజీల సన్నబియ్యం ఉచితంగా ఇచ్చి 95 లక్షల కుటుంబాలకు చెందిన పేదవారికి కడుపునిండా అన్నం పెట్టి ఆకలి తీర్చడం, అర్హులందరికి రేషన్‌కార్డులు ఇవ్వడం సంతోషమని, సంతృప్తిని ఇచ్చాయని, ఇలాంటి పేదవారికి ఆహార భద్రత కల్పించే సంక్షేమ పథకాలు స్వతంత్ర భారతదేశంలోనే లేవని తెలిపారు. ఖరీఫ్, రబీ సిజన్‌లలో 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి భారతదేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిల్చిందని, యాసంగి సీజన్‌లో చివరి గింజ వరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం సేకరణ సన్నబియ్యం పంపిణి, రేషన్‌కార్డుల జారీ లాంటివి ప్రజలకి ఇచ్చి గ్రామీణ రైతులు బాగుండాలని తెలంగాణ సశ్యశ్యామలం అయ్యేలా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

**పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, గత పాలకులు పేదల సంక్షేమం కోసం ఏ పథకం చేయలేదని, పేద వారికి నూతన రేషన్‌కార్డులు ఇవ్వలేదని ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాని ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఈనెల 14న మధ్యాహ్నం మూడు గంటలకి జరిగే నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి అందరు సమన్వయం చేసుకుంటూ ఎవరు ఊహించని విధంగా విజయవంతం చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. బిసిలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు తెలుపుతూ 14న రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి 9 మండలాలు, రెండు మున్సిపాలిటిలు, 154 గ్రామ పంచాయతీల నుండి 70వేల మందిని తరలించి సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు జరుగుతుందని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిపిటి ద్వారా వివరించి గత పాలకుల వల్ల తెలంగాణ ప్రజలకు అర్థం అయ్యేలా వివరించారని అన్నారు. ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్రవ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డిఆర్‌డివో వివి అప్పారావు, డిపివో సతీష్‌కుమార్, డిఎస్‌వో మోహన్‌బాబు, ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ హరిప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం

**2024–25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం**

**యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి : మంత్రి శ్రీధర్ బాబు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'నెక్స్ట్ జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్మెంట్స్ ఇన్ కాంపోజిట్ & స్టీల్ స్ట్రక్చర్స్)' అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం అని మంత్రి వివరించారు. 'ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ తరహ భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్(ఆర్ సీసీ) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్ & స్టీల్ స్ట్రక్చర్స్‌కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జీఎస్‌మూర్తి, మహేందర్‌రెడ్డి, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతులా? (మొదటి పేజీ తరువాయి)

నమోదు చేయించిన నాటి ఎంఎల్‌సి రామచంద్రరావును బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమిస్తే, రోహిత్ వేముల ఆత్మహత్యకు ప్రధాన కారకుడిగా భావిస్తున్న ఎబివిపి నాయకుడు సుశీల్ కుమార్‌ను ఢిల్లీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చెప్పినట్టుగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 'రోహిత్ వేముల చట్టాన్ని' తీసుకొస్తామన్నారు. ఢిల్లీలోనీ ఏఐసిసి కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్‌లో ఏఐసిసి ఎస్‌సి డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్‌తో కలిసి భట్టి మీడియా సమావేశంలో మాట్లాడారు. రోహిత్ వేముల కేసును రీ ఓపెన్ చేయాలని కోరుతూ కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం ఒక నోట్ ఇచ్చిందని, ఆ కేసును రీ ఓపెన్ చేసి రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన వారిని ఎవరిని వదిలి పెట్టబోమని జర్నలిస్టులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. దళితులు, గిరిజనులను ఇబ్బంది పెట్టి, వారు మరణించే వరకు టార్గెట్ చేసే వారికి బిజెపి నాయకత్వం పదవులు ప్రోత్సాహకాలనిస్తుందని ఆరోపించారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్ నోట్‌లో యూనివర్సిటీ అధికారులకు విన్నవించిన విషయాలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, హెచ్‌సియులో అడ్మిషన్స్ తీసుకునే దళిత విద్యార్థులందరికీ అడ్మిషన్ తో పాటు ఇంత విషంతో పాటు ఒక తాడును కూడా ఇస్తే, వారు ఉరి వేసుకోవడానికి పని కొస్తుందని సెంట్రల్ యూనివర్సిటీ విసికి రోహిత్ రాసిన సూసైడ్ నోట్ దేశ ప్రజల మనసులను కలచివేసిందని భట్టి గుర్తుచేశారు. యూనివర్సిటీలో ఆత్మగౌరవంతో బతికేందుకు కావాల్సిన హక్కులను కల్పించాలని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు యూనివర్సిటీలో జరుగుతున్న సంఘటనలపై యూనివర్సిటీ విసీకి వినతి పత్రాన్ని ఇచ్చారని, ఈ ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని సెంట్రల్ యూనివర్సిటీ ఎబివిపి యూనిట్ అధ్యక్షుడు సుశీల్ కుమార్ రోహిత్ వేముల తో పాటు మరో నలుగురు అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులను కావాలని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ యూనివర్సిటీ విసికి ఫిర్యాదు చేశారని, అలాగే బిజెపి నాయకత్వానికి కూడా సుశీల్ కుమార్ వివరించారని భట్టి విక్రమార్క తెలిపారు.

# బిజెపి కుట్ర (మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఎన్నికలను బిజెపి హైజాక్ చేయకుండా నిరోధించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తన విధిని నిర్వర్తించకుండా, బిజెపి ప్రయోజనాల కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. ఐదుగురు పెట్టుబడిదారుల పాపం కోసం బిజెపి ప్రభుత్వాన్ని నడుపుతోందని, దేశంలోని సామాన్య ప్రజల పక్షాన ఏ మాత్రం పనిచేయదని దుయ్యబట్టారు. 'జల్, జంగల్, జామిన్' (నీరు, అడవి, భూమి) గిరిజనులకే చెందుతుందని, ఎప్పటికీ వారికే ఉంటుందని పేర్కొన్నారు. ఒడిశా బిజెపి ప్రభుత్వం పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996ను అమలు చేయలేదన్నారు. గిరిజనులకు అటవీ హక్కుల పట్టాలు అందించలేదని, కాంగ్రెస్ 'పెసా, గిరిజన బిల్లు'ను తీసుకువచ్చిందని చెప్పారు. తాము ఈ చట్టాలను అమలు చేస్తామని, గిరిజనులకు వారి భూమి వారికే లభించేలా చూస్తామన్నారు.

**గిరిజనులు, దళితులు, మహిళలకు రక్షణ లేదు : ఖర్గే**

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం నుండి లౌకికవాదం, సోషలిజం అనే పదాలను తొలగించడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. కాషాయపార్టీ పాలనలో గిరిజనులు, దళితులు, మహిళలు, యువకులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పేదలు, గిరిజనులను రక్షించడానికి కాంగ్రెస్ 2006లో అటవీ హక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అయితే, నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆ చట్టాన్ని బలహీనపరచడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. పరిశ్రమల పేరుతో, బిజెపి ప్రభుత్వం ప్రతిచోటా అడవులను నాశనం చేస్తోందని, దళితులు, గిరిజనులు, యువకులు తమ హక్కుల కోసం పోరాడటం నేర్చుకోకపోతే వారిని కూడా తుడిచిపెడుతుందని ఖర్గే పేర్కొన్నారు. ఒడిశాలోని బిజెపి మద్దతుదారులు దళితులు, ప్రభుత్వ అధికారులపై దాడి చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ఇటీవల ఒడిశాలోని గంజాంలో ఇద్దరు దళితులను చితకబాది, మోకాళ్లపై పాకించి, బలవంతంగా గడ్డి తినమని, మురికి నీరు తామని ఒత్తిడి చేశారని, భువనేశ్వర్‌లో ఒక ప్రభుత్వ అధికారిని కూడా ప్రజల సమక్షంలోనే దాడి చేశారని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భారతదేశంలో 160 ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయగా, బిజెపి ప్రభుత్వం వాటిలో 23 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించిందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ సృష్టించిన ప్రజా ఆస్తులను మోదీ తన స్నేహితులకు అక్రయిస్తున్నారని, ఆయనకు ఒకే ఒక ఎజెండా ఉందని, అది రాజ్యాంగాన్ని నాశనం చేయడమేనన్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజ్యాంగాన్ని మార్చగలిగేలా 400 కంటే ఎక్కువ సీట్ల కోసం ఓటర్లను అభ్యర్థించారని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com